తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

RNI NO.TELTEL / 2013 /50370

శుక్రవారం 10.07.2026 | సంపుటి :12 సంచిక : 351 | పేజీలు :12 వెల : రూ. 4/-

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698




## అమెరికా ఏయిర్‌బేస్‌లపై ఇరాన్ ప్రతిఘటనా దాడులు

- పరస్పర దాడులతో దద్దరిల్లుతున్న పశ్చిమాసియా
- ట్రంప్ హెచ్చరికతో బహ్రెయిన్,కువైట్,ఖతార్‌ల లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ క్షిపణుల వర్షం
- జలసంధిలో నౌకల జోలికి పోవద్దు
- ఇరాన్ చేసే ఒక్కో దాడికి 20 రెట్లు తీవ్రమైన దాడి చేస్తాం : ట్రంప్



## ట్రంప్‌కు మరో ఎదురుదెబ్బ

- లైంగిక వేధిపుల కేసులో దోషిగా తేల్చిన అమెరికా ఫెడరల్ కోర్టు

## బీఎస్ఎన్ఎల్ నుంచి శాటిలైట్ ఫోన్

రూ.ధర లక్షగా నిర్ణయం

వివరాలు లోపలి పేజీల్లో..




## హైదరాబాద్‌లో ఒలింపిక్స్

# నిర్వహణే లక్ష్యం

### రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహించేందుకే స్పోర్ట్స్ పాలసీ తీసుకొచ్చాం

- ఆటల కోసం తెలంగాణ ప్రభుత్వం ముందడుగు వేసింది
- క్రీడలు,రాజకీయాలు, కెరియర్‌లో పీటీ ఉష మనందరికీ స్ఫూర్తి
- నవంబర్‌లో ఖేలో ఇండియా గేమ్స్‌కు ఆతిథ్యం ఇస్తున్నాం
- గచ్చిబౌలిలో యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ, గచ్చిబౌలి స్పోర్ట్స్ డిస్ట్రిక్ట్‌ను ప్రారంభించిన సీఎం రేవంత్

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి/ షాబాద్ (జనంసాక్షి):

2లో..

## గ్రీన్‌సిటీగా హైదరాబాద్

- కాలుష్య రహిత హైదరాబాద్‌గా తీర్చిదిద్దుతాం
- పరిశ్రమలన్నింటినీ ఓఆర్ఆర్ వెలుపలకు తరలిస్తాం
- దేశంలోనే అగ్రగామి పారిశ్రామిక రాష్ట్రంగా తెలంగాణ
- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్స్ ఆర్థిక వ్యవస్థ లక్ష్యం
- దేశ ఆర్థిక వ్యవస్థలో 10శాతం వాటా సాధించేలా ప్రణాళికలు
- రంగారెడ్డిజిల్లాలో ఇండియాస్ నెక్ట్స్- జెన్ సోలార్ మాడ్యూల్ యూనిట్‌ను ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

## మూలుగుతున్న నక్కపై తాటికాయ

### రామగుండం ఎరువుల కర్మాగారం రిపేరు.. రైతు గుండె బేజారు

పెద్దపల్లి జిల్లాలోని రామగుండం ఎరువుల కర్మాగారంలో గురువారం ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోయింది. ప్లాంటులోని అమ్మోనియా పైప్‌లైన్‌లో లీకేజీ తలెత్తడంతో యాజమాన్యం అన్ని యూనిట్లను మూసివేసింది. సాంకేతిక లోపం కారణంగానే ఈ లీకేజీ ఏర్పడినట్టు అధికార వర్గాలు తెలిపాయి. సమస్యను సరిచేసి తిరిగి ఉత్పత్తిని ప్రారంభించేందుకు కనీసం వారం రోజుల సమయం పట్టవచ్చని కంపెనీ వర్గాలు పేర్కొన్నాయి. తెలంగాణకు యూరియా అందించే ఏకైక దేశీయ కర్మాగారం ఇదే కావడంతో, ఖరీఫ్ సీజన్ కీలక దశలో ఈ పరిణామం రైతుల్లో ఆందోళన కలిగిస్తోంది.

పెద్దపల్లి/రామగుండం(జనంసాక్షి ప్రతినిధి) :




12లో..

## బండి భగీరథ్‌కు షరతులతో కూడిన బెయిల్

దర్యాప్తునకు సహకరించాలని హైకోర్టు ఆదేశం

వివరాలు లోపలి పేజీల్లో..

## అవినీతి జలగ

- లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన పంచాయతీరాజ్ ఏఈ
- ఎం-బుక్ నమోదు కోసం డబ్బులు డిమాండ్

## హరీశ్‌పై కేసీఆర్‌కు నమ్మకం లేకే..

### మంత్రి పదవికి దూరం పెట్టారు

ఇరిగేషన్‌లో ఆయన నిష్ణాతుడైతే వాళ్ల మామ ఆయనను ఎందుకు తొలగించాడు?

ఎల్‌నినోపై కార్యాచరణ చేపడతున్నాం : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్,జూలై9(జనంసాక్షి): ఇరిగేషన్‌లో హరీశ్‌రావు నిష్ణాతుడైతే వాళ్ల మామ కేసీఆర్ ఆయనను మంత్రి పదవి నుంచి మొదట్లో ఎందుకు తొలగించారని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. హరీశ్‌రావుపై కేసీఆర్‌కు నమ్మకం లేకనే మంత్రి పదవి నుంచి తీసేశారని విమర్శించారు. ఈ మేరకు మాజీ మంత్రి హరీశ్‌రావుకి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. గురువారం సచివాలయంలో మీడియాతో మిగతా 9లో..



## మూసీ పునరుజ్జీవన ప్రాజెక్ట్ తొలిదశ పనులకు గ్రీన్ సిగ్నల్

రూ.7,345.12 కోట్ల పరిపాలనా అనుమతులు ఇస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు



2లో..

## స్వచ్ఛ ఇంధనాన్ని ప్రోత్సహించడమే లక్ష్యం

- అణుశక్తి ఒప్పందంపై భారత్,ఆస్ట్రేలియా సంతకాలు
- భారత్‌కు ఆస్ట్రేలియా యురేనియం సరఫరా చేస్తుంది: మోదీ
- క్రిటికల్ మినరల్ కారిడార్, డిఫెన్స్ ఇన్నోవేషన్ కారిడార్ ఏర్పాటుకు ప్రణాళికలు



2లో..

## హైదరాబాద్‌లో 'ఎస్ఐఆర్'పై అప్రమత్తంగా ఉండండి



- ప్రతీ ఒక్కరి ఓటు నమోదయ్యేలా చూడాలి..
- దొంగ ఓట్లు లేకుండా చూడాలి
- ఈ కార్యక్రమం అత్యంత కీలకమైన అంశం
- పార్టీ శ్రేణులకు కేటీఆర్ . పిలుపు



# స్వచ్ఛ ఇంధనాన్ని ప్రొత్సహించడమే లక్ష్యం

మెల్‌బోర్న్(జనంసాక్షి):మూడుదేశాల పర్యటనలో భాగంగా ప్రస్తుతం ఆస్ట్రేలియాలో ఉన్న మోదీ.. ఆ దేశ ప్రధాని ఆంథోనీ ఆల్బనీస్‌తో కలిసి ఇండియా–ఆస్ట్రేలియా సీఈఓ ఫోరమ్‌లో ప్రసంగించారు. వాణిజ్యం, రక్షణ, విద్య సహా పలు అంశాలపై ఆల్బనీస్‌తో చర్చించారు. అలాగే స్వచ్ఛ ఇంధనాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో కీలకమైన అణుశక్తి ఒప్పందంపై సంతకాలు చేశారు. భారత్‌కు ఆస్ట్రేలియా యురేనియం సరఫరా చేస్తుందని మోదీ వెల్లడించారు. క్రిటికల్ మినరల్ కారిడార్, డిఫెన్స్ ఇన్నోవేషన్ కారిడార్ ఏర్పాటుకు ప్రణాళికలను ప్రకటించారు. ఇండో–పసిఫిక్‌లో శాంతి, సుస్థిరత, స్వేచ్ఛా నౌకాయానంపై కలిసి అడుగులు వేస్తామని తెలిపారు. తాజా పర్యటన ఇరు దేశాల వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.పశ్చిమాసియా మరోసారి దద్దరిల్లుతోంది. ప్రస్తుతం ఆస్ట్రేలియాలో ఉన్న ప్రధాని నరేంద్రమోదీ తాజా పరిస్థితులపై మెల్‌బోర్న్‌లో మీడియాతో మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న అన్ని ఘర్షణలు దౌత్యం, చర్చలు ద్వారానే పరిష్కారం సాధ్యమవుతాయని పేర్కొన్నారు.

క్రికెట్ పోలిక తెచ్చిన మోదీ..

భారత్, ఆస్ట్రేలియా ప్రజలకు ఎంతో ఇష్టమైన ఆట క్రికెట్ అందుకే ఈ రెండు దేశాల మధ్య చర్చలు జరిగినప్పుడల్లా క్రికెట్ ప్రస్తావన వస్తూనే ఉంటుంది. తాజాగా కుదిరిన యురేనియం డీల్ నేపథ్యంలో ఆ భాషలోనే మన ప్రధాని మాట్లాడారు. "ప్రపంచ క్రీడా రాజధాని అయిన మెల్‌బోర్న్‌లో మనం ఈ రోజు ఉన్నాం. ఇక్కడ ఆ క్రీడల గురించి మాట్లాడకపోవడం అంటే.. టాస్ వేసిన తర్వాత కూడా క్రికెట్ మ్యాచ్ ప్రారంభం కాకపోవడమే అవుతుంది. ఈ రెండు దేశాల సంబంధాలకు ఇదొక ప్రత్యేక దౌత్యపరమైన భాష. మన సమావేశాలు క్రికెట్ మ్యాచ్‌ల్లానే ఉంటాయి. అజెండా వన్డే మ్యాచ్‌లా, నిర్ణయాలు టీ20 అంత వేగంగా, భాగస్వామ్యం టెస్ట్ మ్యాచ్ అంత సుదీర్ఘంగా, గాఢంగా ఉంటుంది" అని మోదీ తెలిపిన వర్ణనకు ఆడియన్స్ చప్పట్లతో స్పందించారు. యురేనియం డీల్ కుదిరిన నేపథ్యంలో ఆయన ఈ విధంగా మాట్లాడారు.

# భారత్‌కు ఎగుమతుల్లో 57 % ఉత్పత్తులపై సుంకాలుండవు

**మోదీ పర్యటనకు ముందే.. న్యూజిలాండ్ ప్రధాని కీలక ప్రకటన**

క్రైస్ట్‌చర్చ్(జనంసాక్షి):భారత ప్రధాని నరేంద్ర మోదీ న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లడానికి ముందే ఆ దేశ ప్రధాని క్రిస్టఫర్ లుక్సాన్ కీలక ప్రకటన చేశారు. భారత్‌కు న్యూజిలాండ్ ఎగుమతి చేస్తున్న వస్తువుల్లో 57 శాతం ఉత్పత్తులపై ఇకపై ఎలాంటి సుంకాలు ఉండబోవని చెప్పారు. ఇరుదేశాల మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరిన తొలి రోజు నుంచే ఇది అమల్లోకి వస్తుందన్నారు. ఈ చారిత్రక ఒప్పందం ద్వారా భారత మార్కెట్‌లో న్యూజిలాండ్ ఉత్పత్తులకు విస్తృత ప్రవేశం లభిస్తుందని, ఇది న్యూజిలాండ్ వ్యాపారాలకు ఊతమిస్తుందని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు.మూడు దేశాల పర్యటనలో భాగంగా ప్రస్తుతం ఆస్ట్రేలియాలో ఉన్న ప్రధాని మోదీ.. జులై 10, 11 తేదీల్లో న్యూజిలాండ్‌లో పర్యటించనున్నారు. దాదాపు గత 40 ఏళ్లలో భారత ప్రధాని అక్కడ పర్యటించడం ఇదే తొలిసారి. పర్యటనలో భాగంగా ఆక్లాండ్‌లో ఏర్పాటు చేయనున్న సమావేశంలో వాణిజ్య ఒప్పందాలు, అభివృద్ధి తదితర అంశా లపై ఇరుదేశాల నేతలు చర్చించనున్నారు.

# గ్రీన్‌సిటీగా హైదరాబాద్



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి/ షాబాద్/(జనంసాక్షి):** తెలంగాణను దేశంలోనే అగ్రగామి పారిశ్రామిక రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం సీతారాంపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఇండియాస్ నెక్స్ట్– జెన్ సోలార్ మాడ్యూల్ యూనిట్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. అనంతరం యూనిట్‌లోని వివిధ ఉత్పత్తి విభాగాలను పరిశీలించి తయారీ ప్రక్రియను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, తెలంగాణను దేశంలోనే అగ్రగామి పారిశ్రామిక రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. "తెలంగాణ రైజింగ్– 2047" విజన్‌తో రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా పనిచేస్తోందన్నారు. ప్రపంచ స్థాయి పెట్టుబడులను ఆకర్షించేందుకు అత్యాధునిక మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక అనుకూల విధానాలు, వేగవంతమైన అనుమతుల వ్యవస్థను ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు.హైదరాబాద్ చుట్టూ ఉన్న ప్రాంతాలను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తూ, ఆధునిక పారిశ్రామిక మండలాల ఏర్పాటు, సేవా రంగ విస్తరణ, రవాణా మౌలిక సదుపాయాల బలోపేతంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. యువతకు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను అందించేందుకు స్కిల్స్ యూనివర్సిటీ, అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లు, పాలిటెక్నిక్ కళాశాలలు, ఐటీఐలను ఆధునీకరిస్తున్నట్లు తెలిపారు.సుస్థిర అభివృద్ధి లక్ష్యంగా సౌరశక్తి వినియోగాన్ని విస్తరిస్తూ పర్యావరణ హిత పారిశ్రామికీకరణకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రీమియర్ ఎనర్జీస్ వంటి సంస్థలు రాష్ట్రంలో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని కోరుతూ, పరిశ్రమలకు అవసరమైన అన్ని విధాల సహకారాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని హామీ ఇచ్చారు.సీతారాంపూర్‌లో పరిశ్రమ ఏర్పాటుతో భూములు కోల్పోయిన కుటుంబాల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్‌ను ముఖ్యమంత్రి ఆదేశించారు. అర్హులైన వారికి ఇంటి పట్టాలు, ఉపాధి అవకాశాలు, వ్యాపార సముదాయాల ఏర్పాటు వంటి చర్యలను వేగవంతం చేయాలని సూచించారు.రంగారెడ్డి జిల్లా రైతులు చేసిన త్యాగాల వల్లే ఈ పారిశ్రామిక అభివృద్ధి సాధ్యమైందని ముఖ్యమంత్రి కొనియాడారు. రాష్ట్ర అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని, తెలంగాణను ప్రపంచ స్థాయి పెట్టుబడుల గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణను 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. పెట్టుబడులను ఆకర్షించడమే కాకుండా, ఉత్పత్తి కేంద్రంగా తెలంగాణను అభివృద్ధి చేయడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రీమియర్ ఎనర్జీస్ సంస్థ కేవలం 12 నెలల్లో 75 ఎకరాల్లో అత్యాధునిక తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ఏర్పాటుకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేశాయని తెలిపారు.జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పునరుత్పాదక ఇంధన రంగానికి డిమాండ్ వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో తెలంగాణలో పరిశ్రమలకు అనుకూల వాతావరణం, నూతన ఇంధన విధానం, ఓపెన్ యాక్సెస్ విధానం, పరిశ్రమలకు ప్రోత్సాహకాలు, సబ్సిడీల అమలు ద్వారా మరిన్ని పెట్టుబడులను ఆకర్షిస్తున్నామని మంత్రి వెల్లడించారు. జహీరాబాద్‌లో జాతీయ పారిశ్రామిక తయారీ మండలి ఏర్పాటు, పరిశ్రమలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన, స్వచ్ఛ ఇంధన రంగాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. "తెలంగాణ రైజింగ్?2047" విజన్‌లో భాగంగా రాష్ట్రాన్ని క్లీన్ ఎనర్జీ, అడ్వాన్స్‌డ్ మాన్యుఫాక్చరింగ్, ఇన్నోవేషన్, సుస్థిర అభివృద్ధికి ప్రపంచ కేంద్రంగా తీర్చిదిద్దుతామని మంత్రి స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ప్రీమియర్ ఎనర్జీస్ సంస్థ యాజమాన్యాన్ని మంత్రి అభినందిస్తూ, రాష్ట్ర అభివృద్ధిలో పరిశ్రమల భాగస్వామ్యం మరింత పెరగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావు, ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, మనోహర్ రెడ్డి, టీజీఐఐసీ ఛైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో ఒలింపిక్స్ నిర్వహణే లక్ష్యం

హైదరాబాద్(జనంసాక్షి): హైదరాబాద్ గచ్చిబౌలి క్రీడా మైదానంలో "గచ్చిబౌలి క్రీడా జిల్లా""యువ భారత శారీరక విద్య, క్రీడా విశ్వవిద్యాలయం" ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భారత ఒలంపిక్ సంఘం అధ్యక్షురాలు, రాజ్యసభ సభ్యురాలు పీటీ ఉష, మంత్రి వాకిటి శ్రీహరి, శాసన మండలి ప్రధాన విప్ పట్నం మహేందర్ రెడ్డి, సలహాదారు జితేందర్ రెడ్డి, పుల్లెల గోపీచంద్, క్రీడా విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ జి. కిషోర్, క్రీడా సంస్థ ఛైర్మన్ శివసేనా రెడ్డి, ప్రముఖ క్రీడాకారులు, ద్రోణాచార్య, అర్జున పురస్కార గ్రహీతలు పాల్గొన్నారు.ముఖ్యమంత్రి క్రీడా విశ్వవిద్యాలయం చిహ్నాన్ని, జాలగూడును ఆవిష్కరించడంతో పాటు శారీరక అక్షరాస్యత మిషన్‌ను, యువ భారత క్రీడా ఉపకార వేతనాలను, విద్యా కోర్సులను ప్రారంభించారు. దివ్యాంగ క్రీడాకారుల కోసం జాతీయ ప్రతిభాన్వేషణ కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించి, ఆదిత్య మెహతా ఫౌండేషన్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. అలాగే కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖకు చెందిన "మై భారత్" కార్యక్రమంతో కూడా అవగాహన ఒప్పందం చేసుకున్నారు. తెలంగాణ ఆతిథ్యం ఇవ్వనున్న ఖేలో ఇండియా యువజన క్రీడలు జాతీయ అంతర్ జిల్లా జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు, హాకీ లీగ్, ప్రపంచ పికిల్ బాల్ లీగ్, విలువిద్య ప్రీమియర్ లీగ్, టెన్నిస్ ప్రీమియర్ లీగ్ వివరాలను ప్రభుత్వం ప్రకటించింది. చక్రాలపై క్రీడా జ్ఞాన కార్యక్రమాన్ని కూడా సీఎం ప్రారంభించారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, యువకులు దేశ సంపద అని, ఒలింపిక్స్‌లో ప్రపంచ దేశాలతో పోల్చితే భారత్ వెనుకబడి ఉందని, స్పష్టమైన విధానం లేకపో వడమే అందుకు కారణమని అన్నారు. పీటీ ఉష వంటి క్రీడాకారులు అరుదుగా దేశానికి పేరు తెచ్చినా, ప్రపంచ దేశాలు భారత్‌ను క్రీడారంగంలో రాణించిన దేశంగా గుర్తించడం లేదని పేర్కొన్నారు. అందుకే తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక క్రీడా విధానాన్ని తీసుకొచ్చిందని, ప్రభుత్వ–ప్రైవేట్ భాగస్వామ్య విధానంలో క్రీడా విశ్వవిద్యాలయాన్ని ప్రారంభించామని తెలిపారు. క్రీడల్లో రాణించడం వల్లే పీటీ ఉష రాజ్యసభ సభ్యురాలి స్థాయికి చేరారని గుర్తు చేశారు. రాబోయే రోజుల్లో ఒలింపిక్స్‌కు వేదికగా తెలంగాణను తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

# ట్రంప్‌కు మరో ఎదురుదెబ్బ

**లైంగిక వేధిపుల కేసులో**

**దోషిగా తేల్చిన అమెరికా ఫెడరల్ కోర్టు**

వాషింగ్టన్,జూలై9(జనంసాక్షి) :అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు మరో న్యాయపరమైన ఎదురుదెబ్బ తగిలింది. లైంగిక వేధిపుల కేసులో ట్రంప్‌ను అమెరికా ఫెడరల్ కోర్టు దోషిగా తేల్చింది. రచయిత్రి, మాజీ కాలమిస్టు జీన్ క్యారల్‌కు 5 మిలియన్ అమెరికన్ డాలర్లు అంటే దాదాపు రూ.47 కోట్లు చెల్లించాలని అమెరికా ఫెడరల్ కోర్టు ఆదేశించింది. 2023లో విచారణ జరిపిన జ్యూరీ, ట్రంప్ లైంగిక దాడికి పాల్పడినట్లు, అనంతరం క్యారల్ పరువును దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేసినట్లు తేల్చింది. దీంతో 5 మిలియన్ డాలర్ల పరిహారం చెల్లించాలని అప్పుడే తీర్పు వెలువరించింది. లైంగిక దాడికి గాను 2 మిలియన్ డాలర్లు, పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలకు గాను 3 మిలియన్ డాలర్లు నష్టపరిహారం చెల్లించాలని ఆదేశిస్తూ మే 2023లో కోర్టు తీర్పునిచ్చింది. ఈ తీర్పుపై ట్రంప్ చేసిన అప్పీలును విచారించడానికి గత వారం అమెరికా సుప్రీంకోర్టు నిరాకరించింది. 1996లో న్యూయార్క్‌లోని ఒక డిపార్ట్‌మెంట్ స్టోర్‌లోని డ్రెస్సింగ్ రూమ్‌లో తనపై ట్రంప్ లైంగిక దాడి చేశారని క్యారల్ ఆరోపించారు. ఆ విషయాన్ని 2019లో ప్రచురితమైన ఓ పుస్తకంలో క్యారల్ రాశారు. ఆ ఆరోపణలు పూర్తిగా కల్పితమని, క్యారల్ ఒక పిచ్చిదని ట్రంప్ కొట్టిపడేశారు. కాగా, ఇది ట్రంప్‌నకు సంబంధించిన ఏకైక సివిల్ కేసు కాదు. 2024లో పరువు నష్టం కేసులో క్యారల్‌కు అదనంగా 83.3 మిలియన్ డాలర్లు చెల్లించాలని మరో జ్యూరీ తీర్పు ఇచ్చింది. ఆ కేసు కూడా ప్రస్తుతం న్యాయపరమైన పక్రియలో కొనసాగుతోంది.

# జోసెఫ్ రావణ్ బ్యాంక్ ఖాతాలను స్తంభింప చేస్తూ ఆదేశాలు

కాకినాడ:రెండేళ్లుగా యూట్యూబ్ వేదికగా విద్వేషపూరిత ప్రసంగాలు చేస్తున్న యూట్యూబర్ జోసఫ్ రావణ్ ఆర్థిక వనరులపై పోలీసులు దృష్టి పెట్టారు. ఇందులో భాగంగా ఐసీఐసీఐ, యస్ బ్యాంకులకు కాకినాడ పోలీసులు అధికారికంగా లేఖలు రాశారు. పోలీసుల నుంచి వచ్చిన విజ్ఞప్తిని పరిశీలించిన బ్యాంక్ యాజమాన్యాలు, అతని పేరున ఉన్న ఖాతాలను తక్షణమే నిలిపివేస్తూ నిర్ణయం తీసుకున్నాయి. పోలీసుల ప్రాథమిక విచారణలో జోసఫ్ రావణ్ ఆర్థిక వనరులకు సంబంధించిన కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. 'ప్రశ్న' అనే వెబ్‌సైట్‌లో ఈ వివాదాస్పద వీడియోలను పోస్ట్ చేయడం ద్వారా అతను నెలకు రూ. 1.50 లక్షలకు పైగా ఆదాయం గడిస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

# వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తున్నాం

**రెండున్నరేళ్లలోనే 35వేల కోట్లు రైతులకు అందచేత**
**ఖమ్మం పర్యటనలో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క**

ఖమ్మం,జూలై9(జనంసాక్షి):కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తున్నామని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. రైతాంగానికి అవసరమైన సహాయ సహకారాలు అన్ని విధాలుగా అందిస్తున్నామని పేర్కొన్నారు. గురువారం ఖమ్మం జిల్లా చింతకాని మండలం లచ్చగూడెంలో డిప్యూటీ సీఎం పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. చింతకాని మండలం జగన్నాధపురం మత్కేపల్లి క్రాస్ రోడ్డులో రైతు ఆశీర్వాద సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతు ఆశీర్వాద సభకు సీఎం రేవంత్‌రెడ్డితో పాటు కేబినెట్ మంత్రులు అందరినీ ఆహ్వానించామని పేర్కొన్నారు. పదేళ్ల పాటు పాలించిన బీఆర్ఎస్ రైతు భరోసాకు రూ.75 వేల కోట్లు ఖర్చు చేసిందని మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసాకు కేవలం రెండున్నరేళ్లలో రూ.35 వేల కోట్లను రైతులకు అందజేసిందని చెప్పుకొచ్చారు. కేసీఆర్ హయాంలో క్రాప్ డ్యామేజ్‌కి ఒక్క రూపాయి కూడా ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో రైతుల కోసం పని చేస్తోందని స్పష్టం చేశారు. రైతుభరోసా కింద కేవలం తొమ్మిది రోజుల్లో ఎనిమిది ఎకరాల చొప్పున పూర్తిస్థాయిలో అందరికీ రూ.8759 కోట్లు ఇచ్చామని వెల్లడించారు. రైతు ఆశీర్వాద సభలో మరో రూ.1900 కోట్లు రైతు భరోసాకు తొమ్మిది ఎకరాల నుంచి యాభై ఎకరాల వరకూ విడుదల చేయనున్నామని తెలిపారు. అన్నదాతలు రైతు ఆశీర్వాద సభకు పెద్ద సంఖ్యలో తరలి రావాలని మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాధపురంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న మెగా రైతు మేళాను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ల చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యనారాయణ, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, జిల్లా కలెక్టర్ దివాకరతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. రైతులకు ఆధునిక సాగు పద్ధతులు, ప్రభుత్వ పథకాలు, వ్యవసాయ సాంకేతికతపై అవగాహన కల్పించడమే ఈ మెగా రైతు మేళా ప్రధాన లక్ష్యంగా నిర్వాహకులు తెలిపారు.మెగా రైతు మేళా ప్రాంగణంలోనే శుక్రవారం మధ్యాహ్నం రైతు ఆశీర్వాద సభ నిర్వహించనున్నారు. ఈ సభకు సీఎం రేవంత్ రెడ్డి హాజరుకానున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ కార్యక్రమాలు, వ్యవసాయ అభివృద్ధి చర్యలపై సీఎం రైతులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ప్రభుత్వంపై భట్టి విక్రమార్క విమర్శలు గుప్పించారు. దశాబ్దాల క్రితం నిర్మించిన నాగార్జునసాగర్, ఎస్ఆర్ఎస్పీ, కడెం వంటి ప్రాజెక్టులు ఇప్పటికీ బలంగా ఉన్నాయని, బీఆర్ఎస్ నిర్మించిన ప్రాజెక్టుల పరిస్థితి రాష్ట్ర ప్రజలకు తెలిసిందేనని వ్యాఖ్యానించారు. ఖమ్మం జిల్లాకు గత ప్రభుత్వాలు తగిన నీటి వనరులు అందించలేదని, ఆ విషయాన్ని చరిత్రతో సహా నిరూపిస్తామని అన్నారు. బీఆర్ఎస్ ప్రజలను మాటలతో మోసం చేసే పార్టీ అని, 2023 అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ఫలితాలే అందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ పార్టీ నేతలు జిల్లాల పర్యటనలు చేస్తూ విమర్శలు చేస్తున్నప్పటికీ ప్రజలు నమ్మే పరిస్థితి లేదని భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం తక్కువగా నమోదవుతోందని, రైతులు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పంటల ఎంపిక చేసుకోవాలని సూచించారు. తక్కువ కాలంలో దిగుబడి వచ్చే పంటలు, ఆరుతడి పంటలు, పప్పుధాన్యాల సాగుపై రైతులు దృష్టి సారించాలని కోరారు. నాగార్జునసాగర్‌లో నీటి లభ్యత తక్కువగా ఉన్న నేపథ్యంలో సీతారామ ప్రాజెక్టు, రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా వైరా ప్రాజెక్టుకు నీటిని విడుదల చేస్తున్నామని తెలిపారు.

# అమెరికా ఏయిర్‌బేస్‌లపై ఇరాన్ ప్రతిఘటనా దాడులు

వాషింగ్టన్,టెహ్రాన్(జనంసాక్షి):పశ్చిమాసియాలో అమెరికా–ఇరాన్ పరస్పర దాడులు తీవ్రమయ్యాయి. ఇరాన్‌పై విరుచుకుపడతామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన గంటల వ్యవధిలోనే.. దాడులు జరిగాయి. దాంతో గురువారం ఇరాన్ ప్రతీకార దాడులు మొదలుపెట్టింది. గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలను టార్గెట్ చేస్తోంది. బహ్రెయిన్‌లోని అమెరికా నౌకాదళానికి చెందిన ఫిఫ్త్ ఫ్లీట్ హెడ్‌క్వార్టర్స్‌లో మంటలు చెలరేగిన దృశ్యాలను ఇరాన్ మీడియా ప్రసారం చేసింది. కువైట్‌లోని స్థావరాలపైనా దాడులు చేసినట్లు వెల్లడించింది. తమ దేశంవైపు వస్తోన్న డ్రోన్లు, క్షిపణులను అడ్డుకుంటున్నామని కువైట్ వెల్లడించింది. ఖతార్‌లోనూ దాడులు జరిగాయి. హర్మూజ్‌లో వెళ్తున్న నౌకలను ఇరాన్ టార్గెట్ చేయడంతో తాజా ఘర్షణలు మొదలయ్యాయి. జలసంధిలో నౌకలపై దాడులను ఏమాత్రం సహించబోమని తాజాగా ట్రంప్ హెచ్చరించారు. ఇరాన్ చేసే ఒక్కో దాడికి 20 రెట్లు తీవ్రమైన దాడి చేస్తామని పేర్కొన్నారు. ఇప్పటికే రాత్రి సమయంలో చేసిన దాడులతో ఇరాన్ డీల్ కోసం ప్రాధేయపడుతోందని వ్యాఖ్యానించారు. "ఇరాన్ నుంచి మాకు కాల్ వచ్చింది. వారు డీల్ కోసం తహతహలాడుతున్నారు. అందుకు వారు అర్హులా..? వారు డీల్‌ను గౌరవిస్తారా..? అనేదానిపై మాత్రం నాకు పూర్తి స్పష్టత లేదు. అదే అసలు సమస్య" అని తుర్కియే నుంచి వస్తూ తన ఎయిర్‌ఫోర్స్‌వన్ విమానంలో ట్రంప్ మీడియాతో మాట్లాడారు. ఇప్పటికే అమెరికా బందర్ అబ్బాస్, అణుప్లాంట్ ఉన్న బుషెహర్, సిరిక్, జస్క్‌తో పాటు అబూ మూసా ద్వీపంపై దాడులు నిర్వహించింది.

90 లక్ష్యాలపై దాడి: అమెరికా

ఇరాన్‌లోని 90 లక్ష్యాలను ఢీకొట్టామని యూఎస్ మిలిటరీకి చెందిన సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. దానికి సంబంధించిన వీడియోను విడుదల చేసింది. ఇంతటితో తాజా విడత దాడులు ముగిసినట్లు ప్రకటించింది. అమెరికా లక్ష్యంగా చేసుకున్న వాటిల్లో మషహద్ నగరానికి వెళ్లే రెండు బ్రిడ్జ్‌లు కూడా ఉన్నాయని ఇరాన్ వెల్లడించింది. ఇప్పుడు ఆ నగరంలోనే అయతుల్లా అలీ ఖమేనీని సమాధి చేయనున్నారు.

అణువిద్యుత్ కేంద్రం లక్ష్యంగా అమెరికా దాడి : ఇరాన్

తమ దేశంలోని బుషెహర్ అణు విద్యుత్ కేంద్రం సమీపంలో అమెరికా వైమానిక దాడులు చేసినట్లు ఇరాన్ ఆరోపించింది. అయితే, ఏదైనా నష్టం వాటిల్లిందా? అన్న విషయంపై స్పష్టత లేదు. ఇరాన్ ఆరోపణలపై అమెరికా సైన్యం కూడా స్పందించలేదు. ఇరాన్‌లో ప్రస్తుతం పనిచేస్తున్న ఏకైక విద్యుత్ ప్లాంట్ బుషెహర్ కావడం గమనార్హం. రష్యన్ సాంకేతిక నిపుణుల పర్యవేక్షణలో ఉన్న ఈ ప్లాంట్ పరిసర ప్రాంతాలపై యుద్ధం ప్రారంభం నుంచి పలుసార్లు దాడులు జరిగాయి.ఇటీవల జరిగిన దాడిలో క్షిపణి శకలం తగిలి ప్లాంటు సిబ్బందిలో ఒకరు చనిపోయారని ఇరాన్ వెల్లడించింది. సమీపంలోని భవనం కూడా దెబ్బతిన్నట్లు తెలిపింది. అయితే, దీనిని లక్ష్యంగా చేసుకొని దాడులు జరగడం ఆందోళనకర పరిణామమే అయినప్పటికీ.. ఆ ఘటనలో అణువిద్యుత్ కేంద్రం నుంచి రేడియేషన్ విడుదల కాలేదని అంతర్జాతీయ అణుశక్తి సంస్థ తెలిపింది.



# హైదరాబాద్‌లో 'ఎస్ఐఆర్'పై అప్రమత్తంగా ఉండండి

**హైదరాబాద్(జనంసాక్షి):**

హైదరాబాద్ జీహెచ్ఎంసీ పరిధిలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం పైన ప్రత్యేక దృష్టి సారించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ నేతలకు సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఐఆర్ కార్యక్రమం అత్యంత మందకొడిగా సాగుతున్నదని, ముఖ్యంగా ప్రభుత్వం, ఎలక్షన్ కమిషన్ నియమించిన బూత్ లెవెల్ ఆఫీసర్లకు సరైన శిక్షణ, తగిన ఏర్పాట్లు ఇవ్వకపోవడంతో మొత్తం ఈ కార్యక్రమం అత్యంత మందకొడిగా కొనసాగుతున్నదని, దీనివల్ల ప్రజలకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నట్లు ఫీడ్‌బ్యాక్ వస్తోందని అన్నారు.గ్రేటర్ హైదరాబాద్ బీఆర్ఎస్ పార్టీ నేతలతో కేటీఆర్ సమావేశమయ్యారు. మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ నివాసంలో జరిగిన ఈ సమావేశానికి గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ ప్రధాన కార్యదర్శులు, నియోజకవర్గ ఇంచార్జులు, ఎస్ఐఆర్ (హఎఖీ) కమిటీ నేతలు హాజరయ్యారు. గ్రేటర్ హైదరాబాద్ నగరంలో ఎస్ఐఆర్ పై ప్రజల నుంచి వస్తున్న అభ్యంతరాలు, అలాగే పార్టీ పరంగా చేయాల్సిన సూచనలపై ఈ సందర్భంగా సమావేశంలో చర్చించారు.ఇలీవఇబీబితిలవ ఃతీజీనిఇష్ట్ర ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ముఖ్యంగా హైదరాబాద్ లాంటి అత్యధిక జనసాంద్రత ఉండే మహానగరంలో ఈ ఎస్ఐఆర్ కార్యక్రమానికి సంబంధించిన ఫారాల పంపిణీ, వాటిలో ఓటర్ల నమోదు వంటి అంశాలపై సరైన అవగాహన లేకుండానే అధికారులను కేటాయించారని కిందటి స్థాయి నుంచి పార్టీ వర్గాలు ఇస్తున్న ఫీడ్‌బ్యాక్‌ను కేటీఆర్ ప్రస్తావించారు. అయితే ఎస్ఐఆర్ కార్యక్రమం అత్యంత కీలకమైన అంశమని.. 'ఒక వ్యక్తికి ఒకే ఓటు' ఉండాలన్న రాజ్యాంగ స్ఫూర్తి ఆధారంగా దొంగ ఓట్లు లేకుండా చూడాలని కోరారు. ఒకవైపు మొన్నటికి మొన్న జూబ్లీ హిల్స్ నియోజకవర్గానికి సంబంధించి ఉపఎన్నికల సందర్భంగా భారీగా బయటపడిన డబుల్ ఓట్లు, దొంగ ఓట్ల వ్యవహారాన్ని ప్రతి ఒక్క నాయకుడు గుర్తుంచుకోవాలని సూచించారు.

**ప్రతీ ఒక్కరి ఓటు నమోదయ్యేలా చూడాలి..**

ఈ సందర్భంగా ఎస్ఐఆర్‌కు సంబంధించి పార్టీ నియమించుకున్న బూత్ లెవెల్ అసిస్టెంట్ల సహకారంతో ఏ ఒక్కరి ఓటు పోకుండా చూడాలన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు అధికారంలో ఉన్నందువలన డబుల్ ఓట్ల నమోదు లేదా ఇతర ప్రాంతాల వారిని ఆయా నియోజకవర్గాల్లో ఓటర్లుగా నమోదు చేయించే ప్రయత్నాలు చేస్తున్నాయని, ఇలాంటి సందర్భంలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, మద్దతు దారుల ఓట్లు పోయేలా ప్రయత్నం చేసే ప్రమాదం ఉందన్నారు. కాబట్టి ప్రతీ ఒక్కరి ఓటు నమోదయ్యేలా చూడాలని, ఏ ఒక్కరి ఓటు అన్యాయంగా తొలగించబడకుండా చూడాలన్నారు. దీంతోపాటు ఆయా నియోజకవర్గాల్లో ఉన్న డబుల్ ఓట్ల పైన పార్టీ శ్రేణులు దృష్టి సారించాలన్నారు. మరోవైపు ఎస్ఐఆర్‌కు సంబంధించిన అంశంలో ఎదురవుతున్న ఇబ్బందులను, ప్రజల నుంచి వస్తున్న ఫీడ్ బ్యాక్ ని, సమస్యలను ఎలక్షన్ కమిషన్ దృష్టికి ఎప్పటికప్పుడు పార్టీ తరఫున తీసుకుపోతున్నట్లు తెలిపారు. నగరంలో ఎస్ఐఆర్ కు సంబంధించి స్థానిక ఎమ్మెల్యేలు మరింత చురుగ్గా ముందుకు పోవాలన్నారు. బూత్ లెవెల్ కార్యకర్తల సహకారంతో మరింత వేగం పెంచాల న్నారు. ప్రతి ఒక్క ఎమ్మెల్యే, స్థానిక కార్యకర్తలు, పార్టీ నియమించుకున్నబూత్ లెవెల్ అసిస్టెంట్లతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ నివాసంలో జరిగిన జీహెచ్ఎంసీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, నియోజకవర్గాల ఇంచార్జులు, సీనియర్ నాయకులకు ఎస్ఐఆర్ పైన కేటీఆర్ దిశా నిర్దేశం చేశారు

# మూసీ పునరుజ్జీవన ప్రాజెక్ట్ తొలిదశ పనులకు గ్రీన్ సిగ్నల్

**హైదరాబాద్(జనంసాక్షి):**

మూసీ పునరుజ్జీవన ప్రాజెక్ట్ తొలి దశ పనులకు తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టుకు రూ.7,345.12 కోట్ల పరిపాలనా అనుమతులు ఇస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. జోన్–1ఏ, జోన్–1బీ ప్రాధాన్య కారిడార్లలో మూసీ అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. హిమాయత్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు 9.20 కి.మీ., ఉస్మాన్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు 11.80 కి.మీ. మేర అభివృద్ధి పనులు కొనసాగనున్నాయి. మొత్తం 21 కి.మీ. ప్రాధాన్య స్ట్రెచ్‌లో రివర్‌ఫ్రంట్ పనులు జరుగనున్నాయి. భూసేకరణ వ్యయం మినహా రూ.7,345.12 కోట్లకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇందులో ఏడీబీ నుంచి రూ.4,500 కోట్ల రుణాన్ని తీసుకోనుండగా..మిగతా .2,845.12 కోట్లు ఊఓఆం లేదా ఃఉఎఎఅ నుంచి రుణం తీసుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. మూసీ రివర్‌ఫ్రంట్ పనులను ఈపీసీ విధానంలో నిర్వహించనున్నారు. ప్రాజెక్టు పర్యవేక్షణకు ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ నియామకానికి సర్కార్ ఆమోదం తెలిపింది. ఈ మేరకు తదుపరి చర్యలు చేపట్టాలని ఎమ్ఆర్‌డీసీఎల్ కు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

# బీఎస్ఎన్ఎల్ నుంచి శాటిలైట్ ఫోన్..

**రూ.ధర లక్షగా నిర్ణయం**

న్యూఢిల్లీ(జనంసాక్షి):ప్రభుత్వరంగ టెలికాం కంపెనీ బీఎస్ఎన్ఎల్ శాటిలైట్ ఫోన్‌ను విడుదల చేసింది. దీని ధరను రూ.1.34 లక్షలుగా నిర్ణయించింది. డిఫెన్స్, మారిటైమ్, డిజాస్టర్ రెస్పాన్స్ యూజర్లకు మాత్రమే విక్రయించనున్నారు. ఈ మేరకు గురువారం సామాజిక మాధ్యమాల్లో ఓ పోస్ట్ పెట్టింది. ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఉన్నప్పుడు ఈ ఫోన్ సాయంతో కాల్స్, ఎస్సెమ్మెస్‌లు చేసుకోవచ్చు. సంప్రదాయ మొబైల్ నెట్‌వర్క్‌లేని చోట ఈ శాటిలైట్ ఫోన్ పనిచేస్తుంది."సంప్రదాయ మొబైల్ నెట్‌వర్క్ పనిచేయకపోయినా బీఎస్ఎన్ఎల్ శాటిలైట్ ఫోన్ మిమ్మల్ని కనెక్టెడ్‌గా ఉంచుతుంది. వాతావరణ ప్రతికూల పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ఈ రూపొందించాం. డిఫెన్స్, మారిటైమ్, డిజాస్టర్ రెస్పాన్స్, మైనింగ్, రిమోట్ ఆపరేషన్స్, అడ్వెంచర్ ట్రావెల్ చేసేవారికి ఈ ఫోన్ ఉపయోగకరంగా ఉంటుంది" అని బీఎస్ఎన్ఎల్ ఓ ప్రకటనలో పేర్కొంది. అయితే, ఈ ఫోన్‌ను అందరికీ విక్రయించరు. ఇందుకోసం స్థానిక బీఎస్ఎన్ఎల్ కేంద్రానికి వెళ్లాలి. లేదంటే 94651 01323 నంబర్‌కు కాల్ చేయొచ్చు. శాటిలైట్ ఫోన్ అవసరాన్ని తెలియజేయాల్సి ఉంటుంది. చూడ్డానికి ఫీచర్ ఫోన్ మాదిరిగా ఉన్నప్పటికీ.. ఎక్కువ సేపు పనిచేసేలా బిగ్ బ్యాటరీ ఇచ్చారు. క్లిష్ట పరిస్థితుల్లో తట్టుకునేలా రగ్గడ్ డిజైన్‌తో ఈ ఫోన్ రూపొందించారు.

# బండి భగీరథ్‌కు షరతులతో కూడిన బెయిల్

దర్యాప్తుకు సహకరించాలని హైకోర్టు ఆదేశం

హైదరాబాద్,జూలై9(జనంసాక్షి): కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ కు ఊరట లభించింది. పోక్సో కేసులో అతడికి తెలంగాణ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. షరతులతో కూడిన బెయిల్ ఇచ్చిన ఉన్నత న్యాయస్థానం.. దర్యాప్తునకు సహకరించాలని బండి భగీరథ్‌ను ఆదేశించింది. హైదరాబాద్‌లోని పేట్‌బషీరాబాద్ పీఎస్‌లో అతడిపై పోక్సో కేసు నమోదైంది. మే 16న పోలీసులు అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బండి భగీరథ్ బెయిల్ పిటిషన్‌పై ఇటీవల వాదనలు ముగియడంతో తీర్పును హైకోర్టు వాయిదా వేసింది. పిటిషనర్ తరఫు న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ భగీరథ్ విద్యార్థి అని, 45 రోజులకుపైగా జైలులో ఉండటంతో జీవితంలో చాలా కోల్పోయాడన్నారు. పరస్పర అంగీకారంతో జరిగిన దానిపై కేసులు నమోదు చేయడం చెల్లదని.. ఇదే విషయాన్ని హైకోర్టు, సుప్రీంకోర్టులు పలు తీర్పుల్లో వెల్లడించాయన్నారు. బెయిల్ మంజూరు చేస్తే కోర్టు విధించిన షరతులకు కట్టుబడి ఉంటారన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావు వాదనలు వినిపిస్తూ.. మే 8న ఎఫ్ఐఆర్ నమోదు చేసిన వెంటనే వాంగ్మూలాల సేకరణ మొదలైందన్నారు. దర్యాప్తు దాదాపు పూర్తికావచ్చిందని, గడువులోగా అభియోగ పత్రాన్ని దాఖలు చేస్తామన్నారు. ఈ దశలో బెయిల్ మంజూరు చేస్తే సాక్షులను ప్రభావితం చేస్తారన్నారు. ఇరుపక్షాల వాదనలను విన్న న్యాయమూర్తి జస్టిస్ కె.సుజన భగీరథ్‌కు బెయిల్ మంజూరు చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

# 67.013 కిలోల ఎండు(డ్రై) గంజాయి దగ్ధం



**ములుగు ప్రతినిధి, జూలై 9 (జనం సాక్షి):** 'ఈగల్ '(ఎలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్ లా ఎన్ఫోర్స్మెంట్) ఆదేశాల మేరకు ములుగు జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన ఎన్డీపీఎస్ చట్టం కింద ఉన్న కేసులకు సంబంధించిన భారీ పరిమాణంలోని ఎండు(డ్రై) గంజాయిని ఈరోజు చట్టప్రకారం పూర్తిగా దగ్ధం చేయడం జరిగింది. ములుగు జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ సమావేశం నిర్వహించి, గౌరవ న్యాయస్థాన అనుమతితో వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న సుమారు రూ. 33.50 లక్షల విలువ గల 67.013 కిలోల పొడి గంజాయిని నిబంధనల ప్రకారం పూర్తిగా నాశనం చేశారు. ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకాన్ ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు ములుగు డీసీఆర్బీ డీఎస్పీ ఈ. కిషోర్ కుమార్, మంగపేట ఎస్ఐ టీవీకే సూరి, డీసీఆర్బీ ఎస్ఐ ఎన్. వెంకటేష్ వారి పోలీస్ బృందం ఆధ్వర్యంలో ఈ మాదక ద్రవ్యాలను నిర్దేశిత వరంగల్ కాకతీయ మెడి వేస్ట్ యూనిట్ లో ప్రత్యేక యంత్రాల ద్వారా పూర్తిగా దగ్ధం చేసి నాశనం చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ కిషోర్ కుమార్ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ కేకన్ సుధీర్ రామ్నాథ్ ఆదేశాల ప్రకారం మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, నిల్వ, మరియు వినియోగంపై జిల్లా పోలీస్ శాఖ అత్యంత కఠినమైన చర్యలు కొనసాగిస్తుందని హెచ్చరించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి తమ భవిష్యత్తును బాగుచేసుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లాలో గంజాయి సాగు చేసినా, రవాణా చేసినా, లేదా విక్రయాలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన శిక్షలు, పీడీ యాక్ట్ (పిడి యాక్ట్) నమోదు చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. మాదక ద్రవ్యాల సరఫరాకు సంబంధించిన ఎలాంటి సమాచారం ఉన్నా ప్రజలు వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచబడతాయని అధికారులు కోరారు.

# గ్రామ పంచాయతీలను ఆర్థికంగా బలోపేతం చేయాలి

- ప్రణాళికాబద్ధమైన పాలనతోనే గ్రామాభివృద్ధి సాధ్యం
- గ్రామాభివృద్ధిలో సర్పంచులదే కీలక పాత్ర
- 16వ ఆర్థిక సంఘం నిధులను నిబంధనల ప్రకారమే వినియోగించాలి
- మంత్రి దనసరి అనసూయ సీతక్క



**ములుగు ప్రతినిధి, జులై 09(జనంసాక్షి) :** గ్రామ పంచాయతీలను ఆర్థికంగా బలోపేతం చేయాలని, ప్రణాళికాబద్ధమైన పాలనతోనే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని, గ్రామాభివృద్ధిలో సర్పంచులే కీలకపాత్ర పోషించాల్సి ఉంటుందని, 16వ ఆర్థిక సంఘం నిధులను నిబంధనల ప్రకారమే వినియోగించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. గ్రామ పంచాయతీలను బలోపేతం చేసి ప్రజలకు నాణ్యమైన సేవలు అందించే లక్ష్యంతో గురువారం ములుగు లీలా గార్డెన్ లో ఏర్పాటు చేసిన గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక, సర్పంచ్ ల శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ఇటీవల ఎన్నికైన సర్పంచులు, ఉప సర్పంచులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులకు గ్రామ పాలన, చట్టాలు, విధివిధానాలు, గ్రామాభివృద్ధి ప్రణాళికల రూపకల్పన, నిధుల వినియోగం, గ్రామ పంచాయతీ స్థిరమైన యాక్షన్ ప్లాన్ అమలు, ఆర్థిక నిర్వహణ, పారదర్శక పాలనపై సమగ్ర అవగాహన కల్పించేందుకే ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామ పంచాయతీ ప్రజాప్రతినిధులు గ్రామ పంచాయతీ చట్టాలు, తమ అధికారాలు, బాధ్యతలు, విధులు, ఆర్థిక నిబంధనలు, పరిపాలనా విధానాలపై పూర్తి అవగాహనతో పనిచేయాలని సూచించారు. గ్రామాభివృద్ధి పనులు ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని వార్షిక కార్యాచరణ ప్రణాళిక ఆధారంగా చేపట్టాలని, గ్రామసభలకు ప్రాధాన్యతనిస్తూ ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయాలని అన్నారు. 16వ ఆర్థిక సంఘం నిధులు అమల్లోకి వస్తున్న తరుణం లో ప్రతి సర్పంచ్ నిధుల మార్గదర్శకాలు, వినియోగ విధానం, అనుమతించబడిన పనులు, వ్యయ నియమాలను పూర్తిగా తెలుసుకోవాలని తెలిపారు. గతంలో అవగాహన లోపంతో కొందరు సర్పంచులు నిబంధనలకు విరుద్ధంగా నిధులు వినియోగించి ఇబ్బందులు ఎదుర్కొన్న సందర్భాలు ఉన్నాయని గుర్తు చేశారు. టైడ్ ఫండ్స్, అన్‌టైడ్ ఫండ్స్, రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు, గ్రామ పంచాయతీల స్వంత ఆదాయ వనరులకు వంటి ప్రతి నిధికి ప్రత్యేక నిబంధనలు ఉంటాయని, ఆయా నిబంధనలకు అనుగుణంగానే ఖర్చు చేయాలని సూచించారు. గ్రామ పంచాయతీల స్వంత ఆదాయాన్ని పెంపొందించేందుకు పన్నులు, ఫీజుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించి ఆర్థికంగా గ్రామ పంచాయతీలను బలోపేతం చేయాలని అన్నారు. జీపీ-సాప్ ద్వారా గ్రామ అవసరాలను గుర్తించి, తాగునీటి సరఫరా, పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, వీధి దీపాల నిర్వహణ, హరితహారం, పర్యావరణ పరిరక్షణ, గ్రామ రహదారులు, మురుగు నీటి పారుదల, ప్రజా ఆరోగ్యం, పరిశుభ్రత, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రతి పనిని నాణ్యతతో, పారదర్శకంగా, ప్రజలకు జవాబుదారీతనంతో అమలు చేయాలని తెలిపారు. ఎమ్మెల్యేలు, మంత్రులు ఇతర ప్రభుత్వ పథకాల ద్వారా వచ్చే ప్రత్యేక నిధులకు ప్రత్యేక విధానాలు ఉంటాయని, వాటిని గ్రామ పంచాయతీ నిధులతో కలిపి వినియోగించరాదని స్పష్టం చేశారు. ప్రతి నిధిని దాని ఉద్దేశానికి అనుగుణంగా మాత్రమే వినియోగిస్తూ ప్రభుత్వ మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధిలో సర్పంచులు, కార్యదర్శులు సమన్వయంతో పనిచేస్తేనే ప్రభుత్వ లక్ష్యాలు ప్రజలకు చేరువవుతాయని, గ్రామ పంచాయతీలను స్వయం సమృద్ధి దిశగా తీర్చిదిద్దేందుకు ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యతాయుతంగా పనిచేయాలని స్పష్టం చేశారు. అంతకు ముందు అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, స్వచ్ భారత్ మిషన్ డైరెక్టర్ ములుగు జిల్లా ప్రత్యేక అధికారి సురేష్ బాబు సర్పంచులకు శిక్షణ కార్యక్రమం పై అవగాహన కల్పించారు. గ్రామాల అభివృద్ధిలో సర్పంచులు కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, వైస్ చైర్మన్ సారంగం డిపిఓ వెంకయ్య, పంచాయతీరాజ్ ఈఈ అజయ్ కుమార్, ఎండిఓ లు, ఎంపిఓ లు, గ్రామాల సర్పంచులు, కార్యదర్శులు, ప్రజా ప్రతినిధులు, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ రాజ్యసభ నేతగా వద్దిరాజు

- సురేశ్ రెడ్డి పదవీకాలం ముగియడంతో కెసిఆర్ నిర్ణయం



**హైదరాబాద్, జూలై9 (జనంసాక్షి) :** రాజ్యసభలో బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఫ్లోర్ లీడర్ గా నియమితులయ్యారు. రాజ్యసభ సభ్యుడుగా, బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న కేఆర్ సురేష్ రెడ్డి పదవీకాలం ముగియడంతో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా వద్దిరాజు రవిచంద్రను ఫ్లోర్ లీడర్‌గా నియామకం పట్ల తెలంగాణ మున్నూరు కాపు సంఘం నాయకులు పార్టీ అధినేత కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. వద్దిరాజు నియామకం బీసీల, తెలంగాణ హక్కుల సాధనలో కీలకంగా మారుతారని సంఘం అధ్యక్షుడు సర్దార్ పుటం పురుషోత్తం పటేల్ అన్నారు. వద్దిరాజు రవిచంద్ర సేవలను గుర్తించి కీలకమైన బాధలు అప్పగించిన కేసీఆర్‌కు మున్నూరు కాపు సమాజం కృతజ్ఞతలు తెలుపుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి రావలసిన రాజ్యాంగపరమైన హక్కుల సాధనలో వద్దిరాజు కృషి మరింత పెరగడానికి అవకాశం దక్కిందని పేర్కొన్నారు.

# సింగరేణిని నిర్వీర్యం చేస్తున్న బిజెపి, కాంగ్రెస్‌లు

**సింగరేణి ఆరోపణలపై కేంద్రం ఎందుకు చర్యలు తీసుకోదు**

**మీడియా సమావేశంలో బిఆర్ఎస్ నేతలు కొప్పుల, బాల్క సుమన్ విమర్శలు**

**హైదరాబాద్, జూలై9 (జనంసాక్షి) :** సింగరేణిలో రాష్ట్రప్రభుత్వం వాటా 51 శాతం.. కేంద్ర ప్రభుత్వ వాటా 49 శాతం ఉందని.. బీజెపి, కాంగ్రెస్ ప్రభుత్వాలు సింగరేణిని నిర్వీర్యం చేస్తున్నాయని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో వారు మాట్లాడుతూ.. కేసీఆర్ నాయకత్వంలో సింగరేణిని లాభాల బాట పట్టించాం.. సింగరేణిలో కారుణ్య నియామకాలను కేసీఆర్ ఇచ్చారు.. జీవో 76 క్రింద వేలాది కుటుంబాలకు పట్టాలు ఇచ్చిన ఘనత కేసీఆర్‌ది అన్నారు. థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయడంలో కేసీఆర్ కృషి ఉంది. గనుల వేలానికి సంబంధించిన ఎంఎంటీఆర్ బిల్లును నేను ఎంపీగా వ్యతిరేకించా.. బీఆర్ఎస్ ఆ చట్టానికి వ్యతిరేకంగా లోక్‌సభ నుంచి వాకౌట్ చేసింది.. సింగరేణిని వేలం పాట పెడితే సింగరేణి నష్టపోతుందని ఆనాడే రాజ్యసభలో మా పార్టీ తరపున ఆనాడు కేశవరావు మాట్లాడిండు. సింగరేణి బొగ్గు బావులను వేలం వేయొద్దని ప్రధాని మోడీకి కేసీఆర్ లేఖ రాశారు. కేసీఆర్ నాయకత్వంలో సింగరేణిని సిరుల గనిగా ఉంచారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత సింగరేణిలో కుంభకోణాలకు అడ్డాగా మారిపోయిందని ఆరోపించారు. సైట్ విజిట్ సర్టిఫికెట్ తో టెండర్ లో కుంభకోణం చేశారు. 42 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు 16 వందల కోట్ల రూపాయల కుంభకోణం జరిగిందని బాల్క సుమన్ అన్నారు. కాంగ్రెస్ రెండున్నరేళ్ల పాలనలో సింగరేణిలో మొత్తం 16 వేల కోట్ల కుంభకోణాలు జరిగాయన్నారు. మా నాయకుడు హరీష్ రావు బొగ్గు నిల్వల చూసేందుకు వెళ్తే పోలీసులు అడ్డుకున్నారు. కాంగ్రెస్ వచ్చిన తరువాత సింగరేణిలో డీజిల్ కుంభకోణానికి తెరలేపారు. పంపకాల విషయంలో ముఖ్యమంత్రి మంత్రుల మధ్య పంచాయతీ రావడంతో ,ఆ తర్వాత నైని బొగ్గు బ్లాక్ టెండర్ ను రద్దు చేశారు .బడే బాయ్, చోటే బాయ్ మధ్యలో మిడిల్ బాయ్ కిషన్ రెడ్డి .అందరు కలిసి సింగరేణిని ముంచుతున్నారని ఫైర్ అయ్యారు. తాడిచర్ల బొగ్గు బ్లాక్ 2ను సాధించామని బీజేపీ, కాంగ్రెస్ గొప్పలు చెప్పుకుంటున్నారు. మేడిగడ్డలో రెండు పిల్లర్లు కుంగితే ఆగమేఘాల మీద కేంద్ర బృందాన్ని పంపారు. సింగరేణిలో జరుగుతున్న కుంభకోణాలపై కేంద్ర బృందం ఎందుకు రావడం లేదు. ముఖ్యమంత్రి బావమరిది సృజన్ రెడ్డి సింగరేణిలో వందల కోట్ల రూపాయల కుంభకోణానికి పాల్పడుతున్నారు. ఆధారాలతో సహా మా నాయకుడు హరీష్ రావు సింగరేణి కుంభకోణం బయటపెడితే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు. కిషన్ రెడ్డి రేవంత్ రెడ్డి బాయి బాయి అందుకే సింగరేణిలో కుంభకోణాలకు పాల్పడుతున్నారు. సింగరేణిలో జరుగుతున్న అవినీతి కిషన్ రెడ్డికి ఎందుకు కనిపించడం లేదు. అన్ని ఓపెన్ కాస్ట్ బొగ్గు గనులను సింగరేణి సంస్థకే అప్పగించాలని మేము డిమాండ్ చేస్తున్నాము. ఓపెన్ కాస్ట్ బొగ్గు బ్లాక్ లను నామినేషన్ పద్ధతిలో సింగరేణికి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# తాడిచర్ల-2 కేటాయింపు కిషన్ రెడ్డి కృషి ఫలితమే

- యూపిఏ హయాంలో కేటాయింపు అవాస్తవం
- భట్టి వ్యాఖ్యలపై మండిపడ్డ బిజెపి ఎమ్మెల్యే పాయల శంకర్

**న్యూఢిల్లీ, జూలై9 (జనంసాక్షి) :** తాడిచర్ల-2 గని కేటాయింపు పూర్తిగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కృషి ఫలితమేనని ఆదిలాబాద్ బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌అన్నారు. యూపీఏ-2 ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటికీ తాడిచర్ల-2 బొగ్గు గనిని సింగరేణికి కేటాయించలే కపోయిందని విమర్శించారు. సింగరేణికి మీరేం చేశారని భట్టి విక్రమార్కను ప్రశ్నించారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ బిడ్డగా, సింగరేణి కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రధాని నరేంద్ర మోదీని ఒప్పించి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఈ గనిని సింగరేణికి కేటాయింపునకు కృషి చేశారని పేర్కొన్నారు. తాడిచర్ల గని కేటాయింపును సింగరేణి కార్మిక సంఘాలు స్వాగతిస్తూ ప్రధాని మోదీ, కిషన్ రెడ్డికి పాలాభిషేకాలు చేస్తున్నాయని తెలిపారు. కార్మికుల్లో వ్యక్తమవుతున్న ఆనందాన్ని, బీజేపీకి వస్తున్న ప్రజాదరణను కాంగ్రెస్ సహించకలేకపోతోందన్నారు. సింగరేణి ఆర్థిక పరిస్థితిపై కూడా పాయల శంకర్ తీవ్ర విమర్శలు చేశారు. 2014 నుంచి 2023 వరకు బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణిపై రూ. 32 వేల కోట్ల బకాయిలు మోపిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత మరో రూ. 22 వేల కోట్ల బకాయిలు పెట్టిందని అన్నారు. మొత్తం రూ. 55 వేల కోట్ల బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ పరిస్థితికి బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలే కారణమని వ్యాఖ్యానించారు. సింగరేణి కార్మికులు ఈ రెండు పార్టీల నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి బకాయిలను ఎప్పుడు, ఎలా చెల్లిస్తుందో స్పష్టంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశాన్ని లేవనెత్తుతామని తెలిపారు. సింగరేణిలో కేంద్ర ప్రభుత్వానికి 49 శాతం వాటా ఉందని తెలిపారు.

# మతం మార్చుకోవాలని అమ్మానాన్నను ఒత్తిడి చేశారు!

- తట్టుకోలేకనే రైలు కింద పడి దంపతుల ఆత్మహత్య
- పోలీసుల విచారణలో మృతుల కుమారులు?
- వెలుగులోకి వస్తున్న విస్తుపోయే విషయాలు



**చెన్నారావుపేట, జూలై 9 ( జనం సాక్షి ):** రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్న దంపతుల కేసులో విస్తుపోయే విషయాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఈనెల 2వ తేదీన గురువారం రాత్రి ఘట్‌కేసర్ ప్రాంతంలోని బీబీనగర్ సమీపంలో రైల్వే ట్రాక్ వద్ద రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలంలోని పాపయ్యపేట గ్రామానికి చెందిన బుడిగె రవికుమార్, శిరీష దంపతుల కేసులో కొత్త ట్విస్ట్ వెలుగులోకి వచ్చినట్లు తెలిసింది. దంపతులు ఇద్దరు ఆత్మహత్య చేసుకోవడానికి పక్కింటి దంపతులే కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించినట్లు సమాచారం. మతం మార్చుకోవాలని వారు చేసిన ఒత్తిడి, అది కుదరకపోవడంతో పెట్టుబడి పేరుతో రూ. 20లక్షలు తీసుకొని తిరిగి ఇవ్వకపోవడం వంటి కారణాలతోనే రవికుమార్, శిరీష దంపతులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి వచ్చిందని పోలీసుల విచారణలో తేలినట్లు గ్రామంలో ప్రచారం జరుగుతుంది. ఈ మేరకు రవికుమార్, శిరీష దంపతుల కుమారులు సుశాంత్, విద్వాన్స్‌లతో పాటు శిరీష తల్లిదండ్రులను అక్కడి పోలీసులు పాపయ్య పేట గ్రామానికి చేరుకొని విచారించే సమయంలో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది.

**మత మార్పిడి విషయమై ఇంట్లో గొడవలు**

హైదరాబాద్ సమీపంలో దిల్ సుఖ్ నగర్ లోని చైతన్యపురిలో బియ్యం వ్యాపారం చేసుకుంటూ హయత్ నగర్ సమీపంలో కుంట్లూరులో సొంత ఇల్లు కొనుక్కొని ఇద్దరు కుమారులతో సంతోషంగా ఉంటున్న కుటుంబంలో పక్కింటి దంపతులు మతం మార్పిడి పేరుతో చిచ్చు పెట్టారు. తమ పక్కింట్లో ఉంటున్న వెంకట్, ప్రమీల కుటుంబంతో రవికుమార్, శిరీషకు మంచి పరిచయం ఉంది. దీన్ని ఆసరాగా చేసుకుని వెంకట్, ప్రమీల దంపతులు రవికుమార్ ఇంటికి వచ్చిన ప్రతీసారి మతం మార్చుకొని ప్రతీ ఆదివారం చర్చికి రావాలని ఒత్తిడి చేసేవారు. మృధు స్వభావి అయిన రవికుమార్ అప్పుడప్పుడు తన భార్య శిరీషతో కలిసి వెంకట్ మాట కాదనలేక ప్రార్థనకు వెళ్లేవాడు. అయినా తమ మతంలోకి రావాలని వెంకట్, ప్రమీల దంపతులు తీవ్ర స్థాయిలో ఒత్తిడి చేశారు. మారడం తనకు ఇష్టం లేదని శిరీష తెగేసి చెప్పింది. మతం మారడం ఇష్టం లేదని గుర్తించిన వెంకట్, ప్రమీల దంపతులు మరో పథకం వేశారు. రెడిమిక్స్ వ్యాపారంలో పెట్టుబడి పెడితే మంచి లాభాలు వస్తాయని వారిని నమ్మించారు. వాహనం కొంటే ప్రతి నెలా రూ. 20వేలు ఆదాయం ఇంటికి వస్తుందని నమ్మబలికారు. దాంతో రవికుమార్ తన భార్య శిరీష నగలను తాకట్టుపెట్టి రూ. 20 లక్షలతో వాహనం కొని వెంకట్, ప్రమీల దంపతులకు అప్పగించారు. రూ. 20 వేల చొప్పున రెండు, మూడు నెలలు మాత్రమే ఇచ్చి ఆ తర్వాత ఇవ్వడం మానేశారు. దీంతో బ్యాంకులో ఉన్న బంగారానికి వడ్డీ కట్టలేకపోతున్నామని రవికుమార్, శిరీషలు ఎప్పుడు మదనపడేవారని తెలిసింది.

# స్పీకర్, మండలి చైర్మన్‌తో సీఎస్ భేటీ

**హైదరాబాద్, జూలై9 (జనంసాక్షి) :** తెలంగాణ నూతన సీఎస్ సంజయ్ జాజు గురువారం తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిని, శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌లను వారివారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలి చైర్మన్‌కు, అసెంబ్లీ స్పీకర్‌కు సీఎస్ పుష్పగుచ్ఛం అందజేసి ,శాలువాతో సత్కరించారు. అనంతరం వారు సీఎస్‌ను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి సెక్రెటరీ డాక్టర్ నరసింహాచార్యులు , వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం అనన్య తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి జిల్లాలో హాట్ టాపిక్‌గా కాంగ్రెస్ పంచాయితీ

- కొండా వర్సెస్, కడియం అన్నట్లుగా పరిస్థితులు
- మంత్రి పనితీరుపై కాంగ్రెస్ నేతలల్లో అసంతృప్తి





**వరంగల్, జూలై9 (జనంసాక్షి) :** ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ నేతల మధ్య కొనసాగుతున్న విభేదాలు జిల్లాలో అలజడి సృష్టిస్తున్నాయి. ఇప్పుడు కొండా వర్సెస్ కడియం లాగా పరిస్థితి మారింది. కొండా తీరుపైనా స్థానికంగా వ్యతిరేకత వస్తోంది. దేవాలయాలను గాలికి వదిలేశారని, అన్యాక్రాంత భూములపై చర్యలు తీసుకోవడం లేదని కాంగ్రెస్‌లోనే విమర్శలు ఉన్నాయి. ఇకపోతే తాజా వివాదం టీపీసీసీ దృష్టికి చేరాయి. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను బుధవారం కలిసి స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై ఫిర్యాదు చేశారు. దేవాదాయ శాఖకు సంబంధించిన అంశాలపై తనకు సమాచారం ఇవ్వకుండా ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఏకపక్షంగా సమీక్షా సమావేశం నిర్వహించారని, ఇది ప్రభుత్వ ప్రోటోకాల్‌కు విరుద్ధమని కొండా సురేఖ అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై పార్టీ పరంగా క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని ఆమె టీపీసీసీ అధ్యక్షుడిని కోరారు. ఇదే విషయంపై ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కూడా లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు ఆమె వివరించినట్లు తెలుస్తోంది.

# ప్రశ్నా రావణ్‌పై పెట్టిన ఉపా కేసును ఎత్తివేయాలి

- కెవిఆర్, అతని భార్యపై పెట్టిన అన్ని అక్రమ కేసులను తీసేయాలి
- పౌరహక్కుల సంఘం తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్

**హైదరాబాద్ (జనంసాక్షి) :** ప్రశ్నా రావణ్‌పై పెట్టిన ఉపా కేసును ఎత్తివేయాలని పౌరహక్కుల సంఘం పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి ఎన్. నారాయణరావు, హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి బాలకృష్ణ డిమాండ్ చేశారు. ప్రజాస్వామిక వ్యవస్థలో బలమైన నాలుగు వ్యవస్థలున్న నేపథ్యంలో మూడు వ్యవస్థలు దిగజారిపోయి ప్రజల విశ్వాసాన్ని కోల్పోయాయని, నాలుగవ స్తంభమైన పత్రికా స్వేచ్ఛ కనీసంగానైనా సోషల్ మీడియా పరంగా యూట్యూబ్లతో ప్రజల విశ్వాసంలో ఉన్నదని, నేషనల్ మీడియా రాష్ట్రాల పత్రికలన్నీ కూడా అధికార పార్టీల కనుసన్నల్లో వార్తను బంధీ చేసి ఉన్నాయని తెలిపారు. తాను మాట్లాడిన అప్రజాస్వామిక పదజాలాన్ని ప్రశ్నా రావణ్ అనుకరించడం నాలుగు పోలీస్ స్టేషన్లలో బెయిల్ తో విడుదలైన తరువాత ఐదవ పోలీస్ స్టేషన్లో అప్రజాస్వామిక నిర్బంధ చట్టమైన ఉపా చట్టంతో అతనిని నిర్బందానికి గురి చేశారని, ఆంధ్రప్రదేశ్లో కూటమి ప్రభుత్వంలో ఉపముఖ్యమంత్రిగా ఉన్న పవన్ కళ్యాణ్ అన్న మాటలను పునరుచ్చరణ చేసినందుకు అదే నేరంగా వరుసగా కేసులు నమోదు చేశారు. నమోదు చేయడమే కాకుండా పోలీస్ స్టేషన్ లో ఉన్న ప్రశ్నారావణపై, న్యాయస్థానానికి తరలిస్తున్నప్పుడు పోలీస్ స్టేషన్లో గోడలు దూకి మరీ ప్రశ్నారావణపై భౌతిక దాడికి జనసేన కార్యకర్తలు పాల్పడ్డారు. జనసైనికులు, చట్టవిరుద్ధంగా వ్యవహరించడమంటేనే పవన్ కళ్యాణ్ బాధ్యతపడాల్సిన అవసరం ఉంది. అదే మాదిరిగా ఈ నెల ఒకటిన మరో జర్నలిస్టు కె. వి. ఆర్. ఇంటి మీద దాడి చేసి ఎపి పోలీసులు అమాంతంగా ఎత్తుకు పోయారని, పోలీసులకు హద్దులు పరిమితులు పని చేయవని తెలిపారు. పేదలకు అన్యాయం జరిగినపుడు పోలీసు స్టేషన్ కెళితే మా పరిధి కాని హింసించిన ఉదాహరణలెన్నో ఉన్నాయని, కెవిఆర్‌ను ఎత్తుకు పోవడానికి ముందు మఫ్టీలో వున్న ఎపి పోలీసులు రెక్కి నిర్వహించారని, మీరెవరు నా భర్తను ఎందుకు తీసుకుపోతున్నారని అడుగుతే నేను కూడా నా భర్త వెంబడి వస్తానంటే ఆమెను లాగిపడేశారని, పైగా భాగ్య లక్ష్మీపై కూడా పోలీసులు అక్రమ కేసులు నమోదు చేశారని, అరెస్టు చేస్తున్న సందర్భంలో కుటుంబీకలుకు తెలియజేసే చట్టబద్దమైన బాధ్యత పోలీసులపై వుందని తెలిపారు. అరెస్టులకు ముఖ్యమంత్రి బాధ్యత వహించాలని, గొంతు విప్పి మాట్లాడితే నేరం అవుతుంది. అంత్యక్రియల్లో మాట్లాడిన గాదె ఇన్నయ్యను జైలుపాలు చేసి 8 నెలలుగా బెయిలు లేకుండా నిర్బంధించారని, ప్రజాస్వామ్యంలో పత్రికా స్వేచ్ఛ అన్నీ వ్యవస్థలను ప్రశ్నిస్తూ ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నదని, అప్రజాస్వామిక విధానాలకు అలవాటు పడిన ప్రభుత్వాలు వ్యక్తులు పత్రికా స్వేచ్ఛను గౌరవించడం ఇబ్బందిగా ఫీలవుతారు. ఆ నేపథ్యంలోనే ప్రశ్నారావణపై చట్టపరంగా పోరాటం చేయాల్సిన స్థితి కాకుండా అక్రమ ఉపా కేసులు నమోదు చేసి భౌతిక దాడులకు పాల్పడడం అదే విధంగా కేసులు చేస్తున్న జడ శ్రావణపై కూడా కేసులు నమోదు చేస్తామని ప్రకటించడం లాంటివన్నీ కూడా ప్రజాస్వామ్య విరుద్ధమైన చర్యలుగా పౌరహక్కుల సంఘం భావిస్తూ ప్రజాస్వామ్యం నిలబెట్టడానికి ప్రభుత్వాలలో పాలకులుగా ఉన్న అన్ని రాజకీయ పార్టీలు నిబద్ధతతో వ్యవహరించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వాలు రాజకీయ పార్టీలే రాజ్యాంగాన్ని పాటించకపోతే ప్రజలు మాత్రం ఎందుకు పాటించాలనే ఒక మౌలిక ప్రశ్న బలల్దేరుతుంది. అది ప్రజాస్వామ్యానికి చాలా ప్రమాదకరం. దీన్ని దృష్టిలో పెట్టుకొని ప్రశ్నారావణ్ పై కూటమి ప్రభుత్వం కావాలని కుట్రపూరితంగా నమోదు చేసిన ఉపా కేసుతో పాటు అన్ని కేసులను బేషరతుగా ఎత్తివేసి అతన్ని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో కూడా గత కొద్ది నెలల క్రితం కొన్ని యూట్యూబ్ ఛానెల్లపై ఎన్. ఐ. ఎ. తరహా నిర్బంధాలు బలంగానే కొనసాగాయని, ఆ నిర్బంధాలకు రాష్ట్ర ప్రభుత్వాలకు దీనికి సంబంధం లేనట్లుగా రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవర్తిస్తున్నాయి. కానీ శాంతి భద్రతలనేవి కేవలం రాష్ట్రానికి సంబంధించినదే, కాబట్టి రాష్ట్ర ప్రభుత్వాలు పత్రికా స్వేచ్ఛను గౌరవిస్తూ యూట్యూబ్ ఛానెల్ల పట్ల పత్రికల పట్ల ప్రజాస్వామ్యబద్ధమైన వైఖరితో తమ పాలన కొనసాగించాలని, కనిపించకుండా నిర్బంధాన్ని కొనసాగిస్తున్న అన్ని పత్రికలపై యూట్యూబ్లపై ఆ నిర్బంధాన్ని ఉపసంహరించుకొని పత్రికా స్వేచ్ఛను కాపాడగలిగితేనే కనీసంగానైనా ప్రజాస్వామ్యం నిలబడుతుందని, లేకపోతే నిర్బంధమే రాజ్యమేలుతూ ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేస్తోందని తెలిపారు. అప్పుడు ప్రజల దగ్గరకి ప్రజాస్వామ్య విలువల కోసం వెళ్ళడానికి మీకు అవకాశం ఉండదు. కాబట్టి పత్రికలపై యూట్యూబ్ ఛానెళ్ళపై నమోదు చేసిన అన్ని అక్రమ కేసులను ఎత్తివేయాల్సిందిగా ప్రభుత్వాలను చేసారు.

# స్థిరంగా బంగారం ధరలు

**హైదరాబాద్, జూలై9 (జనంసాక్షి) :** అంతర్జాతీయ భౌగోళిక కారణాల నేపథ్యంలో బంగారం ధరలు క్రమంగా తగ్గుదల నమోదు చేస్తున్నాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, గురువారం ఉదయం 6.00 గంటల సమయంలో హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ. 1,43,120గా ఉంది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ. 1,31,190గా ఉంది. మరోవైపు వెండి ధరల్లో కూడా స్వల్ప తగ్గుదల నమోదైంది. కిలోకు వంద రూపాయల మేర తగ్గింది. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడల్లో కిలో వెండి ధర రూ. 2,44,900గా ఉంది.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
10 జూలై 2026

# ప్రశ్నిస్తే ఉపా సమాధానమా?

సంపాదకీయం

ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం నేరం కాదు... అది ప్రజల రాజ్యాంగబద్ధమైన హక్కు. పాలకులు ప్రజల ఓట్లతో అధికారంలోకి వస్తారు; కాబట్టి ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత కూడా వారిదే. కానీ ఇటీవల కనిపిస్తున్న ధోరణి మాత్రం భిన్నంగా ఉంది. ప్రశ్న అడిగితే సమాధానం చెప్పాల్సిన చోట కేసులు, విమర్శిస్తే ప్రతివాదం చేయాల్సిన చోట అరెస్టులు, చివరికి అసమ్మతి వ్యక్తం చేస్తే ఉగ్రవాద నిరోధక చట్టాలే సమాధానంగా మారుతున్నాయి. ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదకర సంకేతం.

యూట్యూబర్ 'ప్రశ్న' రావణ్ అలియాస్ బచ్చలకూరి జోసెఫ్‌పై ఉపా (ఊపా) చట్టం ప్రయోగించి నెల్లూరు జైలుకు తరలించడం దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. రావణ్‌పై ఉన్న ఆరోపణలు ఎంత తీవ్రమైనవైనా, అవి నిజమా కాదా అన్నది కోర్టు తేల్చాల్సిన అంశం. కానీ అంతకంటే ముందుగా సమాజం అడుగుతున్న ప్రశ్న వేరే ఉంది. నిజంగా ఈ కేసు ఉపా చట్టం వర్తించే స్థాయిలో ఉందా? లేక విమర్శించే గొంతును మౌనం చేయడానికి అత్యంత కఠినమైన చట్టాన్ని ఆయుధంగా ఉపయోగిస్తున్నారా?

గతంలో నమోదైన కేసుల్లో బెయిల్ వచ్చిన ప్రతిసారీ కొత్త కేసు నమోదు చేసి మళ్లీ అరెస్టు చేయడం, చివరకు బెయిల్ దాదాపు అసాధ్యంగా మారే ఉపా చట్టాన్ని ప్రయోగించడం చూస్తే ఇది సాధారణ న్యాయ ప్రక్రియ కంటే "ప్రాసెస్ ఈజ్ ద పనిష్‌మెంట్" అనే పరిస్థితిని గుర్తు చేస్తోంది. శిక్ష పడకముందే సంవత్సరాల తరబడి జైల్లో ఉంచే పరిస్థితి ఏర్పడితే, విచారణే శిక్షగా మారినట్లే కాదా?

ఉపా చట్టం ఎందుకు వచ్చింది? దేశ భద్రతకు ముప్పు కలిగించే ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి. టెర్రర్ నెట్‌వర్క్‌లను ఛేదించడానికి. దేశ సమగ్రతను కాపాడటానికి. కానీ అదే చట్టాన్ని రాజకీయ విమర్శకులు, సోషల్ మీడియా వ్యాఖ్యలకు లేదా ప్రభుత్వ వ్యతిరేక అభిప్రాయాలకు వర్తింపజేస్తే, చట్టం ఉద్దేశమే తలకిందులవుతుంది. ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే ఆయుధాన్ని, అసమ్మతి వ్యక్తం చేసే పౌరుడిపై ప్రయోగించడం ప్రజాస్వామ్య ఆత్మకు విరుద్ధం.

ఈ కేసులో మరో కోణాన్ని కూడా విస్మరించలేం. రావణ్ దళిత యువకుడు. అణగారిన వర్గాలకు చెందిన వ్యక్తులు అధికారాన్ని ప్రశ్నించినప్పుడు వ్యవస్థ స్పందించే తీరు, ప్రభావశీల వర్గాలకు చెందిన వారు అదే మాటలు మాట్లాడినప్పుడు స్పందించే తీరు ఒకేలా ఉంటుందా? అనే సందేహం సహజంగానే తలెత్తుతోంది. చట్టం ముందు అందరూ సమానమని ప్రభుత్వం చెబితే, ఆ సమానత్వం చర్యల్లోనూ కనిపించాలి. లేదంటే చట్టంపై విశ్వాసం దెబ్బతింటుంది.

విమర్శలు బాధించవచ్చు. ప్రశ్నలు అసౌకర్యం కలిగించవచ్చు. కానీ ప్రజాస్వామ్యంలో అధికారానికి అసౌకర్యం కలిగించే ప్రశ్నలే అసలు ప్రజాస్వామ్యానికి ఆక్సిజన్. ప్రభుత్వాలను ప్రశంసించేవారు కాదు, ప్రశ్నించేవారే పాలనను జవాబుదారీగా ఉంచుతారు. అందుకే రాజ్యాంగం భావప్రకటన స్వేచ్ఛను మౌలిక హక్కుగా గుర్తించింది.

ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘిస్తే, ద్వేషాన్ని రెచ్చగొడితే, హింసకు ప్రేరేపిస్తే దేశంలో ఇప్పటికే భారతీయ న్యాయ సంహిత (BNS)తో పాటు ఇతర చట్టాల్లో తగిన నిబంధనలు ఉన్నాయి. కోర్టులు ఉన్నాయి. విచారణ వ్యవస్థ ఉంది. అలాంటప్పుడు ప్రతి అసమ్మతినీ ఉగ్రవాదంతో ముడిపెట్టే ధోరణి ప్రమాదకరం. అది కేవలం ఒక వ్యక్తిని మాత్రమే కాదు, మొత్తం సమాజాన్ని భయభ్రాంతులకు గురిచేస్తుంది. "ప్రశ్నిస్తే జైలు" అనే భయం వ్యాపిస్తే, ప్రజాస్వామ్యం బతికే ఉంటుంది కానీ దాని ఆత్మ చనిపోతుంది.

ప్రభుత్వాలు మారుతాయి. అధికారాలు శాశ్వతం కావు. కానీ చట్టాల దుర్వినియోగానికి ఏర్పడే సంప్రదాయం మాత్రం తరతరాలకు మిగిలిపోతుంది. ఈ రోజు ప్రత్యర్థిపై ప్రయోగించిన చట్టమే రేపు అధికారంలో ఉన్నవారినీ వెంటాడే అవకాశం ఉంటుంది. అందుకే చట్టాలను రాజకీయ ప్రతీకార సాధనాలుగా కాకుండా, న్యాయ సాధనాలుగా మాత్రమే ఉపయోగించాలి.

ప్రశ్నించే గొంతులను ఉపాతో మూయడం తాత్కాలికంగా అధికారానికి ఉపశమనం కలిగించవచ్చు. కానీ అది ప్రజాస్వామ్యాన్ని బలపరచదు. ప్రజల విశ్వాసాన్ని కూడా పెంచదు. ప్రశ్నలకు సమాధానం చెప్పడం ప్రజాస్వామ్యం; ప్రశ్నలకు ఉపాతో సమాధానం చెప్పడం ప్రజాస్వామ్య వైఫల్యం. చట్టం భయాన్ని కాదు, న్యాయంపై నమ్మకాన్ని కలిగించాలి. అదే రాజ్యాంగ స్ఫూర్తి. అదే ప్రజాస్వామ్య అసలు విలువ.

# ప్రజల దారిలోనే విప్లవ రాజకీయాల భవిష్యత్తు

*ఒక రాజకీయ ఉద్యమం బలాన్ని కొలవాలంటే దాని కార్యాలయాల సంఖ్యను, ఎన్నికల్లో సాధించిన ఓట్లను, నాయకుల ప్రసంగాలను మాత్రమే చూడడం సరిపోదు. ఆ ఉద్యమం ప్రజల జీవితాల్లో ఎంత లోతుగా వేర్లు వేసిందో చూడాలి. ప్రజల బాధ తన బాధగా, ప్రజల ఆశయం తన ఆశయంగా మారినప్పుడే ఒక ఉద్యమం చరిత్రలో నిలబడుతుంది. ఇదే లిబరేషన్ పార్టీ పరిణామ క్రమం చెప్పే ప్రధాన పాఠం.*




భారతదేశం ఈ రోజు ఒక సంక్లిష్టమైన దశను ఎదుర్కొంటోంది. ఒకవైపు కార్పొరేట్ పెట్టుబడి మరింత కేంద్రీకృతమవుతోంది. మరోవైపు వ్యవసాయం సంక్షోభంలో చిక్కుకుంటోంది. కార్మికుల హక్కులు క్రమంగా బలహీనపడుతున్నాయి. నిరుద్యోగం యువత భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తోంది. కుల వివక్ష కొత్త రూపాల్లో కొనసాగుతోంది. మత విద్వేషాన్ని రాజకీయ ఆయుధంగా ఉపయోగించే ప్రయత్నాలు పెరుగుతున్నాయి. ప్రజాస్వామ్య సంస్థల స్వతంత్రతపై కూడా అనేక చర్చలు జరుగుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజా ఉద్యమాల అవసరం మరింత పెరుగుతోంది. ప్రజల సమస్యలను ఎన్నికల హామీలుగా మాత్రమే కాకుండా, సంఘటిత పోరాటాలుగా మలచడం అత్యవసరం. రైతు పోరాటం రైతుకే పరిమితం కాకూడదు. కార్మిక పోరాటం కర్మాగారం గోడల మధ్యే ఆగిపోకూడదు. దళితులపై దాడి జరిగినప్పుడు అది దళిత సమాజం ఒక్కదాని సమస్యగా మిగలకూడదు. మహిళలపై హింస జరిగినప్పుడు అది కుటుంబ సమస్యగా తగ్గిపోకూడదు. ఇవన్నీ ప్రజాస్వామ్యాన్ని, సమానత్వాన్ని, సామాజిక న్యాయాన్ని తాకే ప్రశ్నలే.

వినోద్ మిశ్రా రాజకీయ ఆలోచనలో ఈ సమగ్ర దృష్టి కనిపిస్తుంది. ప్రజా ఉద్యమాలను విడివిడిగా కాకుండా, ఒక విస్తృత ప్రజాస్వామిక పరివర్తన ప్రక్రియలో భాగంగా చూడాలని ఆయన నొక్కిచెప్పారు. భూమి కోసం పోరాటం, ఉపాధి కోసం పోరాటం, కుల వివక్షకు వ్యతిరేక పోరాటం, మహిళా సమానత్వ ఉద్యమం, మైనారిటీల భద్రత, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ పరస్పరం సంబంధం కలిగిన ప్రజా ప్రశ్నలే. వాటిని కలిపే రాజకీయ దృష్టి లేకపోతే విప్లవ రాజకీయాలు కూడా అసంపూర్ణంగానే మిగిలిపోతాయి. అందుకే లిబరేషన్ పార్టీ పరిణామంలో "ప్రజల దారిలో" అనే భావన ఒక నినాదం మాత్రమే కాదు. అది ఒక రాజకీయ పద్ధతి. ప్రజల మధ్య ఉండాలి. ప్రజల అనుభవాల నుంచి నేర్చుకోవాలి, వారి పోరాటాల్లో భాగస్వాములు కావలి, వారి చైతన్యాన్ని విస్తరింప చేయాలి, ఇవన్నీ చేయటం ద్వారా పార్టీ నిర్మాణానికి, రాజకీయ వికాసానికి మూలాధారాలుగా నిలిచాయి.

మరో ముఖ్యమైన అంశం ప్రజాస్వామ్యం. విప్లవ రాజకీయాలకు ప్రజాస్వామ్యం అవసరం లేదా అనే ప్రశ్నను చాలా కాలం తప్పుగా అర్థం చేసుకున్నారు. కానీ ప్రజలు మాట్లాడే హక్కు లేకుండా, సంఘాలు నిర్మించే హక్కు లేకుండా, నిరసన తెలిపే హక్కు లేకుండా, పత్రికా స్వేచ్ఛ లేకుండా ప్రజా ఉద్యమాలు ఎలా ఎదుగుతాయి? అందుకే ప్రజాస్వామ్య హక్కుల రక్షణను ప్రజా ఉద్యమాల అభివృద్ధికి అవసరమైన రాజకీయ స్థలంగా లిబరేషన్ భావించింది. అదే సమయంలో ప్రజాస్వామ్యాన్ని కేవలం ఎన్నికలకు మాత్రమే పరిమితం చేయలేదు. ఐదేళ్లకు ఒకసారి ఓటు వేయడం ప్రజాస్వామ్యం మొత్తమేమీ కాదు. గ్రామ సభలో మాట్లాడే హక్కు కూడా ప్రజాస్వామ్యమే. కర్మాగారంలో యూనియన్ ఏర్పాటు చేసుకునే హక్కు కూడా ప్రజాస్వామ్యమే. భూమి కోల్పోతున్న రైతు తన అభిప్రాయం చెప్పే అవకాశం కూడా ప్రజాస్వామ్యమే. విశ్వవి ద్యాలయంలో విద్యార్థి ప్రశ్నించే స్వేచ్ఛ కూడా ప్రజాస్వామ్యమే. ఈ విస్తృత అవగాహన ప్రజా ఉద్యమాలను మరింత బలోపేతం చేస్తుంది.

భారతదేశం వంటి వైవిధ్యభరిత సమాజంలో వర్గ ప్రశ్నతో పాటు కులం, లింగం, జాతి, ప్రాంతీయ అసమానతలను కూడా కలిపి చూడాల్సిన అవసరాన్ని లిబరేషన్ రాజకీయాలు ముందుకు తెచ్చాయి. ఒక సమస్యను మరో సమస్యకు ప్రత్యామ్నాయంగా కాకుండా, ప్రజల విముక్తి కోసం జరిగే సమగ్ర పోరాటంలో భాగాలుగా చూడడం ఈ దృక్పథం ప్రత్యేకత. అయితే ఏ రాజకీయ ఆలోచన కూడా చర్చలకు అతీతం కాదు. వామపక్ష ఉద్యమంలో వ్యూహాలపై, ఎన్నికల పాత్రపై, ఐక్య కార్యాచరణపై భిన్నమైన అభిప్రాయాలు సహజంగానే ఉంటాయి. ఆ భిన్నాభిప్రాయాలను ప్రజాస్వామ్య చర్చల ద్వారా పరిష్కరించు కోవడమే మార్క్సిస్టు సంప్రదాయం. అదే ఒక సజీవ ఉద్యమ లక్షణం కూడా.

ఈ మొత్తం ప్రయాణాన్ని వెనక్కి తిరిగి చూస్తే ఒక విషయం స్పష్టమవుతుంది. లిబరేషన్ పార్టీ పరిణామం అంటే పాతదాన్ని పూర్తిగా తిరస్కరించడం కాదు. గత అనుభవాలను విమర్శనాత్మకంగా సమీక్షిస్తూ, ప్రజలతో మరింత బలమైన సంబంధాన్ని నిర్మించే దిశగా ముందుకు సాగడం. అదే దాని అసలు బలం. నేటి తరానికి ఈ ప్రయాణం చెప్పే పాఠం కూడా ఇదే. విప్లవం ప్రజలపై నుంచి రుద్దబడదు. ప్రజలే దాని సృష్టికర్తలు. పార్టీ ప్రజలకు ప్రత్యామ్నాయం కాదు. ప్రజల సంఘటిత చైతన్యానికి రాజకీయ రూపం మాత్రమే. అందుకే ప్రజల విశ్వాసాన్ని సంపాదించడం, వారి పోరాటాల్లో భుజం కలపడం, వారి అనుభవాల నుంచే కొత్త రాజకీయ దిశలను ఆవిష్కరించడం.. ఇవే ఏ ప్రజా ఉద్యమానికైనా శాశ్వత బలాలు. చరిత్ర ఎన్నిసార్లు మారినా, రాజకీయ పరిస్థితులు ఎన్ని రూపాలు దాల్చినా ఒక సత్యం మాత్రం మారదు. ప్రజలను నమ్మిన ఉద్యమాలు నిలుస్తాయి. ప్రజల నుంచి దూరమైన ఉద్యమాలు బలహీనపడతాయి. అందుకే విప్లవ రాజకీయాల భవిష్యత్తు ఎక్కడో సిద్ధాంత గ్రంథాల్లో కాదు... ప్రజల దారిలోనే ఉంది.



- మామిండ్ల రమేష్ రాజా
7893230218

## వికసిత్ భరత్

నిన్నటి లాగే ఇవ్వాళ కూడా
ఎంతకీ తరగని వరుస క్రమం..
కాసింత చాటు కల్పించడానికి
ఎన్నేళ్ళు కావాలి??
తమ వంతు కోసం
వేచి ఉండటానికి
వరుసలో నిలబడి.. నిలబడీ..
ఆ బంగారు తల్లుల మనస్సు
ఎన్నిసార్లు గాయపడిందో!!
లెక్కకట్ట గలమా??
పొత్తి కడుపును చేత్తో పట్టుకొని
కాల చాక్రాన్ని మోసే ఆడపిల్లల
భరించలేని బాధకు
నాలుగు గోనె సంచులతో
అడ్డు తెరలుగా ఇంత చాటు
ఏర్పాటు చేసుకోవడం
ఎంత దౌర్భాగ్యం!?
కాలకృత్యాలు తీర్చుకోవడం కోసం
కోడి కూతకన్న ముందే లేచి
చెరువులు, వాగులు చెంతకు
చేరుతున్న
వసతి గృహ విద్యార్థులు ఎందరో?!
ఆరు బయట పొంచి వుండే
ప్రమాదాలతో
నిత్యం వాళ్లకు ఒక పోరాటమే!
80 సంవత్సరాల పాలనలో
భావి పౌరులు మరుగుదొడ్లు లేక
బహిరంగ ప్రదేశాలలో
కాలకృత్యాలు తీర్చుకోవడం స్వతంత్ర
భారతదేశంలో సిగ్గుపడాల్సిన విషయమే గదా!!
కనీస సౌకర్యాలకు నోచుకోని
ప్రభుత్వ పాఠశాలలు,
వసతి గృహాల గణాంకాలు చూసి
ఉలిక్కిపడ్డమే తప్ప
ఏమీ చెయ్యలేమా??
విద్యార్థులందరికి భయాలు లేని
కనీస సౌకర్యల వసతి కల్పన
నాణ్యమైన విద్య,ఆరోగ్యకరమైన
జీవనశైలి,వ్యాయామం ఇవ్వన్నీ
వుండే వికసిత్ భారత్ ఎప్పుడు వస్తుందో!!
ఆత్మవిశ్వాసమే ఆయుధమయ్యే
నవ భారత విద్యార్థుల కలలు
ఎప్పుడు ఫలిస్తాయో?
వేచి చూడాలి!!

అనిత కృష్ణ

# భగీరథుడి కల... దాహార్తుల ఇల

## నల్లాల వెనుక దాగున్న నీటి వ్యథలు

తెలంగాణ సమాజంలో తాగునీటి కష్టాలు కొత్తవి కావు. ఉమ్మడి రాష్ట్రంలో ఫ్లోరైడ్ రక్కసి కోరల్లో చిక్కిన నల్లగొండ జిల్లా పల్లెలు, చుక్క నీటి కోసం మైళ్ల దూరం నడిచే ఆడబిడ్డల దృశ్యాలు తెలంగాణ ఉద్యమ కాలంలో తీవ్ర చర్చకు దారితీశాయి. స్వరాష్ట్రం సిద్ధించిన తర్వాత, ఈ శాపానికి శాశ్వత పరిష్కారం చూపించాలనే బృహత్తర సంకల్పంతో ప్రభుత్వం మిషన్ భగీరథ పథకానికి శ్రీకారం చుట్టింది. ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా స్వచ్ఛమైన రక్షిత మంచినీరు అందించాలన్నది ఈ పథకం యొక్క మూల సిద్ధాంతం. ఇందుకోసం ఏకంగా రూ.43,791 కోట్ల భారీ బడ్జెట్‌ను కేటాయించారు. పట్టణ ప్రాంతాల్లో 20 లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో 60 లక్షల గృహాలకు కలిపి మొత్తం 2.32 కోట్ల మంది ప్రజల దాహార్తిని తీర్చడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టును డిజైన్ చేశారు. దీని పర్యవేక్షణ, అమలు కోసం ప్రత్యేకంగా తెలంగాణ డ్రింకింగ్ వాటర్ సప్లయ్ కార్పొరేషన్ ను కూడా ఏర్పాటు చేశారు.ఈ పథకం కింద నిర్మించిన మౌలిక సదుపాయాలు కాగితంపై చూస్తే ఒక అద్భుతంలా కనిపిస్తాయి. దాదాపు 59 ఓవర్‌హెడ్, గ్రౌండ్ లెవల్ ట్యాంకులు, ఏటా 40 టీఎంసీల నీటిని తరలించే భారీ పంపింగ్ వ్యవస్థ, 1.697 లక్షల కిలోమీటర్ల మేర విస్తరించిన పైపింగ్ నెట్‌వర్క్, వీటన్నింటికీ తోడు 182 మెగావాట్ల విద్యుత్ అవసరమయ్యే మౌలిక వసతులను కల్పించారు. 2016 ఆగస్టు 7న గజ్వేల్ నియోజకవర్గంలోని కోమటిబండ గ్రామంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఈ పథకం ప్రారంభమైంది. దేశంలోనే ఇంటింటికీ నల్లా సౌకర్యం పొందిన తొలి నియోజకవర్గంగా గజ్వేల్ రికార్డు సృష్టించింది. మరీ ముఖ్యంగా, దశాబ్దాలుగా ఫ్లోరైడ్ భూతంతో అతలాకుతలమైన మునుగోడు నియోజకవర్గం నుంచి ఈ పథకానికి పునాది వేయడం వెనుక తీవ్రమైన మానవీయ కోణం దాగి ఉంది. ఇది కేవలం ఒక ఇంజనీరింగ్ ప్రాజెక్టు కాదు, లక్షలాది మంది ప్రజల జీవన్మరణ సమస్యకు సంబంధించిన ఆశల వారధి.అయితే, ప్రారంభమై పదేళ్లు గడుస్తున్నా నేడు క్షేత్రస్థాయిలో పరిస్థితి చూస్తే ఆశించిన ఫలితాలు అందడం లేదనేది బహిరంగ రహస్యం. ప్రభుత్వ రికార్డుల్లో ప్రాజెక్టు వంద శాతం విజయవంతమైనట్లు కనిపిస్తున్నా, పల్లెల్లోని నల్లాల్లో మాత్రం నీటి కంటే ఎక్కువగా గాలే వస్తోందని ప్రజలు వాపోతున్నారు. పనుల నాణ్యత లోపించడం, పైపులైన్ల నిర్వహణ సరిగా లేకపోవడం వల్ల వేసవి వస్తే చాలు తాగునీటి కోసం అల్లాడాల్సిన పరిస్థితి పునరావృతమవుతోంది. ఇటీవలే జరిగిన ఒక ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో స్వయంగా అధికారులే ఈ లోపాలను ఒప్పుకోవడం గమనార్హం. నీటి లభ్యత పాయింట్లు, రిజర్వాయర్ల సామర్థ్యం, పంపింగ్ వ్యవస్థల్లో తీవ్రమైన అస్తవ్యస్తత నెలకొందని అధికారులు అంగీకరించారు. చాలా కాలంగా పైపులైన్ల నిర్వహణను గాలికి వదిలేశారనే విమర్శలు నిజమేనని ఈ అంతర్గత నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

ఈ మొత్తం వ్యవహారంలో జరిగిన అతిపెద్ద పొరపాటు ఏమిటంటే, మిషన్ భగీరథపై అతిగా ఆధారపడి, పాత తాగునీటి వనరులను పూర్తిగా విస్మరించడం. మిషన్ భగీరథపై అతిగా ఆధారపడటం వల్ల, స్థానికంగా ఉన్న పాత సంప్రదాయ నీటి వనరుల నిర్వహణ లోపించి అవి క్రమంగా నిర్వీర్యమయ్యాయి. నేడు ఎండల తీవ్రత పెరిగి, భూగర్భ జలాలు అడుగంటుతుండగా, భగీరథ నీరు రాకపోతే ప్రత్యామ్నాయ మార్గమే లేకుండా పోయింది. ఒకప్పుడు అండగా నిలిచిన పాత వ్యవస్థను నిర్వీర్యం చేసి, సరిగా పనిచేయని కొత్త వ్యవస్థపై ప్రజలను వదిలేయడం వల్ల గ్రామీణ మహిళలు మళ్లీ పాత రోజుల్లోలాగే చుక్క నీటి కోసం మైళ్ల దూరం నడవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇది ప్రజలను ఇటు నల్లా నీరు లేక, అటు బోరు బావుల నీరు దొరకక రెండు వైపులా తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టింది.క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే, ఈ బాధలు కేవలం ఒకట్రెండు గ్రామాలకు పరిమితం కాలేదు. కామారెడ్డి జిల్లాలోని గాంధారి, తాడ్వాయి, లింగంపేట, రామారెడ్డి వంటి మండలాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరా తీవ్రంగా దెబ్బతింది.

మరోవైపు పట్టణ ప్రాంతాల్లోనూ ఇదే దుస్థితి నెలకొంది. ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని సూర్యాపేట మున్సిపాలిటీలో 48 వార్డులు ఉన్నాయి. ఇక్కడ సుమారు 17 వేల భగీరథ కనెక్షన్లు ఇచ్చినప్పటికీ, నీటి సరఫరా క్రమబద్ధంగా జరగడం లేదు. వేల కోట్లు ఖర్చు పెట్టి ఏర్పాటు చేసిన పైపులైన్ల ద్వారా ప్రజల ఇళ్లకు నీరు చేరకపోవడం ఈ ప్రాజెక్టులోని అతిపెద్ద వైరుధ్యం.పరిపాలనాపరమైన లోపాలు కూడా ఈ వ్యవస్థను మరింత కుంగదీస్తున్నాయి. ఎండలు మండిపోయే వేసవి కాలంలో, అత్యంత కీలకమైన తాగునీటి విభాగానికి కనీసం పూర్తిస్థాయి చీఫ్ ఇంజనీర్ (ఈఎన్‌సీ) లేకపోవడం గమనార్హం. నాలుగు ప్రధాన విభాగాలకు అధిపతులు లేకుండా పోవడంతో నిర్ణయాలు తీసుకోవడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. తగిన ప్రత్యామ్నాయ అధికారులు లేకపోవడంతో పరిస్థితి మరింత దిగజారింది. దీంతో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) స్వయంగా రంగంలోకి దిగి, అధికారులను పరుగులు పెట్టించాల్సి వస్తోంది. ప్రతిరోజూ గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాను నిశితంగా పర్యవేక్షించాలని ఆమె ఆదేశించారు.వీటికి తోడు విద్యుత్ సరఫరా లోపాలు, వాతావరణ మార్పులు ఈ పథకాన్ని దెబ్బతీస్తున్నాయి. పంపింగ్ కేంద్రాలకు నిరంతర విద్యుత్ అవసరమని తెలిసినా, గ్రామీణ ప్రాంతాల్లో కరెంట్ కోతలు నీటి సరఫరాకు పెద్ద అడ్డంకిగా మారాయి.

వాతావరణంలో సంభవించిన ఎల్‌నినో ప్రభావం వల్ల ఎగువ ప్రాంతాల నుండి ఆశించిన స్థాయిలో వరద నీరు రాలేదు. దీనివల్ల ప్రధాన రిజర్వాయర్ల నుంచే భగీరథ గ్రిడ్‌కు నీటి సరఫరా నిలిచిపోయింది. జూలై నెలాఖరు వరకు ప్రాజెక్టుల్లోకి ఇన్‌ఫ్లో పెరగకపోతే రాష్ట్రవ్యాప్తంగా తీవ్రమైన తాగునీటి కష్టాలు తప్పవని అధికారులు ప్రభుత్వానికి నివేదికలు సమర్పించారు.ప్రస్తుతం నిర్వహణ ఖర్చుల భారం కూడా ప్రభుత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఈ భారీ ప్రాజెక్టును సజావుగా నడపాలంటే కేంద్ర జలశక్తి శాఖ నుంచి దాదాపు రూ.14 వేల కోట్ల నిధులను సమీకరించాలని ప్రభుత్వం భావిస్తోంది. అయితే, ఈ నిధులు రావాలంటే క్షేత్రస్థాయిలో వాస్తవాలు తెలియాలి. అందుకే ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఒక సమగ్ర ఇంటింటి సర్వేకు శ్రీకారం చుట్టింది. ప్రతి ఇంటికీ భగీరథ నీరు అందుతోందా? నల్లా కనెక్షన్ ఉందా? అది పనిచేస్తోందా? లేదా? అనే వివరాలు సేకరించడమే ఈ సర్వే ముఖ్య ఉద్దేశం. రూ.43 వేల కోట్లు ఖర్చు పెట్టి, దేశంలోనే అగ్రగామిగా నిలిచామని చెప్పుకున్న ప్రాజెక్టులో, ఇప్పుడు మళ్లీ నీళ్లు వస్తున్నాయో లేదో తెలుసుకోవడానికి సర్వే చేయాల్సి రావడమే ఈ పథకం యొక్క అసలు వాస్తవ స్థితికి అద్దం పడుతోంది.మిషన్ భగీరథ అనేది కేవలం ఒక ప్రభుత్వ పథకం కాదు, అది కోట్లాది మంది ప్రజల ఆకాంక్ష. మహిళల కష్టాలను తీర్చాలనే ఉదాత్తమైన ఆశయంతో ప్రారంభించిన ఈ ప్రాజెక్టు, కేవలం కాగితాలకే పరిమితం కాకుండా నిజమైన ఫలితాలను ఇవ్వాలి. పైపులైన్ల మరమ్మతులు, ఖాళీగా ఉన్న కీలక పోస్టుల భర్తీ, పంపింగ్ కేంద్రాలకు నిరంతర విద్యుత్ సరఫరా, పాత బోర్లు-బావులను బ్యాకప్ వనరులుగా పునరుద్ధరించడం వంటి అత్యవసర చర్యలు చేపడితేనే ఈ మహా జల వ్యవస్థ సఫలమవుతుంది. లేదంటే, వేల కోట్ల రూపాయల ప్రజాధనం వృథా కావడమే కాకుండా, ప్రతి ఇంటికి నల్లా నీరు అనే నినాదం కేవలం ఒక అందమైన ప్రకటనగానే మిగిలిపోయే ప్రమాదం ఉంది. ప్రజా సంక్షేమమే పరమావధిగా పాలకులు ఇప్పటికైనా క్షేత్రస్థాయి లోపాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

డా . సూర్యదేవర రామకృష్ణ,
9490754169

# భారతదేశం ఎప్పుడు అప్పర్ మిడిల్ ఇన్‌కమ్ దేశంగా మారుతుంది!

***గణాంకాల గెలుపా? ప్రజల జీవన ప్రమాణాల విజయమా?***

భారతదేశం ప్రపంచంలో ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగింది. మరోవైపు, ప్రపంచ బ్యాంకు వర్గీకరణ ప్రకారం ఇప్పటికీ "దిగువ మధ్య ఆదాయ దేశం" (Lower Middle Income Country) గానే కొనసాగుతోంది. ఒకవైపు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ, మరోవైపు ఇంకా అప్పర్ మిడిల్ ఇన్‌కమ్ దేశాల జాబితాలోకి చేరని వాస్తవం అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. దేశ ఆర్థిక వ్యవస్థ భారీగా విస్తరిస్తున్నప్పుడు, ప్రజల ఆదాయం కూడా అదే స్థాయిలో పెరుగుతోందా? అభివృద్ధి ఫలాలు సమాజంలోని చివరి వ్యక్తికి చేరుతున్నాయా? అనే ప్రశ్నలకు సమాధానం వెతకాల్సిన అవసరం ఉంది.

ప్రపంచ బ్యాంకు నిర్ణయించిన ప్రమాణాల ప్రకారం ఒక దేశంలోని ప్రతి వ్యక్తికి వచ్చే స్థూల జాతీయ ఆదాయం (Gross National Income Per Capita) నిర్దిష్ట స్థాయికి చేరినప్పుడే ఆ దేశాన్ని ఉన్నత మధ్య ఆదాయ దేశంగా గుర్తిస్తారు. ప్రస్తుతం భారతదేశం ఆ లక్ష్యానికి చేరువలో ఉన్నప్పటికీ ఇంకా ఆ గడప దాటలేదు. దీనికి ప్రధాన కారణం దేశ జనాభా. ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశంగా మారిన భారతదేశంలో మొత్తం జాతీయ ఆదాయం పెరిగినా, అది ప్రతి వ్యక్తికి సమానంగా విభజించినప్పుడు తలసరి ఆదాయం ఇంకా ఆశించిన స్థాయికి చేరడం లేదు.




స్వాతంత్ర్యం తర్వాత భారతదేశం వ్యవసాయాధారిత ఆర్థిక వ్యవస్థ నుంచి పరిశ్రమలు, సేవారంగం, సమాచార సాంకేతికత, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వైపు వేగంగా పయనించింది. నేడు భారత ఐటీ రంగం ప్రపంచవ్యాప్తంగా విశ్వసనీయతను సంపాదించింది. ఔషధ తయారీ, అంతరిక్ష పరిశోధనలు, ఆటోమొబైల్ పరిశ్రమ, స్టార్టప్ వ్యవస్థ, డిజిటల్ చెల్లింపులు, ఫిన్‌టెక్ రంగాల్లో దేశం విశేష పురోగతి సాధించింది. జాతీయ రహదారులు, రైల్వే ఆధునికీకరణ, విమానాశ్రయాలు, నౌకాశ్రయాలు, పునరుత్పాదక ఇంధన రంగాల్లో భారీ పెట్టుబడులు దేశ అభివృద్ధి వేగాన్ని పెంచుతున్నాయి.

అయితే ఆర్థిక వృద్ధి కేవలం జీడీపీ పెరుగుదలతోనే కొలవలేం. అభివృద్ధి అంటే ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదల. కుటుంబ ఆదాయం పెరగడం, నాణ్యమైన విద్య అందుబాటులో ఉండడం, మెరుగైన వైద్య సేవలు, స్థిరమైన ఉపాధి, తగిన సామాజిక భద్రత, సమాన అవకాశాలు లభించడం వంటి అంశాలే నిజమైన అభివృద్ధికి కొలమానాలు. ఈ రంగాల్లో ఇంకా అనేక సవాళ్లు కొనసాగుతున్నాయి. భారతదేశంలో కోట్లాది మంది ఇప్పటికీ అసంఘటిత రంగంలోనే పనిచేస్తున్నారు. వీరికి స్థిరమైన ఆదాయం, సామాజిక భద్రత, పెన్షన్, ఆరోగ్య బీమా వంటి రక్షణలు పరిమితంగానే ఉన్నాయి. నిరుద్యోగం, ముఖ్యంగా చదువుకున్న యువతలో ఉద్యోగ అవకాశాల కొరత, దేశ ఆర్థికాభివృద్ధికి ప్రధాన అడ్డంకిగా మారుతోంది. ఆర్థిక వృద్ధి ఉపాధి వృద్ధిగా మారినప్పుడే ప్రజల ఆదాయం పెరుగుతుంది.

వ్యవసాయం ఇప్పటికీ కోట్లాది కుటుంబాలకు జీవనాధారం. కానీ రైతు ఆదాయం ఆశించిన స్థాయిలో పెరగడం లేదు. సాగు వ్యయాలు పెరుగుతుండగా మార్కెట్‌లో ధరల అనిశ్చితి రైతును ఆందోళనకు గురిచేస్తోంది. విలువ ఆధారిత వ్యవసాయం, ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమలు, శీతల గిడ్డంగులు, ఎగుమతి అవకాశాలు, సాంకేతిక ఆధారిత సాగు పద్ధతులు విస్తరించినప్పుడే రైతు ఆదాయం గణనీయంగా పెరుగుతుంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడితేనే దేశీయ వినియోగం పెరిగి మొత్తం ఆర్థిక వ్యవస్థ మరింత దృఢంగా మారుతుంది.

పరిశ్రమల అభివృద్ధి కూడా సమతుల్యంగా సాగాలి. పెద్ద పరిశ్రమలతో పాటు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ప్రోత్సాహం అత్యవసరం. ఉపాధి సృష్టిలో ఎంఎస్ఎంఈల పాత్ర అత్యంత కీలకం. పెట్టుబడులకు అనుకూల వాతావరణం, సులభ రుణాలు, సాంకేతిక సహాయం, ఎగుమతులకు ప్రోత్సాహం లభిస్తే లక్షలాది ఉద్యోగాలు సృష్టించవచ్చు. ప్రాంతీయ అసమానతలు తగ్గించాలంటే పరిశ్రమలు మహానగరాలకు మాత్రమే పరిమితం కాకుండా చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలకు విస్తరించాలి.

సేవారంగం భారత ఆర్థిక వ్యవస్థకు ప్రధాన బలంగా నిలిచింది. ఐటీ, బ్యాంకింగ్, ఆరోగ్యం, విద్య, పర్యాటకం, రవాణా, ఈ-కామర్స్ రంగాలు జాతీయ ఆదాయంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. కానీ ఈ రంగాల్లోనూ నైపుణ్యాల కొరత కనిపిస్తోంది. ప్రపంచ స్థాయి నైపుణ్యాలు కలిగిన మానవ వనరులను తయారు చేయడం కాలానుగుణ అవసరంగా మారింది.

నాణ్యమైన విద్య లేకుండా ఏ దేశమూ ఉన్నత ఆదాయ దేశంగా ఎదగలేదు. విద్య కేవలం డిగ్రీలకే పరిమితం కాకుండా ఉపాధి, ఆవిష్కరణ, పరిశోధనలకు దారితీయాలి. ప్రాథమిక విద్య నుంచి విశ్వవిద్యాలయాల వరకు నాణ్యత పెరగాలి. నైపుణ్యాభివృద్ధి, సాంకేతిక విద్య, పరిశోధనలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. ఉద్యోగాలు వెతికే యువతను ఉద్యోగాలు కల్పించే వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దే విద్యా విధానం అవసరం. ఆరోగ్య రంగంలో పెట్టుబడులు పెరగడం కూడా అంతే ముఖ్యం. ఆరోగ్యవంతమైన జనాభానే ఉత్పాదకతకు పునాది. ప్రభుత్వ ఆసుపత్రుల బలోపేతం, గ్రామీణ ఆరోగ్య సేవల విస్తరణ, వైద్య సిబ్బంది నియామకం, ప్రజారోగ్యంపై పెట్టుబడులు పెరిగితే కుటుంబాల ఆరోగ్య వ్యయం తగ్గి వారి ఆర్థిక స్థితి మెరుగుపడుతుంది.

భారతదేశం ఎదుర్కొంటున్న మరో ప్రధాన సవాలు ఆదాయ అసమానతలు. ఒకవైపు ప్రపంచ కుబేరుల జాబితాలో భారతీయులు పెరుగుతుండగా, మరోవైపు కనీస అవసరాల కోసం పోరాడుతున్న కుటుంబాలు కూడా ఉన్నాయి. అభివృద్ధి కొద్దిమందికే పరిమితమైతే అది స్థిరమైన ఆర్థికాభివృద్ధికి దోహదం చేయదు. సమాన అవకాశాలు, సమాన వనరుల పంపిణీ, సామాజిక న్యాయం, నాణ్యమైన ప్రభుత్వ విద్య, ఆరోగ్యం, సంక్షేమ కార్యక్రమాలు మరింత బలోపేతం కావాలి. మహిళల ఆర్థిక భాగస్వామ్యం పెరగడం కూడా అత్యంత అవసరం. మహిళలకు సమాన అవకాశాలు, భద్రత, నైపుణ్య శిక్షణ, స్వయం ఉపాధి అవకాశాలు, ఆర్థిక సహాయం లభిస్తే దేశ జీడీపీ గణనీయంగా పెరుగుతుందని అనేక అధ్యయనాలు సూచిస్తున్నాయి. మహిళ సాధికారత అనేది కేవలం సామాజిక అం శం మాత్రమే కాదు; అది ఆర్థికాభివృద్ధికి కూడా ప్రధాన ఇంధనం.

ప్రపంచ ఆర్థిక పరిస్థితులు కూడా భారత ప్రయాణాన్ని ప్రభావితం చేస్తున్నాయి. అంతర్జాతీయ యుద్ధాలు, చమురు ధరలు, వాతావరణ మార్పులు, వాణిజ్య వివాదాలు వంటి అంశాలు దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయి. అయినప్పటికీ ఇటీవలి కాలంలో ప్రపంచ ఆర్థిక మందగమన పరిస్థితుల్లో కూడా భారత్ నిలకడైన వృద్ధిని కొనసాగించడం ఆశాజనక పరిణామం. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలంటే నిర్మాణాత్మక సంస్కరణలు, పారదర్శక పాలన, పెట్టుబడులకు అనుకూల విధానాలు, ఉపాధి ఆధారిత అభివృద్ధి అత్యవసరం.

డిజిటల్ ఇండియా కార్యక్రమాలు దేశ ఆర్థిక వ్యవస్థను కొత్త దిశగా తీసుకెళ్లాయి. యూపీఐ చెల్లింపులు, ఆధార్ ఆధారిత సేవలు, డిజిటల్ పాలన, ఈ-గవర్నెన్స్ ద్వారా పారదర్శకత పెరిగింది. చిన్న వ్యాపారులు, గ్రామీణ ప్రాంత ప్రజలకు కూడా కొత్త అవకాశాలు లభిస్తున్నాయి. ఈ డిజిటల్ మార్పులను ఉత్పాదక రంగాలతో అనుసంధానం చేయగలిగితే భారతదేశం మరింత వేగంగా ఎదగగలదు.

పర్యావరణ పరిరక్షణను విస్మరించి సాధించే అభివృద్ధి దీర్ఘకాలంలో నిలవదు. నీటి సంరక్షణ, పునరుత్పాదక ఇంధనం, హరిత పరిశ్రమలు, కాలుష్య నియంత్రణ, ప్రకృతి వనరుల సంరక్షణ వంటి అంశాలు భవిష్యత్ ఆర్థిక స్థిరత్వానికి అత్యంత అవసరం. స్థిరమైన అభివృద్ధే నిజమైన అభివృద్ధి.

2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా అవతరించాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ లక్ష్యం సాధ్యమే. అయితే దానికి జీడీపీ పెరుగుదల మాత్రమే సరిపోదు. ప్రతి పౌరుడి ఆదాయం పెరగాలి. ప్రతి యువకుడికి ఉపాధి లభించాలి. ప్రతి రైతు ఆదాయం మెరుగుపడాలి. ప్రతి మహిళ ఆర్థికంగా సాధికారత సాధించాలి. ప్రతి చిన్నారి నాణ్యమైన విద్యను పొందాలి. ప్రతి కుటుంబానికి మెరుగైన వైద్య సేవలు అందాలి. అప్పుడే అభివృద్ధి గణాంకాల్లో మాత్రమే కాకుండా ప్రజల జీవితాల్లోనూ కనిపిస్తుంది.

అందువల్ల భారతదేశం అప్పర్ మిడిల్ ఇన్‌కమ్ దేశంగా మారడం అనేది కేవలం అంతర్జాతీయ వర్గీకరణలో ఒక మెట్టు ఎక్కడం కాదు. అది ప్రతి భారతీయుడి జీవన ప్రమాణం మెరుగుపడినట్లు ప్రపంచానికి చెప్పే మైలురాయి. దేశ సంపద పెరగడం ఎంత ముఖ్యమో, ఆ సంపద సమాజంలోని ప్రతి వర్గానికీ చేరడం అంతకంటే ముఖ్యమైనది. ఆర్థికాభివృద్ధి ఫలాలు చివరి వ్యక్తి వరకు చేరిన రోజే భారతదేశం నిజమైన అర్థంలో అభివృద్ధి చెందిన దేశంగా ప్రపంచ వేదికపై నిలుస్తుంది. అదే భారత అమృతకాలానికి, అదే వికసిత్ భారత్‌కు అసలైన నిర్వచనం.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

# ప్రైవేట్ పాఠశాలల ఫీజులను క్రమబద్ధీకరించాలి

- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్టా లక్ష్మణ్




**హయత్‌నగర్, జూలై 9 (జనం సాక్షి) :** తెలంగాణలో పేరుకుపోయిన విద్యారంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ పిలుపు మేరకు జూలై 10న నిర్వహించనున్న రాష్ట్ర వ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్టా లక్ష్మణ్ పిలుపునిచ్చారు. హయత్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఏఐఎస్ఎఫ్ హయత్‌నగర్ మండల కార్యదర్శి బొంగు అరుణ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో గోడ పత్రికను పుట్టా లక్ష్మణ్, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి సామిడి వంశీ వర్ధన్ రెడ్డి లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో గత ఆరు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.10,500 కోట్ల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిధులు విడుదల కాకపోవడంతో డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రాష్ట్రం లోని 27 వేల ప్రభుత్వ పాఠశాలలను 4 వేలకే పరిమితం చేసే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని, విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని నియమించాలని కోరారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులు, ఎంఈఓ, డీఈఓ, లెక్చరర్ పోస్టులను భర్తీ చేయడంతో పాటు, పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థుల మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ విద్యా సంస్థలను నియంత్రించి, ప్రైవేట్ పాఠశాలల ఫీజులను క్రమబద్ధీకరించాలని, ఉపకారవేతనా లపై ప్రభావం చూపుతున్న జీవో నంబర్లు 7, 8, 9 లను వెంటనే రద్దు చేసి విద్యార్థులకు ఉచిత బస్ పాస్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థుల భవిష్యత్తు, విద్యారంగ పరిరక్షణ కోసం జూలై 10న నిర్వహించనున్న రాష్ట్రవ్యాప్త విద్యా సంస్థల బంద్‌కు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు, విద్యార్థులు, తల్లిదండ్రులు సహకరించి బంద్‌ను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి చింత వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షుడు భుక్య వినోద్ నాయక్, కార్యవర్గ సభ్యుడు ఈనపల్లి ఉపేందర్, మండల సంయుక్త కార్యదర్శి జూనోతల భాను ప్రకాష్‌తో పాటు కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## కృష్ణ డైరీ పార్లర్‌ను ప్రారంభించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**కాప్రా, జూలై 9 (జనం సాక్షి) :** యువతకు స్వయం ఉపాధి అవకాశాలు ఎంచుకొని వ్యాపార రంగాల్లో రాణించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. గురువారం ఏఎస్ రావు నగర్ డివిజన్ పరిధిలోని జమ్మిగడ్డలో నూతనంగా ఏర్పాటు చేసిన కృష్ణ డైరీ పార్లర్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్లర్ యజమానులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేసిన వ్యాపార రంగంలో అడుగుపెడుతున్న యువతకు ఇలాంటి స్వయం ఉపాధి అవకాశాలు ఎంతో ప్రోత్సాహాన్ని అందిస్తాయని అన్నారు. అత్యున్నత నాణ్యతతో ప్రజలకు పాలు, పాల ఉత్పత్తులను అందిస్తూ వ్యాపారాన్ని విజయవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. స్థానికంగా కొత్త వ్యాపార సంస్థలు ప్రారంభం కావడం వల్ల ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ప్రాంత అభివృద్ధికి కూడా దోహదపడుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు లక్ష్మి నారాయణ పటేల్, కృష్ణ బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అదివాసి హక్కులను అమలుచేయాలి

- పొఫెసర్ హరగోపాల్




**ముషీరాబాద్, జూలై 9 (జనం సాక్షి) :** ఆదివాసులకు ఏ హక్కులైతే కల్పించారో, వాటిని ఆదివాసీలకు అందేట్లు గా అమలు చేయాలని ప్రొఫెసర్ హరగోపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్, ఇంద్ర పార్క్ ధర్నా చౌక్ వద్ద ఆదివాసి హక్కుల పోరాట సమితి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో తుడుం దెబ్బ మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ముఖ్యఅతిథిగా హాజరైన ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ ఆదివాసి తెగలకు చెందవలసిన విద్య ఉద్యోగ ఉపాధి రాజకీయ అవకాశాలు గణనీయంగా తగ్గిపోయాయని అన్నారు. సామాజిక విద్య, ఆర్థిక పరిస్థితులపై స్వతంత్ర విచారణ జరపాలన్నారు. తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు గోడం గణేష్, ప్రధాన కార్యదర్శి కబ్బాక శ్రవణ్ మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లా మావల మండలం కొమరం భీం కాలనీ ప్రభుత్వ భూమిలో గత 20 సంవత్సరాలుగా గుడిసెలు వేసుకొని నివసిస్తున్న ఆదివాసులకు ఇంటి స్థలాల పట్టాలు, మంచినీరు, విద్యుత్ విద్య వైద్యం రోడ్డు సౌకర్యాలు కల్పించాలన్నారు. ఆదివాసులకు ప్రత్యేక మతం కోడ్ (రిలీజియన్) కాలం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ అనురాధ, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా, వరంగల్ జిల్లా ఖమ్మం జిల్లా నుండి ఆదివాసి ఉద్యోగులు, విద్యార్థులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అత్యవసర సేవల్లో నిర్లక్ష్యం సహించం

- కల్వకుర్తిలో 108, 102, 1962 అంబులెన్స్‌లపై ఆకస్మిక తనిఖీ
- ప్రజలకు వేగవంతమైన సేవలు అందించాలి
- రాష్ట్ర వాహనాల అధికారి వరప్రసాద్ రాజు



కల్వకుర్తి, జూలై 8 (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జీవీకే - ఈఎంఆర్ఐ నిర్వహిస్తున్న 108, 102, 1962 అత్యవసర అంబులెన్స్ సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర వాహనాల అధికారి వరప్రసాద్ రాజు హెచ్చరించారు. బుధవారం కల్వకుర్తి పట్టణంలోని అంబులెన్స్ కేంద్రాన్ని జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ షేక్ జాన్ షాహిద్‌తో కలిసి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంబులెన్స్ వాహనాలు, రికార్డులు, వైద్య పరికరాలు, ఇంజిన్ పనితీరును పరిశీలించి అత్యవసర సేవల నిర్వహణపై ఆరా తీశారు. అలాగే 102 'అమ్మ ఒడి' సేవల ద్వారా గర్భిణీ స్త్రీలకు అందుతున్న వైద్య రవాణా సేవలను సమీక్షించారు. ఈ సందర్భంగా వరప్రసాద్ రాజు మాట్లాడుతూ, అత్యవసర పరిస్థితుల్లో ప్రతి నిమిషం విలువైనదని, సిబ్బంది ఎలాంటి అలసత్వానికి తావివ్వకుండా వేగంగా స్పందించి ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో అంబులెన్స్ సిబ్బంది పనితీరు ప్రశంసనీయంగా ఉందని, ప్రభుత్వ సహకారంతో ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందిస్తున్నందుకు సిబ్బందిని అభినందించారు. 'అమ్మ ఒడి' సేవగర్భిణీ స్త్రీలకుఎంతో ఉపయోగకరమైనదని పేర్కొన్న ఆయన, ప్రతి గర్భిణి ఈ సేవను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సేవలపై ఆశా కార్యకర్తలు గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని, ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో 108, 102, 1962 అంబులెన్స్ సేవలను నిర్భయంగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఈఎంఈ శ్రీనివాసులు, సిబ్బంది వరప్రసాద్, శ్రీనివాస్, అరుణ్, డాక్టర్ విలేక, తేజ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ బోల్తా పడి ఉపాధిహామీ కూలీలకు స్వల్ప గాయాలు



**మర్పల్లి, జూలై 9 (జనంసాక్షి) :** వికారాబాద్ జిల్లా మర్పల్లి మండల మండల పరిధిలోని తుమ్మలపల్లి గ్రామంలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా గురువారం నర్సరీ నుంచి క్రిమిటోరియం వద్దకు మొక్కలను తరలించి నాటడం పూర్తి చేశారు. గ్రామానికి తిరిగి వస్తున్న సమయంలో ఉపాధి హామీ కూలీలు పంచాయతీ ట్రాక్టర్‌పై ఎక్కి ప్రయాణిస్తుండగా, ట్రాక్టర్ ఒక్కసారిగా ఒక వైపు పైకి లేచడంతో కూలీలు కింద పడిపోయారు. ఈ ఘటనలో అంజమ్మ, ఎల్లమ్మ, నరసమ్మ, రత్నమ్మ, పోచమ్మ, సువర్ణ, శివరాజమ్మలకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే గ్రామ సర్పంచ్ కర్నే రాజు, ఫీల్డ్ అసిస్టెంట్ ఘటన స్థలానికి చేరుకుని గాయపడిన వారిని పట్లూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించారు. ప్రమాదంలో ఎవరికీ తీవ్ర గాయాలు కాకపోవడంతో అందరూ క్షేమంగా ఉన్నట్లు సర్పంచ్ తెలిపారు. చికిత్స అనంతరం కూలీలను ఇళ్లకు పంపినట్లు పేర్కొన్నారు.

## గాంధీ ఆసుపత్రిలో సెల్‌ఫోన్ల చోరీ..

- నిందితుడి అరెస్టు..

**సికింద్రాబాద్, జూలై 9 (జనంసాక్షి) :** గాంధీ ఆసుపత్రిలో రోగుల సహాయకుల ఫోన్లను చోరీ చేస్తున్న వ్యక్తిని చిలకలగూడ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి నుంచి దొంగిలించిన ఆరు విలువైన సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోండా మార్కెట్‌లోని మహ్మద్ ఇస్మాయిల్ చికెన్ సెంటర్‌లో పనిచేసే మహ్మద్ నిజాముద్దీన్, తన సహోద్యోగి అనారోగ్యానికి గురికావడంతో జులై 7న రాత్రి చికిత్స కోసం గాంధీ ఆసుపత్రికి వెళ్లారు. ఆసుపత్రిలోని వెయిటింగ్ హాల్ లో విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో, తమ వద్ద ఉన్న ఆరు సెల్‌ఫోన్లను ఛార్జింగ్ పెట్టి నిద్రపోయారు. తెల్లవారుజామున 2:30 గంటల సమయంలో నిద్రలేచి చూసేసరికి ఫోన్లు కనిపించకపోవడంతో బాధితులు ఆందోళన చెందారు. ఎక్కడ వెతికినా దొరకకపోవడంతో నిజాముద్దీన్ చిలకలగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఆసుపత్రి పరిసరాల్లోని సీసీ కెమెరాలను పరిశీలించి, మైలార్‌గడ్డకు చెందిన బానాల వరుణ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం బయటపడింది. వ్యసనాలకు బానిసైన నిందితుడు సులభంగా డబ్బు సంపాదించేందుకు గాంధీ ఆసుపత్రి వంటి జన సంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాలను ఎంచుకుని దొంగతనాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. ఈ కేసులో నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సిబ్బందిని సికింద్రాబాద్ జోన్ డీసీపీ రక్షిత కె.మూర్తి, అదనపు డీసీపీ నర్సయ్య, ఏసీపీ కె.శశాంక్ రెడ్డి అభినందించారు. ఈ ఆపరేషన్‌లో ఇన్‌స్పెక్టర్ వి.రామకృష్ణ, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ఎల్.మధుబాబు, ఎస్సై రాకేశ్, క్రైమ్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

## నగరంలో ఆయుర్వేద చికిత్సకు ఆదరణ

- సాయి ఆయుష్ ఆయుర్వేద ఆసుపత్రి వ్యవస్థాపకురాలు డా.సునీత ముంద్రా




**ఖైరతాబాద్, జూలై 9 (జనం సాక్షి) :** నగరంలో ఆసుపత్రి ఆధారిత సమగ్ర ఆయుర్వేద చికిత్సకు ప్రాధాన్యం పెరుగుతోందని, కేపీహెచ్ బీలోని ఎన్ఎబిహెచ్ గుర్తింపు పొందిన సాయి ఆయుష్ ఆయు ర్వేద ఆసుపత్రి ఆయుర్వేదం, పంచకర్మ, ప్రకృతి వైద్యం, ఫిజియోథెరపీ సేవలను ఒకే చోట అంది స్తోందని ఆసుపత్రి వ్యవస్థాపకురాలు డా.సునీత ముంద్రా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీర్ఘకాలిక నడుము, మెడ నొప్పి, కీళ్లవాపు, సయా టికా, వెన్నెముక, క్రీడా గాయాలు, పక్షవాతం, పార్కి న్సన్స్ తదితర సమస్యలకు చికిత్సతో పాటు మదీ నాగూడలో ఔట్‌పేషెంట్ పంచకర్మ కేంద్రం కూడా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అనోరెక్టల్ విభాగం లో మొలలు, ఫిస్టులా, ఫిషర్‌లకు డా.అక్షయ్, డా.హరీష్, డా.రేవతి సేవలందిస్తుండగా, మహిళల ఆరోగ్య విభాగానికి డా.వాగ్దేవి నేతృత్వం వహిస్తు న్నారని తెలిపారు. జూలై నెల పొడవునా ఉచిత మహిళా ఆరోగ్య సంప్రదింపులు, ప్రతి గురువారం వయోవృద్ధులకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహి స్తున్నట్లు చెప్పారు.

## మహిళపై అత్యాచారం కేసు ఛేదన

- 24 గంటల్లోనే ఆటో డ్రైవర్ అరెస్ట్
- ఆటో, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం



**పోచారం, జూలై 9 (జనం సాక్షి) :** భరత్‌నగర్‌లో ఆస్పత్రికి తీసుకెళ్లాలని ఆటో ఎక్కిన ఓ మహిళపై అత్యాచారం చేసి, ఆమె వద్ద ఉన్న సెల్‌ఫోన్, నగదు అపహరించిన ఘటనను పోచారం ఐటీ కారిడార్ పోలీసులు 24 గంటల్లోనే ఛేదించారు. ఈ కేసులో నిందితుడైన ఆటో డ్రైవర్‌ను అరెస్టు చేసి, అతని వద్ద నుంచి ఆటోతో పాటు రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జూలై 8వ తేదీ ఉదయం సుమారు 10:30 గంటల సమయంలో ఓ మహిళ భరత్‌నగర్, ఉప్పల్‌లో ప్యాసింజర్ ఆటో ఎక్కి ఆస్పత్రికి తీసుకెళ్లాలని డ్రైవర్‌ను కోరింది. అనంతరం ఆటో డ్రైవర్ ఆమెను భరత్‌నగర్‌లోని తాటికల్లు డిపోకు తీసుకెళ్లి అక్కడ కల్లు పార్సిల్ తీసుకున్నాడు. తర్వాత ఘట్‌కేసర్ ఔటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్ సమీపంలోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి స్ప్రైట్ బాటిల్‌లో కల్లు పోసి మహిళకు తాగించాడు. మహిళ స్పృహ కోల్పోయిన అనంతరం ఆమెపై అత్యాచారానికి పాల్పడి, ఆమె వద్ద ఉన్న సెల్‌ఫోన్, కొంత నగదును అపహరించి అక్కడే వదిలేసి పరారయ్యాడు. బాధితురాలు పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## అంత్యోదయ కార్డును రద్దు చేసే విధానాన్ని విరమించుకోవాలి



**మెదక్ టౌన్, జూన్ 9 (జనం సాక్షి) :** అంత్యోధయ కార్డు రద్దును విరమంచుకోవాలని మెదక్ జిల్లా కేంద్రంలో పోస్ట్ ఆఫీస్ చౌరస్తా వద్ద సిఐటియు వ్యవసాయ కార్మిక సంఘం రైతు సంఘం వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు సంతోష్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కే. మల్లేశం మాట్లాడుతూ దేశంలో ని 80 కోట్ల మంది తెల్ల రేషన్ కార్డులు కలిగి ఉన్నారని అన్నారు. దేశంలో సుమారుగా 35 కోట్ల మంది అంత్యోదయ కార్డులు ఉన్నాయని అన్నారు .మెదక్ జిల్లాలో 213873 తెల్ల రేషన్ కార్డులు జిల్లాలో 13,857 అంతదయ్య కార్డులు కలిగి ఉన్నారని తెలిపారు.మెదక్ జిల్లాలో సుమారుగా 15000 కుటుంబాలు 35 కిలోల బియ్యాన్ని నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో అందరికీ అన్నం పెడతామని గొప్పలు చెబుతున్న బిజెపి అంత్యోదయ కార్డులను రద్దు చేయడం దుర్మార్గం అని పేర్కొన్నారు. ఆహార భద్రత చట్టం ప్రకారం అందరికీ పేదలకు అన్నం పెట్టాలని చట్టంలో ఉందని వివరించారు. చట్టం ప్రకారం పేదలకు అన్నం పేట్టే విధానాన్ని పెంచాలని డిమాండ్ చేశారు.దేశంలో జనాభా ప్రకారం అందరికీ అన్నం పెట్టే ఆహార భద్రత చట్టాన్ని సవరించడం న్యాయం కాదని దయ్యాపట్టారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి పేదలను గుర్తించి కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో నాయకులు వికలాంగుల సంఘం జిల్లా నాయకులు కె.కవిత వై దుర్గ రైతు సంగం సిహెచ్ బచ్చా గౌడ్, రాణి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## సాతంరాయిలో ఘోర రోడ్డు ప్రమాదం

- ఇద్దరు మహిళల మృతి



**శంషాబాద్, జూలై 9 (జనంసాక్షి) :** అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్ కారణంగా ఇద్దరు మహిళల ప్రాణాలను బలిగొన్న విషాద ఘటన శంషాబాద్ ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. ఆర్‌జీఐఏ ఇన్‌స్పెక్టర్ వి.సంజీవ్ తెలిపిన వివరాల ప్రకారం శంషాబాద్ సమీపంలోని సాతం రాయి వద్ద ఓ ఫంక్షన్ హాల్‌లో పని ముగించుకుని తిరిగి వస్తున్న సుమ (55), చిలకమర్తి సువర్ణ (66) సాతంరాయి బస్‌స్టాప్ సమీపంలో రోడ్డు దాటుతుండగా, శంషాబాద్ నుంచి సాతంరాయి వైపు మిర్చి లోడ్‌తో వెళ్తున్న బొలెరో వాహనం కేఏ13ఏఏ4726 ముందున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే ప్రయత్నంలో అదుపుతప్పి వారిని ఢీకొట్టింది. ప్రమాదం తీవ్రతకు ఇద్దరు మహిళలు అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదం అనంతరం కొంతసేపు ఆ ప్రాంతంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న ఆర్‌జీఐఏ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కర్ణాటకకు చెందిన బొలెరో డ్రైవర్ జైసన్ వీఎల్ (21)పై కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు.

# ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల ఫీజులపై నియంత్రణ చట్టం తీసుకురావాలి

- ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి
- భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా)




**ముషీరాబాద్, జూలై 9 (జనం సాక్షి) :** తెలంగాణ లో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు అధిక ఫీజులతో విద్యను వ్యాపారంగా మార్చాయని, ఫీజుల నియంత్రణకు ప్రత్యేక చట్టం తీసుకురావడంతో పాటు ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి డిమాండ్ చేశారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జూలై 7 నుంచి 9 వరకు నిర్వహించిన ఐద్వా మూడు రోజుల వైజ్ఞానిక శిక్షణా తరగతుల ముగింపు సందర్భంగా ఆమె మాట్లాడారు. ఎస్ఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా, ఏరియా ఆస్పత్రులపై రెండు నెలలపాటు సర్వే నిర్వహించి, అందులో వెలుగుచూసే సమస్యల ఆధారంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. మహిళల రాజకీయ సాధికారత కోసం పార్లమెంట్ ఆమోదించిన 33 శాతం మహిళా రిజర్వేషన్ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. జనగణన, నియోజకవర్గాల పునర్విభజన పేరుతో అమలును వాయిదా వేయడం సరికాదన్నారు. ఈ నెల పార్లమెంట్ సమావేశాల సందర్భంగా దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఐద్వా సీనియర్ నాయకురాలు బత్తుల హైమావతి ఉత్పత్తి రంగంలో మహిళల పాత్ర అంశంపై ప్రసంగిస్తూ... వ్యవసాయం, సేవారంగాల్లో మహిళల పాత్ర కీలకమని పేర్కొన్నారు. మహిళలకు స్థిరమైన ఉపాధి, సముచిత వేతనాలు కల్పిస్తే రాష్ట్ర ఆర్థికాభివృద్ధితో పాటు ప్రజల కొనుగోలు శక్తి కూడా పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్. అరుణజ్యోతి, సహాయ కార్యదర్శులు కె.ఎన్. ఆశాలత, బుగ్గవీటి సరళ, రాష్ట్ర కోశాధికారి మాచర్ల భారతి, అఖిల భారత నాయకులు పి. ప్రభావతి, బండి పద్మ, నాగలక్ష్మి, ఎన్. రత్నమాల, కె. గీతారాణి, రాష్ట్రంలోని 29 జిల్లాల మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
10 జూలై 2026

# ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- రాష్ట్ర మంత్రులు గడ్డం వివేక్ వెంకటస్వామి, దామోదర్ రాజనర్సింహ



**సంగారెడ్డి, జూలై 9 (జనం సాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన, ఆధునిక వైద్య సేవలను ఉచితంగా అందించడంతో పాటు పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు సత్వర వైద్య సేవలు అందుబాటులో ఉండేలా ఈఎస్ఐ వైద్య సేవలను విస్తరిస్తోందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. గురువారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఈఎస్ఐ డిస్పెన్సరీని జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ షెట్కర్‌తో కలిసి మంత్రులు ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో విశ్వాసం పెరిగేలా అన్ని మౌలిక వసతులు, వైద్య సదుపాయాలను కల్పిస్తూ ఈఎస్ఐ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. సంగారెడ్డి పారిశ్రామిక ప్రాంతంలో పనిచేసే కార్మికులు వైద్య చికిత్స కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే అన్ని రకాల వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో సంగారెడ్డిలో ఈఎస్ఐ డిస్పెన్సరీని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.రాష్ట్రంలో సుమారు 80 లక్షల కుటుంబాలు ఈఎస్ఐ వైద్య సేవలపై ఆధారపడుతున్నాయని, ఈఎస్ఐ ఆసుపత్రులు, డిస్పెన్సరీల్లో అవసరమైన అన్ని సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. ఇటీవల ఆర్సీ పురం ఈఎస్ఐ ఆసుపత్రిని సందర్శించిన సందర్భంగా కొన్ని ప్రత్యేక వైద్య సేవలు లేకపోవడంతో రోగులు సనత్‌నగర్‌కు వెళ్తున్న విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. వచ్చే ఆరు నెలల్లో అక్కడ అన్ని ప్రత్యేక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చి, కార్మికులు స్థానికంగానే పూర్తి స్థాయి చికిత్స పొందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. త్వరలో ఆర్సీ పురం ఈఎస్ఐ ఆసుపత్రిలో 20 పడకల డయాలసిస్ యూనిట్‌ను ఏర్పాటు చేయడంతో పాటు వచ్చే ఏడాదిలో కార్డియాలజి సెంటర్‌ను కూడా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహలి మాట్లాడుతూ, సంగారెడ్డి జిల్లా పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. జిల్లాలో ఇప్పటికే ఏడు ఈఎస్ఐ డిస్పెన్సరీలు ఉండగా, సంగారెడ్డిలో ఎనిమిదో డిస్పెన్సరీని ప్రారంభించడం సంతోషకరమన్నారు. రూ.200 కోట్లతో సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. జహీరాబాద్, నారాయణఖేడ్, సదాశివపేట, ఆందోల్, జోగిపేట ప్రాంతాల ప్రజలకు కార్డియాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ, ఈఎన్‌టీ, క్యాన్సర్ చికిత్స, ట్రామా కేర్, నేత్ర వైద్య సేవలు వంటి సూపర్ స్పెషాలిటీ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని సూపర్ స్పెషాలిటీ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు పీజీ సీట్లను కూడా కేటాయించినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని 104 ట్రామా కేర్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని, జహీరాబాద్, నారాయణఖేడ్, ఆందోల్ ప్రభుత్వ ఆసుపత్రుల్లో పడకల సంఖ్యను పెంచుతూ వైద్య సేవలను మరింత విస్తరిస్తున్నామని తెలిపారు. ప్రజలకు అన్ని రకాల ఆధునిక వైద్య సేవలను పూర్తిగా ఉచితంగా అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. జిల్లాలో కార్మికుల వైద్య సేవల విస్తరణకు ప్రభుత్వం మరింత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ షెట్కర్ మాట్లాడుతూ, సంగారెడ్డి రాష్ట్రంలో ప్రధాన పారిశ్రామిక జిల్లాగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో వేలాది మంది కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం మరింత వైద్య మౌలిక వసతులను కల్పించాలని కోరారు. ఈఎస్ఐ వైద్య సేవల విస్తరణ కార్మికులకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈఎస్ఐ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎన్. గౌతమ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈఎస్ఐ కార్మికుల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తూ, వారికి నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు కట్టుబడి పనిచేస్తున్న డాక్టర్ ఎన్. గౌతమ్ సేవలను మంత్రివర్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్‌లు వనిత సంతోష్, అంజమ్మ సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఈఎస్ఐ జాయింట్ డైరెక్టర్ డా. గౌతమ్, వైద్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# నిరుపయోగం విలువైన ప్రభుత్వ భవనాలు




**జడ్చర్ల, జూలై 9 (జనంసాక్షి) :** జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ ఆస్తుల, భవనాల నిర్వహణ తీరు ప్రశ్నార్థకంగా మారుతోంది. విలువైన ప్రభుత్వ భవనాలు సరైన పర్యవేక్షణ లేక శిథిలావస్థకు చేరుతున్నాయి. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ భవనాలు ప్రస్తుతం ఎవరికీ ఉపయోగపడకుండా పాడుబడుతున్నాయి. ముఖ్యంగా కావేరమ్మపేటలో 44వ జాతీయ రహదారి పక్కన ఉన్న పాత మున్సిపల్ కార్యాలయం, ప్రభుత్వ అతిథి గృహం, అదే ప్రాంతంలో ఉన్న ఆర్ అండ్ బి కార్యాలయం, వాటి పక్కనే ఉన్న మోర్త్ భవనం ప్రస్తుతం ఎటువంటి వినియోగం లేకుండా ఖాళీగా ఉన్నాయి. వీటితో పాటు కావేరమ్మపేట గ్రామంలోని గ్రామ చావిడి, పాత పశువుల ఆసుపత్రి, బాదేపల్లి పాత కమ్యూనిటీ ఆస్పత్రి భవనం, తహసీల్దార్ కార్యాలయం పక్కన ఉన్న పాత భూసార పరీక్షా కేంద్రం భవనాలు నిరుపయోగంగా మారుతున్నాయి. పట్టణంలో సుమారు 15 ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో ఇబ్బందులు పడుతున్న వేళ, ప్రభుత్వమే నిర్మించుకున్న ఈ భవనాలు ఇలా వృథాగా పడి ఉండటంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, ఖాళీగా ఉన్న ఈ భవనాలను ప్రభుత్వ కార్యాలయాలకు లేదా ప్రజా ఉపయోగ కార్యక్రమాలకు కేటాయించి, ప్రభుత్వ ఆస్తులను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# రీసర్వే పనులు వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్




**గద్వాల నడిగడ్డ, జూలై 9 (జనం సాక్షి) :** ప్రభుత్వం మొదటి దశలో జిల్లాలో ఎంపిక చేసిన 70 గ్రామాల్లో రీసర్వే పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుంచి రెవిన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్, సర్వే కమిషనర్ రాజీవ్ గాంధీ హనుమంతు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత అధికారులతో రీసర్వేపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నోటిపై చేసిన ప్రతి గ్రామంలో గ్రామ సభలను ఆలస్యం చేయకుండా నిర్వహించి, వెంటనే రీసర్వే పనులను ప్రారంభించాలని సూచించారు. గ్రామసభల నిర్వహణను వాయిదా వేయకుండా, ప్రభుత్వం నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలని స్పష్టం చేశారు. లైసెన్స్ సర్వేయర్లతో పాటు రెగ్యులర్ సర్వేయర్లను కూడా రీసర్వేలో వినియోగించాలని, లైసెన్స్ సర్వేయర్లు చేసే పనిని మండల సర్వేయర్లు తప్పనిసరిగా పర్యవేక్షించాలని సూచించారు. రెవెన్యూ సిబ్బందికి సర్వేపై ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని, ప్రతి శిక్షణార్థికి కనీసం ఒక గ్రామంలో ప్రాక్టికల్ సర్వే పూర్తి చేసిన తర్వాతే శిక్షణ పూర్తయినట్లు పరిగణిస్తామని వెల్లడించారు. నవంబర్ నాటికి తొలి దశలో లక్ష్యంగా పెట్టుకున్న గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి, మిగిలిన గ్రామాలను వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. జిల్లా స్థాయిలో నిరంతర పర్యవేక్షణ, సమన్వయంతో రీసర్వే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. గద్వాల ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత జిల్లా అధికారులతో కలిసి వీసీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ విసి అనంతరం మాట్లాడారు. రీసర్వేకు సంబంధించి త్వరలోనే లైసెన్స్ సర్వేయర్లతో సమన్వయ సమావేశం నిర్వహించి వారికి తగిన సూచనలు చేయాలన్నారు. రాజోలి, ఎర్రవల్లి మండల కేంద్రాల్లో తహసిల్దార్ కార్యాలయాలతో పాటు గద్వాల, అలంపూర్ లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల భవన నిర్మాణాలకు అవసరమైన స్థలాలను గుర్తించాలన్నారు. భూభారతి, సాదా బైనమా, తదితర దరఖాస్తులను పెండింగ్ లో ఉంచకుండా నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధుమోహన్, ఆర్డీవో శ్రీనివాసరావు, సర్వే ఏడి నూకరాజు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలి

- ఖాళీగా ఉన్న టీచర్స్ పోస్టులను భర్తీ చేయాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు
- కలెక్టరేట్ వద్ద సీపీఎం నేతల ధర్నా
- ఏవోకి వినతిపత్రం




**సంగారెడ్డి, జూలై 9 (జనం సాక్షి) :** సంగారెడ్డి జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులను కల్పించాలని, ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజు దోపిడీల నరకట్టి విద్యను వ్యాపారం చేస్తున్న యాజమాన్యాలపై కఠిన చర్యలు ప్రభుత్వం తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజ్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి జిల్లా కలెక్టరేట్ ఏవో వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా జయరాజ్ మాట్లాడుతూ సిపిఎం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా గత 15 రోజులుగా అనేక పాఠశాలలో సర్వే చేయడం జరిగిందనీ, ఈ సర్వే ద్వారా అనేక సమస్యలు తమ ప్రతినిధి బృందానికి వచ్చేయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు తెరిచి నెలరోజులవుతున్న విద్యార్థులందరికీ, బుక్స్ పూర్తి స్థాయిలో అందజేయకపోవడం సరికాదని అన్నారు. జియా వ్యాప్తంగా సుమారు 400 టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయనీ తెలిపారు. పటాన్చెరు నియోజకవర్గం పారిశ్రామిక ప్రాంతాల్లో అనేక చోట్ల ప్రభుత్వ పాఠశాలలు లేక చాలామంది విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారు. అనేక సమస్యలతో ప్రభుత్వ పాఠశాలు ఉన్నాయన్నారు. విద్యారంగం పట్ల పాలకులు నిర్లక్ష్యంగా ఉంటున్నారనీ తెలిపారు. పాల్టెక్నిక్ కళాశాలలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. చాలా చోట్ల స్కూల్లాక్ ప్రవహరీ గోడా, భోజన షెడ్స్, సరిపడ టాయిలెట్స్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారాన్నారు. ప్రభుత్వ స్కూల్స్ కంప్యూటర్లు లేవు. ప్రభుత్వం విద్యారంగానికి రాష్ట్ర బడ్జెట్లో 10% నిధులు కేటాయించాలన్నారు. వలస ప్రజలు ఉన్నచోట హిందీ సబ్జెక్ను ప్రవేశపెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాజయ్య, మానిక్, సాయిలు, నర్సింహులు, జిల్లా కమిటీ సభ్యులు యాదగిరి, కృష్ణ, నాయకులు అశోక్, కె.రాజయ్య, నరసింహారెడ్డి, శ్రీధర్, శంకర్, దత్తు, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాలి



**నర్సాపూర్, జూలై 9 (జనం సాక్షి) :** పీఆర్టీయూ టీఎస్ నర్సాపూర్ మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నర్సాపూర్, జెడ్పీహెచ్ఎస్ కాగజ్‌మద్దూర్, జెడ్పీజీహెచ్ఎస్ నర్సాపూర్, జీహెచ్ఎస్ నర్సాపూర్, రెడ్డిపల్లి, పెద్దచింతకుంట పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సామ్య నాయక్ మాట్లాడుతూ పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులతో సమావేశమైన ఆయన, ఉపాధ్యాయులకు భోజనాలు, టిఫిన్లు అందించడం కంటే వారి ప్రధాన సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించాలని అన్నారు.మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పీఆర్సీని వెంటనే ప్రకటించి అమలు చేయాలని, కొత్త హెల్త్ స్కీమ్ కింద అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో నగదు రహిత వైద్యం అందేలా హెల్త్ కార్డులు జారీ చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని, ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహించి దసరా నాటికి ప్రమోషన్లతో కూడిన బదిలీలను పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ అధ్యక్షురాలు జ్యోతి, ప్రధాన కార్యదర్శి భీమ్లా నాయక్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వీరేశం, మండల బాధ్యులు శ్రీకాంత్ గౌడ్, రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, కార్యవర్గ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



**ఉప్పునుంతల, జూలై 9 (జనం సాక్షి) :** రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, జూలై 10న నిర్వహించనున్న రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ), వామపక్ష విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు చింతల నాగరాజు, ఉప్పునుంతల మండల అధ్యక్షుడు అరవింద్, కార్యదర్శి చింటూ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను విలీనం చేసే ప్రతిపాదనలను ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖకు పూర్తి స్థాయి మంత్రిని నియమించాలని, మధ్యాహ్న భోజన పథకానికి నిధులు పెంచి మహిళా సంఘాల ద్వారా అమలు చేయాలని కోరారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులు, ఎంఈఓ, డీఈఓ, లెక్చరర్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ కాస్మెటిక్ చార్జీలను పెంచి పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కింద రూ.250 కోట్లను విడుదల చేయాలని కోరారు. రాష్ట్రంలో విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించాలని, కార్పొరేట్ విద్యాసంస్థలపై నియంత్రణ తీసుకురావాలని, బడ్జెట్ పాఠశాలలకు ప్రభుత్వ సహకారం అందించాలని, ప్రైవేట్ విద్యాసంస్థలకు ఫీజు నియంత్రణ విధించాలని కోరారు. గత ఆరు సంవత్సరాలుగా స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద సుమారు రూ.10,500 కోట్లకు పైగా బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ బకాయిలు విడుదల కాకపోవడంతో డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ తదితర ప్రొఫెషనల్ కోర్సుల్లో చదువుతున్న లక్షలాది మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రజా విద్యాసంస్థలు ఆర్థిక ఇబ్బందులతో ఉద్యోగులకు జీతాలు చెల్లించలేని పరిస్థితిలో ఉన్నాయని, ప్రభుత్వం దీనిపై దృష్టి సారించాలని అన్నారు. అలాగే జీవో నంబర్లు 7, 8, 9 ద్వారా ఉపకార వేతన పథకాలను బలహీనపరిచే చర్యలను విరమించుకోవాలని, విద్యార్థులకు ఉచిత వసతి, భోజన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం జూలై 10న రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ నిర్వహిస్తున్నామని, విద్యాసంస్థల యాజమాన్యాలు, విద్యార్థులు, ప్రజలు బంద్‌కు సహకరించి విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ విద్యార్థి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీలు ఆర్థిక వనరులను పెంపొందించుకోవాలి



**గద్వాల నడిగడ్డ, జూలై 9 (జనం సాక్షి) :** ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని శాశ్వత అభివృద్ధికి దోహదపడే విధంగా మూడేళ్ల కార్యాచరణ సమగ్రాభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ రావు అన్నారు. గురువారం ఐడీఓసీ సమావేశ మందిరంలో గ్రామ పంచాయతీ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధి అనేది కేవలం నిర్మాణ పనులకు మాత్రమే పరిమితం కాకుండా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే సమగ్ర ప్రక్రియ అని అన్నారు. తాగునీరు,పారిశుద్ధ్యం,గ్రామీణ రహదారులు, వీధి దీపాలు,విద్య, ఆరోగ్యం,పర్యావరణ పరిరక్షణ,ఉపాధి, మహిళా సాధికారత, యువత అభివృద్ధి, వ్యవసాయాభివృద్ధి వంటి అన్ని రంగాలకు సమాన ప్రాధాన్యతనిస్తూ గ్రామాభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. గ్రామసభలను సమర్థవంతంగా నిర్వహించి ప్రజల సూచనలు, స్థానిక అవసరాలు, సమస్యలను గుర్తించి వాటికి ప్రాధాన్యత క్రమంలో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వీబీజీరాంజీ పథకం,16వ ఆర్థిక సంఘం నిధులు, స్వచ్ఛ భారత్ మిషన్, జల్ సిరి, తదితర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి పథకాలను సమన్వయం చేస్తూ గ్రామ అవసరాలకు అనుగుణంగా నిధులను సమీకరించి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో నీటి సంరక్షణను ప్రజా ఉద్యమంగా మార్చాలని,ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలు,ప్రతి రైతు పొలంలో నీటి కుంటలు,చెక్‌డ్యాంలు, రీచార్జ్ నిర్మాణాలు, వర్షపు నీటి సంరక్షణ చర్యలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పించాలంటే ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అలాగే గ్రామాల్లో ఘన వ్యర్థాల నిర్వహణను సమర్థవంతంగా అమలు చేయాలని, ప్రతి ఇంటి వద్ద చెత్తను తడి, పొడి, శానిటరీ, ప్రత్యేక వ్యర్థాలుగా వేరు చేసే అలవాటు పెంపొందించాలని సూచించారు. పరిశుభ్రమైన గ్రామాల నిర్మాణంలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమన్నారు. గ్రామ పంచాయతీల ఆర్థిక స్వావలంబన కోసం ఇంటి పన్ను వసూళ్లను మెరుగుపరచడం, డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించడం, పంచాయతీ ఆస్తుల సమర్థ వినియోగం, పౌర సేవలను విస్తరించడం ద్వారా స్వంత ఆదాయ వనరులను పెంచాలని సూచించారు. ప్రతి సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి గ్రామాభివృద్ధిని బాధ్యతగా స్వీకరించి సమన్వయంతో పనిచేయాలని, ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ప్రజలకు నాణ్యమైన సేవలు అందిస్తూ ఆదర్శ గ్రామాల నిర్మాణానికి కృషి చేయాలని అదనపు కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీకాంత్,డిఆర్డిఓ ముషాహిదా బేగం,డిఎల్పిఓ ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఎంపీడీవోలు, గ్రామ పంచాయతీ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

# దేశ నిర్మాణంలో విద్యార్థులదే కీలక పాత్ర

**మక్తల్, జూలై 9 (జనంసాక్షి) :** దేశ నిర్మాణంలో విద్యార్థులదే కీలక పాత్ర అని ఆర్ ఎస్ ఎస్ విభాగ్ ప్రచారక్ దేవేందర్ అన్నారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా మఖ్తల్ శాఖ ఆధ్వర్యంలో రక్త దాన శిబిరం, నో డ్రగ్స్ సొసైటీ క్యాంపెయిన్ కార్యక్రమాలు నిర్వహించారు. అంతకుముందు ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలో నిర్వహించిన నో డ్రగ్ సొసైటీ కార్యక్రమంలో పతాకావిష్కరణ చేశారు. విద్యార్థులు డ్రగ్స్ కు దూరంగా ఉండి చట్టాలను గౌరవిస్తూ బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని కుటుంబ నిర్మాణం, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర సాధనలో నా రక్తం నా తెలంగాణ పేరిట రాష్ట్ర వ్యాప్తంగా ఎబివిపి నిర్వహించిన సేవా పోరాట కార్యక్రమాల కొనసాగింపుగా ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా మఖ్తల్ మార్కెట్ యార్డ్ లో రక్త దాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు కొండయ్య ఎబివిపి నగర అధ్యక్షులు అంజి రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ వసుంధర, ఎబివిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వినయ్ కుమార్, నగర కార్యదర్శి వంశీ, శరణ్,సందీప్, రమేష్, అభి, తదితరులు పాల్గొన్నారు.



## గ్రామాభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయాలి



- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** గ్రామాభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయాలని భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణరావు అన్నారు. పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో గురువారం ఐడిఓసి కార్యాలయంలో గ్రామ పంచాయతి అభివృద్ధి ప్రణాళికలు అంశంపై చిట్యాల, కొత్తపల్లి గోరి, రేగొండ, మొగుళ్లపల్లి, టేకుమట్ల మండలాల సర్పంచులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన అవగహన సదస్సును జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మౌలిక సదుపాయాలు, ప్రజలకు ఉపయోగపడే ప్రణాళికలు తయారు చేయాలని తెలిపారు. గ్రామ పంచాయితీలు ఆదాయ వనరులు సొంతంగా సమకూర్చుకోవాలని సూచించారు. గ్రామాల నుండి దేశ, విదేశాలలో నివసిస్తున్న ప్రముఖులు ద్వారా గ్రామాలు అభివృద్ధికి నిధులు సమకూర్చుకోవాలని తెలిపారు. ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు పోటీతత్వంతో కృషి చేయాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ద్వారా వస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 320 కోట్లతో మొరంచపల్లి వాగుపై చెక్ డ్యామ్ లు నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. పంట కాలువలు సిమెంట్ లైనింగ్ కొరకు 55 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. డిబిఎం 38 ద్వారా 44,700 ఎకరాలకు సాగునీరు అందించేందుకు డిపిఆర్ సిద్ధం చేసినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి సర్పంచులు లీడ్ తీసుకోవాలని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి మొదటి, రెండు, మూడు సంవత్సరాలకు ప్రణాళికలు తయారు చేయాలని, అట్టి ప్రణాళిక సంవత్సరం వారీగా కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. జిల్లాలో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. ఆ కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను ప్రాధాన్యతను బట్టి మొదటి, రెండవ, మూడు సంవత్సరాలలో పరిష్కరించేలా సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు తయారు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, ఆయా మండల సర్పంచులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# త్వరలో సిపిఎస్ రద్దు!

- 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు...
- వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి



**చెన్నారావుపేట, జూలై 9 ( జనం సాక్షి):** త్వరలో సిపిఎస్ రద్దు చేసి 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేయనున్నట్లు వరంగల్, ఖమ్మం నల్గొండ, టిఆర్టియు టీఎస్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి అన్నారు. గురువారం చెన్నారావుపేట మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ గురుకులం దుగ్గొండి పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్శనలో భాగంగా విద్యార్థుల క్రమశిక్షణ, ఉపాధ్యాయుల అంకిత భావం, పనితనాన్ని కొనియాడారు. పాఠశాల బిల్డింగ్ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా కృషి చేస్తానని ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు మంజూరు చేస్తానని తెలిపారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలుకు , 2004 తర్వాత ఉద్యోగంలో చేరిన ఉద్యోగ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అనగా సిపిఎస్ రద్దు చేయించుటకు పలు దఫాలుగా ప్రభుత్వంతో చర్చించానని వాటిని రద్దు చేయించుటకు కట్టుబడి ఉన్నానని పి ఆర్ సి ని త్వరలో ప్రకటించేలా కృషి చేస్తానని అన్నారు. అదేవిధంగా ఉపాధ్యాయుల సమస్యలన్నిటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సత్వర పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో పర్యావరణ రక్షణకు మొక్కలు నాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిఆర్టియుటీఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షులు ఈదునూరి రవీందర్ రెడ్డి, హనుమకొండ జిల్లా అధ్యక్షులు మండల తిరుపతిరెడ్డి, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనకిరెడ్డి మహేందర్, చెన్నారావుపేట మండల అధ్యక్షులు పూజారి సురేందర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు పోలెపల్లి రవి, కటకం రఘు, కర్ర యాకుబ్ రెడ్డి, చెన్నారావుపేట మండలం ప్రధాన కార్యదర్శి బానోతు వెంకన్న, సోషల్ వెల్ఫేర్ గురుకుల ఇన్చార్జి ప్రిన్సిపాల్ గ్లోరీ, రజిని, వెంకటరమణ, రాధిక, లావణ్య, భాగ్య లక్ష్మీ, సరిత, రజిత, రాజమణి, స్వప్న, ఉమారాణి, కవిత, పూదోట అనిల్ , మర్రి రాజు, బొమ్మెర సతీష్, రత్న సింధు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- జన్మదినాన్ని పురస్కరించుకొని మొక్కను నాటిన మంత్రి దనసరి అనసూయ సీతక్క




**ములుగు ప్రతినిధి, జులై 09(జనంసాక్షి) :** మంత్రి దనసరి అనసూయ సీతక్క తన జన్మదినాన్ని పురస్కరించుకొని గురువారం ములుగు మున్సిపాలిటీ పరిధిలో మొక్కను నాటారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ప్రతి శుభకార్యాన్ని ఒక మొక్క నాటడంతో ప్రారంభించే అలవాటు పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. నేటి అవసరాలకే కాకుండా భావితరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని అన్నారు. జన్మదినాలు, వివాహ వార్షికోత్సవాలు వంటి ప్రత్యేక సందర్భాల్లో మొక్కలు నాటడం ద్వారా సమాజానికి స్ఫూర్తినివ్వాలని మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, మున్సిపాలిటీ చైర్పర్సన్ చింతనిపుల చంద్రకళ, మహిళలు, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# 'నషా ముక్త్ భారత్ అభియాన్'కు శ్రీకారం

- రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పిలుపు
- డ్రగ్స్ వ్యతిరేక పోస్టర్ల ఆవిష్కరణ
- విద్యార్థులు, యువతతో ప్రతిజ్ఞ అవగాహన ర్యాలీ ప్రారంభం






**హనుమకొండ ప్రతినిధి, జూలై 09 (జనం సాక్షి) :** మత్తు పదార్థాల నిర్మూలనను ప్రజా ఉద్యమంగా మార్చి, డ్రగ్స్ రహిత భారత్ – డ్రగ్స్ రహిత తెలంగాణ సాధనకు ప్రతి పౌరుడు బాధ్యతగా కృషి చేయాలని రాష్ట్ర గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా పిలుపునిచ్చారు. గురువారం హనుమకొండ ఐడీఓసీ (కలెక్టరేట్)కు చేరుకున్న గవర్నర్‌కు ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన "నషా ముక్త్ భారత్ అభియాన్ – డ్రగ్స్ రహిత తెలంగాణ" కార్యక్రమంలో గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాల దుష్పరిణామాలను వివరిస్తూ రూపొందించిన అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యులు కావాలని చేపట్టిన సంతకాల సేకరణలో గవర్నర్, మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యే లు సంతకాలు చేశారు. అనంతరం విద్యార్థులు, యువత, అధికారులు, ప్రజలతో కలిసి "నషా ముక్త్ భారత్" ప్రతిజ్ఞ చేయించి, డ్రగ్స్ నిర్మూలనకు అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా ఈ సందర్భంగా తెలంగాణ ఎక్సైజ్, యాంటీ నార్కోటిక్స్ బ్యూరో, పోలీస్, జిల్లా మహిళా శిశు దివ్యాంగుల సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నాషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ నుండి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వరకూ నిర్వహించిన ర్యాలీని రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా జెండా ఊపి ప్రారంభించారు.

ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మత్తు పదార్థాల నిర్మూలన కోసం ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రారంభించిన "నషా ముక్త్ భారత్ అభియాన్" సామాజిక చైతన్య ఉద్యమంగా మారాలని అన్నారు. మత్తు రహిత సమాజ నిర్మాణం కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి కుటుంబం, ప్రతి సమాజం, ప్రతి వ్యక్తి బాధ్యత అని స్పష్టం చేశారు."మా ఇంట్లో మత్తు పదార్థాలకు చోటు లేదు" అనే సంకల్పాన్ని ప్రతి కుటుంబం చేసుకుంటే సమాజం మొత్తం మత్తు రహితంగా మారుతుందని గవర్నర్ పేర్కొన్నారు. మార్పు ఎప్పుడూ మన నుంచే ప్రారంభం కావాలని, ప్రతి ఒక్కరూ ముందుగా తాము మత్తు పదార్థాలకు దూరంగా ఉండి, కుటుంబ సభ్యులు, స్నేహితులు, సమాజాన్ని కూడా ఆ దిశగా నడిపించాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లడంలో చొరవ చూపుతున్న ముఖ్యమంత్రి కి అభినందనలు తెలియజేస్తున్నానని అన్నారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, దేశాన్ని మత్తు పదార్థాల రహితంగా తీర్చిదిద్దాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశయానికి అనుగుణంగా 'నషా ముక్త్ భారత్ అభియాన్' దేశవ్యాప్తంగా విజయవంతంగా కొనసాగుతోందని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, యువత, ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి గవర్నర్ నషా ముక్త్ భారత్ ప్రతిజ్ఞ చేయించి, మత్తు రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాష్, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు, గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం దాన కిషోర్, వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత, హనుమకొండ వరంగల్ జిల్లాల కలెక్టర్లు చాహత్ బాజ్ పాయి, డాక్టర్ సత్య శారద, జిడబ్లుఎంసి కమిషనర్ వెంకన్న, ప్రజాప్రతినిధులు, అదనపు కలెక్టర్లు రవి, సంధ్యారాణి, వై వి గణేష్, డిసిపి ధార కవిత, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

### స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు రాష్ట్ర గవర్నర్ ప్రశంసలు

హనుమకొండ కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల ప్రదర్శన స్టాళ్లను రాష్ట్ర గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా గురువారం సందర్శించి, మహిళల కృషిని అభినందించారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఎస్ ఈ ఆర్ పి పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లలో ప్రదర్శించిన వివిధ ఉత్పత్తులను గవర్నర్ ఆసక్తిగా పరిశీలించారు. మహిళలు స్వయంగా తయారు చేసిన ప్రతి ఉత్పత్తి గురించి అడిగి తెలుసుకుంటూ, వాటి తయారీ విధానం, నాణ్యత, మార్కెటింగ్ అవకాశాలపై వారితో ముచ్చటించారు. ఈ సందర్భంగా మిల్లెట్లతో (చిరుధాన్యాలు) తయారు చేసిన ఆహార ఉత్పత్తులు, చేతితో నేసిన వస్త్రాలు, స్వచ్ఛమైన నెయ్యి, వంట నూనెలు, ఇతర విలువ ఆధారిత ఆహార ఉత్పత్తులను పరిశీలించి ప్రశంసించారు. మహిళల శ్రమకు ప్రోత్సాహంగా పలు ఉత్పత్తులను స్వయంగా కొనుగోలు చేశారు. అలాగే ప్రసిద్ధ వరంగల్ దరీ స్టాల్‌ను సందర్శించి, దరీల ప్రత్యేకత, తయారీ ప్రక్రియ, వాటి జాతీయ, అంతర్జాతీయ మార్కెట్ అవకాశాల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. దరీ ఉత్పత్తుల నాణ్యతను కొనియాడుతూ వాటిని కూడా కొనుగోలు చేసి మహిళా కళాకారులను ప్రోత్సహించారు. స్వయం సహాయక సంఘాల ద్వారా తయారవుతున్న నాణ్యమైన ఉత్పత్తులకు ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తోందని, ఇలాంటి ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ కల్పించడం ద్వారా మహిళలు ఆర్థికంగా మరింత బలోపేతం అవుతారని గవర్నర్ అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, గవర్నర్ కార్యదర్శి దాన కిషోర్, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, సిపి శ్వేతా,జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### తెలంగాణ రాష్ట్ర గవర్నర్‌కు ఘన స్వాగతం పలికిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య



**కాజీపేట, జూలై9 (జనం సాక్షి) :** వరంగల్ పర్యటనలో భాగంగా నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ), వరంగల్‌కు విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా కి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించిన ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఆయనకు ఆత్మీయ స్వాగతం తెలిపారు. అనంతరం గవర్నర్ తో మర్యాదపూర్వకంగా సమావేశమై, వరంగల్ ప్రాంత అభివృద్ధి, విద్యా రంగ పురోగతి, ప్రజా సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలపై సంక్షిప్తంగా చర్చించారు. అలాగే కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కి కూడా ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్వాగతం పలికి అభినందనలు తెలిపారు.

# పాటకు మరణం లేదు

- నాగన్న విప్లవోద్యమ సాంస్కృతిక ధ్రువతార
- ప్రముఖ కవి గాయకులు యోచన



**వరంగల్ ఈస్ట్, జూలై 09(జనం సాక్షి) :** విప్లవ సాంస్కృతి కోద్యమ సేనాని పీడిత తాడిత ప్రజల ధ్రువతార కామ్రేడ్ నాగన్న మరణం తీరని లోటు అని ప్రముఖ కవి గాయకులు యోచన అన్నారు. సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో ఖిలా వరంగల్లోని చమన్ లో అరుణోదయ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు సిపిఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు కామ్రేడ్ నాగన్న సంతాప సభ సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా జిల్లా కార్యదర్శి రాజేందర్ అధ్యక్షతన జరిగిన సభలో ప్రముఖ కవి గాయకులు యువజన పాల్గొని మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో జరుగుతున్న అసమానతలు దోపిడీ పీడనలు ప్రజలను పట్టిపీడిస్తున్న సందర్భంలో సాంస్కృతిక ఉద్యమాలను నిర్వహించాల్సిన సందర్భంలో కామ్రేడ్ నాగన్న మరణం తీరని లోటని అన్నారు కామ్రేడ్ రాగన్న విప్లవ రాజకీయ జీవితము విప్లవ సాంస్కృతిక జీవితము 1977లో ఇందిర ప్రభుత్వం ఎమర్జెన్సీ ఎత్తివేసిన తర్వాత ఒకేసారి మొదలైనవని 50 సంవత్సరాల అరుణోదయ సుదీర్ఘ చరిత్రతో నాగన్న జీవితం ముడిపడి ఉందని కానీ తన రంగ ప్రవేశానికి ముందు అనేక అసమానతలని చూడటం జరిగిందని వాటి మూలంగానే విప్లవోద్యమ నాయకులు కామ్రేడ్ మద్ది వెంకటరెడ్డి కామ్రేడ్ శ్రీ పద శ్రీహరిలా స్ఫూర్తితో ఉద్యమాలలో అడుగడం జరిగిందని ఆనాటి నుండి నేటి వరకు జీవితాంతం అరుణోదయ సాంస్కృతిక సమైక్యని రాష్ట్రంలో విస్తరింప చేయడానికి ప్రజా సమస్యలపై గొంతెత్తి అనేక రకాల పాటలను పాడుతూ ప్రజలను చైతన్యవంతం చేయడం జరిగిందని ఖమ్మం జిల్లా అరుణోదయ సంస్థలు తొలితరంలో కీలకపాత్ర పోషించిన ఇద్దరిలో కామ్రేడ్ నాగన్న ఒకరిని అన్నారు. ఐఎఫ్టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ కామ్రేడ్ నాగన్న జీవితం అనే సాగిందని అయినా ఎక్కడ కూడా నిరాశ నిస్పలకి గురికాకుండా అమరుల త్యాగాలని నెమరు వేసుకుంటూ ముందుకు సాగటం జరిగింది అన్నారుఇంకా ఈ సభలో ప్రముఖ అడ్వకేట్ తీగల జీవన్ ఐఎఫ్టియు జిల్లా నాయకులు అప్పారావు సిపిఐ ఎంఎల్ మాస్టన్ జిల్లా నాయకులు నర్సింగరావు సిపిఐ ఎంఎల్ నాయకులు ఐలయ్య ఈ నీది ఏం పెట్టాలి ప్రముఖ సీనియర్ జర్నలిస్ట్ సంగోజు రవి రాష్ట్ర పూర్వ నాయకులు సంజీవ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు బండి కోటేశ్వరరావు రాచర్ల బాలరాజు గట్టి కృష్ణ జక్కుల తిరుపతి అరుణోదయ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఇట్టబోయిన రవి గుర్రం అజయ్ లు తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రజా సంఘాల నాయకులు బండి కుమార్ కానుగుల రంజిత్ హరిబాబు బండి వెంకటేశ్వర్లు వీరన్న భీమ గాని మల్లయ్య ఎర్ర ఐలయ్య జయ బాబు వసంత అక్క ప్రభాకర్ చేరాలు తదితరులు పాల్గొన్నారు.



### 'ఎస్ఐఆర్' ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా

**కుబీర్, జులై 09, (జనంసాక్షి):** కుబీర్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో సాగుతున్న ప్రత్యేక ఓటరు సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో బీఎల్ఓలు నిర్వహిస్తున్న విధులను, రికార్డులను నిశితంగా పరిశీలించారు. ఎస్ఐఆర్ ఫారాలు నింపడంలో స్థానిక ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన సహాయ సహకారాలు అందించాలని ఈ సందర్భంగా బీఎల్ఓలకు, సిబ్బందికి కలెక్టర్ స్పష్టమైన సూచనలు చేశారు. అనంతరం, మండలంలో ఇప్పటివరకు పూర్తయిన ఓటర్ల వివరాల డిజిటలైజేషన్ ప్రక్రియపై స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇందుకు సంబంధించిన మొబైల్ యాప్‌ను స్వయంగా పరిశీలించి, డేటా ఎంట్రీ వేగాన్ని అంచనా వేశారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా డిజిటలైజేషన్ ప్రక్రియ మొత్తాన్ని వంద శాతం పూర్తి చేయాలని, విధుల్లో ఎక్కడా అలసత్వం వహించకూడదని అధికారులను గట్టిగా ఆదేశించారు.

### రూ. 1,00,116 విరాళం

**హనుమకొండ (జనంసాక్షి) :** హనుమకొండ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ అభివృద్ధికి, అక్కడ చికిత్స పొందుతున్న తలసేమియా బాధితుల వైద్య సేవల నిమిత్తం హనుమకొండ డిసిసి అధ్యక్షులు, వరంగల్ కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి తమ ఉదారతను చాటుకున్నారు. ఇనగాల ఛారిటబుల్ ట్రస్ట్ తరపున రూ. 1,00,116/- విరాళంగా అందజేశారు. హనుమకొండ జిల్లా పర్యటనలో భాగంగా తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా , రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ,హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ పరిధిలోని బ్లడ్ బ్యాంక్, తలసేమియా కేంద్రాన్ని సందర్శించారు. ఇనుగాల వెంకట్రా మ్ రెడ్డి.. గవర్నర్, మంత్రి సమక్షంలో విరాళానికి సంబంధించిన చెక్కును రెడ్ క్రాస్ ప్రతినిధులకు బహూకరించారు. ఈ కార్యక్ర మంలో జిల్లా కలెక్టర్, ఇతర ఉన్నతాధి కారులు, రెడ్ క్రాస్సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు




## కార్యాచరణ ప్రణాళికతో గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి

- జిల్లా కలెక్టర్ దీపక్ కుమార్



**రామకృష్ణా పూర్, జూలై 09(జనంసాక్షి):** గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధికి సర్పంచ్‌లు స్థానిక అవసరాలను గుర్తించి కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. క్యాతనపల్లి పరిధిలోని అమ్మ గార్డెన్స్‌లో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో మురుగునీటి వ్యవస్థలు, తాగునీరు, కమ్యూనిటీ హాళ్లు, సౌర వీధి దీపాలు వంటి మౌలిక వసతుల అభివృద్ధికి అందుబాటులో ఉన్న నిధులను సమర్థంగా వినియోగించాలని తెలిపారు. వీధి కుక్కల సమస్య పరిష్కారానికి జంతు పునరుత్పత్తి నియంత్రణ కేంద్రాల ఏర్పాటు, యాంటీ రేబిస్ టీకాల వినియోగంపై దృష్టి పెట్టాలని సూచించారు. గ్రామ పంచాయతీ నిధులను ప్రజా ప్రయోజనాలకే వినియోగించాలని, నిధుల దుర్వినియోగం జరిగితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ పథకాల అమలులో సర్పంచ్‌లు చొరవ తీసుకుని గ్రామాల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. చంద్రయ్యతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మొలకెత్తని సోయా.. రోడ్డెక్కిన రైతన్న!

- తేజస్వి విత్తనాలపై ఆగ్రహం.. కలెక్టర్‌ను అడ్డుకుని న్యాయం కోరిన బాధితులు
- నష్టపోయిన రైతులకు ప్రత్యామ్నాయ సాయం చేయాలని అధికారులకు కలెక్టర్ ఆదేశం



**కుభీర్, జులై 09, (జనంసాక్షి):** నిర్మల్ జిల్లా కుబీర్ మండలంలో తేజస్వి కంపెనీకి చెందిన సోయా విత్తనాలు మొలకెత్తకపోవడంతో తీవ్రంగా నష్టపోయిన రైతులు గురువారం కుభీర్ మండల కేంద్రంలో ఆందోళనకు దిగారు. "మాకు న్యాయం చేయాలి.. నష్టాన్ని భర్తీ చేయాలి" అంటూ వివేకానంద చౌరస్తాలో రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టారు. ఈ ఆందోళనతో రోడ్డుకు ఇరువైపుల వాహనాలు నిలిచిపోవడంతో కొంతసేపు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇటీవల కొనుగోలు చేసిన తేజస్వి కంపెనీ సోయా విత్తనాలు పెద్దఎత్తున మొలకెత్తకపోవడంతో సాగుపై పెట్టుకున్న ఆశలు ఆవిరయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి విత్తనాలు కొనుగోలు చేసిన తమ పరిస్థితిని ఎవరు పట్టించుకోవడం లేదని, కంపెనీ నిర్లక్ష్యం కారణంగా భారీ నష్టం వాటిల్లిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్యాగులు ఇస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో బ్యాగులు తమకు అవసరంలేదని వాతావరణ పరిస్థితులు సరిగా లేవని నష్టపరిహారం అందించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమయంలో కుబీర్ మేజర్ గ్రామపంచాయతీలో జరుగుతున్న సర్ కార్యక్రమాన్ని పరిశీలించి తిరిగి వెళ్తున్న జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా వాహనాన్ని రైతులు అడ్డుకుని తమ సమస్యను వివరించారు. రైతుల గోడును ఓపికగా విన్న కలెక్టర్ సంబంధిత వ్యవసాయ అధికారులతో మాట్లాడి వెంటనే రైతులకు న్యాయం చేయాలని ఆదేశించారు. నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా, అవసరమైన మేరకు బాధిత రైతులకు ప్రత్యామ్నాయంగా సోయా విత్తనాల బ్యాగులు లేదా ఇతర వ్యవసాయ అవసరాలకు ఉపయోగపడే ఎరువులు అందించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

## వివరాలు పక్కాగా నమోదు చేయాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట ప్రతినిధి, జూలై 9 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గురువారం సూర్యాపేట పట్టణంలోని 40వ వార్డులో కలెక్టర్ ఆకస్మికంగా పర్యటించి, సర్వే జరుగుతున్న తీరును తనిఖీ చేశారు.వార్డులోని ఇళ్లకు వెళ్లి ఎన్యుమరేటర్లు వివరాలు సేకరిస్తున్న విధానాన్ని దగ్గరుండి గమనించారు.ఒక ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడిన ఆయన, వారికి ఎన్యుమరేషన్ ఫామ్‌ను స్వయంగా అందజేశారు.సర్వేలో భాగంగా అడిగే ప్రశ్నలకు ప్రజలందరూ సహకరించి, సరైన సమాచారం అందించాలని కోరారు.సర్వేలో ఎలాంటి పొరపాట్లు జరగకూడదని ఎన్యుమరేటర్లను, సూపర్వైజర్లను ఆదేశించారు.ప్రతి ఇంటిని క్షుణ్ణంగా సర్వే చేయాలని,ఏ ఒక్క ఇల్లు కూడా మిస్ కావద్దని సూచించారు.డేటా ఎంట్రీలో తప్పులు దొర్లకుండా జాగ్రత్త వహించాలని స్పష్టం చేశారు.షెడ్యూల్ ప్రకారం నిర్దేశించిన సమయంలోగా సర్వే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమాలు ఆర్డీవో వేణుమాధవరావు, డిప్యూటీ తహసీల్దార్ లాలు, బిఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.



# రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**చింతకాని, జూలై 9 (జనం సాక్షి) :** రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాధపురంలో నిర్వహించిన మెగా రైతు మేళాలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతులకు విత్తనం నుంచి పంట కొనుగోలు వరకు ప్రతి దశలో ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కేవలం తొమ్మిది రోజుల్లో రూ.9 వేల కోట్ల రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసిన ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. ధాన్యం, మొక్కజొన్న తదితర పంటలను మద్దతు ధరకు కొనుగోలు చేసి రైతులకు అండగా నిలిచామని, వ్యవసాయ ఆధునికీకరణకు ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తోందన్నారు. ఖమ్మం నుంచి ఆదిలాబాద్ వరకు ఆయిల్‌పామ్ సాగును విస్తరిస్తున్నామని, రైతులు తక్కువ నీటితో అధిక ఆదాయం వచ్చే ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. జూలై 10న నిర్వహించనున్న రైతు ఆశీర్వాద సభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు రాష్ట్ర మంత్రివర్గం మొత్తం హాజరవుతుందని తెలిపారు. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రతిపక్షాలు విమర్శిస్తున్నా ప్రజలు వాటిని నమ్మరని అన్నారు. వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికతను రైతులకు చేరువ చేసేందుకు మెగా రైతు మేళా నిర్వహిస్తున్నామని చెప్పారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణ చరిత్రలోనే అతిపెద్ద రైతు ఆశీర్వాద సభను చింతకాని మండలంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో పండే, అధిక ఆదాయం ఇచ్చే పంటలను రైతులు సాగు చేయాలని సూచించారు. వైరా ప్రాజెక్టుకు గోదావరి జలాలను అందించేందుకు చర్యలు చేపట్టామని, మొక్కజొన్నతో పాటు ఇతర పంటలను కూడా మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నట్లు వెల్లడించారు. వ్యవసాయ శాఖ సంచాలకులు గోపి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న వ్యవసాయ, అనుబంధ రంగాల పథకాలను రైతులకు వివరించేందుకు మెగా రైతు మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పంట మార్పిడి, ప్రత్యామ్నాయ పంటలు, ఆధునిక సాగు విధానాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ మాట్లాడుతూ మెగా రైతు మేళా కోసం 150 స్టాల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఐదు వేల మంది రైతులు వస్తారని అంచనా వేయగా సుమారు 11 వేల మంది రైతులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారని పేర్కొన్నారు. ఆధునిక వ్యవసాయ యంత్రాలు, సాంకేతిక పరికరాల ప్రదర్శనతో పాటు శాస్త్రవేత్తలు రైతులకు ప్రత్యక్షంగా సూచనలు అందించారని తెలిపారు. వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ జూలై 10న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొనే రైతు ఆశీర్వాద సభకు లక్షలాది మంది రైతులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, శాస్త్రవేత్తలు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.



# బీబీనగర్ ఎయిమ్స్‌ను 2026 డిసెంబర్ నాటికి పూర్తి చేస్తాం

- ఎయిమ్స్ ఒక అంతర్జాతీయ స్థాయి పరిశోధన సంస్థ
- దేశంలోని ఎయిమ్స్ లలో మొట్టమొదటి
- కమ్యూనిటీ రేడియో స్టేషన్ బీబీనగర్ ఎయిమ్స్ లోనే
- కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా



**యాదాద్రి కరస్పాండెంట్, జూలై 9 (జనం సాక్షి) :** బీబీనగర్ ఎయిమ్స్ ను 2026 డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామని కేంద్ర ఆరోగ్య, కుటుంబ, సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా అన్నారు. గురువారం బీబీనగర్ లోని ఎయిమ్స్ ను కేంద్ర మంత్రి జేపీ నడ్డా, ఎయిమ్స్ డైరెక్టర్ అమిత్ అగర్వాల్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎంపీ లక్ష్మణ్, బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు తో కలిసి సందర్శించి అభివృద్ధి పనులను పరిశీలించి అనంతరం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోడీ నాయకత్వంలో గత దశాబ్ద కాలంలో దేశంలో ఆరోగ్య సంరక్షణ సేవలు మౌలిక వసతుల రంగంలో సుదీర్ఘమైన ముందడుగు పడిందని అన్నారు. ప్రధాని మోదీ విజన్ కు అనుగుణంగా రాబోయే రోజులలో బీబీనగర్ లోని ఎయిమ్స్ దక్షిణ భారత దేశంలోనే అత్యుత్తమ అగ్రగామి వైద్య సంస్థగా మారుతుందని అన్నారు. ఎయిమ్స్ కోసం వెయ్యి కోట్లు మంజూరు కాగా 110 కోట్లు ఖర్చు చేయడం జరిగిందని 132 మంది ఫ్యాకల్టీ సభ్యులు, 133 మంది సీనియర్ వైద్యులు సేవలందిస్తున్నారని అన్నారు. ఇప్పటి వరకు 87 శాతం పనులు పూర్తయ్యాయని ఢిల్లీ ఎయిమ్స్ పూర్తి కావడానికి 20 ఏళ్లు సమయం పట్టగా బీబీనగర్ ఎయిమ్స్ పూర్తికి నాలుగేళ్లు మాత్రమే పట్టిందని అన్నారు. అధునాతన వసతులతో రేడియోగ్ర,ఫీ ఓటి కాంప్లెక్స్ లు ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. దేశంలో మొట్టమొదటి కమ్యూనిటీ రేడియో స్టేషన్ బీబీనగర్ లోని ఎయిమ్స్ లోనే ఉందని ఈ సంస్థ ద్వారా ఆరు గ్రామాలను దత్తత తీసుకొని 547 ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించి 66,148 మంది గ్రామీణ రోగులకు వైద్య సంరక్షణ సేవలు అందించారని అన్నారు. ఎయిమ్స్ లో పరిశోధనలకు గాను 64 కోట్ల గ్రాంట్లు మంజూరు చేయగా 129 రీసెర్చ్ ప్రాజెక్టు పనులు జరుగుతుండగా 156 పరిశోధన పత్రాలను ప్రచురించడం జరిగిందని, రోజుకు ఓపిడి ద్వారా దాదాపు 1800 మంది వైద్య సేవలు పొందుతున్నారని అన్నారు.

## అమీన్‌పూర్ సర్కిల్‌లో పర్యటించిన జోనల్ కమిషనర్



**అమీన్పూర్, జూలై 9 (జనం సాక్షి) :** వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ అమిత్ నారాయణ అధికారులకు సూచించారు. గురువారం అమీన్పూర్ సర్కిల్ పరిధిలో ఆయన పర్యటించారు. అమీన్పూర్ సర్కిల్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు. రహదారులపై గుంతలు లేకుండా మరమ్మతులు చేపట్టాలన్నారు. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా ఉండేలా చూడాలన్నారు. వరదల వల్ల ప్రజలు ఇబ్బందులు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయనతోపాటు అమీన్పూర్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయాలి

- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



**ఎర్రుపాలెం, జూలై 9 (జనంసాక్షి) :** రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కార్యకర్తలకు పిలుపునిచ్చారు.ఎర్రుపాలెం లో గురువారం, కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల10 వ తేదీన చింతకానిలో జరగనున్న రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని కోరారు. అలాగే ఎరుపాలెం మండలం నుండి పదివేల రెండు వందల మంది కార్యకర్తలు తగ్గకుండా క్లస్టర్ ఇంచార్జిలు గ్రామ నాయకులు ప్రజలను తరలించాలని మధిర ఎమ్మెల్యే డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బండారు నరసింహారావు, సీనియర్ నాయకులు,ఐలూరి.వెంకటేశ్వర్ రెడ్డి,శీలంప్రతాపరెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వేజెండ్ల,సాయికుమార్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు వేమిరెడ్డి.సుధాకర్ రెడ్డి, ఎర్రుపాలెం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు,బొగ్గుల.శ్రీనివాస్ రెడ్డి, బొగ్గుల.గోవర్ధన్, రెడ్డి, అనుమోలు. కృష్ణారావు, తలపురెడ్డి.నాగిరెడ్డి, శీలం శ్రీనివాస్ రెడ్డి, కడియం శ్రీనివాసరావు మల్లెల.లక్ష్మణరావు, కర్నాటి, సుధాకర్ రెడ్డి, కర్నాటి శ్రీనివాస్ రెడ్డి కృష్ణారెడ్డి వెంకటరామిరెడ్డి పిచ్చిరెడ్డి,వెుుగిలి.అప్పారావు,సర్పంచులు,వేమిరెడ్డి,అన్నపూర్ణ,నండ్రుం.అశ్విని, ముక్కర.రామకృష్ణారెడ్డి, గుర్రాల,పుల్లారెడ్డి, దేవరకొండ.శీను, దేవరకొండ.రాజీవ్ గాంధీ, గుడేటి.బాబు, దేవరకొండ.అనిల్ కుమార్, సుధాకర్, బాలరాజు, దేవరకొండ.రవి, పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భూముల రీ సర్వే

- రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్

**యాదాద్రి కరస్పాండెంట్, జూలై 9 (జనం సాక్షి) :** అత్యంత పారదర్శకంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భూముల రీ సర్వేను నిర్వహించి ప్రతి భూమికి స్పష్టమైన యాజమాన్య హక్కులు కల్పించాలని రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. భూముల రీ సర్వే, నక్ష భూముల అంశాలపై రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు గురువారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భూముల రీ సర్వేను దశలవారీగా చేపడుతోందని తెలిపారు. తొలి దశలో ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో రీ సర్వే నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సర్వేతో ప్రతి సర్వే నంబర్‌కు స్పష్టమైన యాజమాన్య హక్కులు నిర్ధారించడంతో పాటు ప్రతి భూమికి ప్రత్యేక భూధార్ యూనిక్ నంబర్ కేటాయించనున్నట్లు తెలిపారు. డీజీపీఎస్ రోవర్స్, జీఐఎస్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి రీ సర్వే చేపట్టాలని ఆదేశించారు. రీ సర్వే జరుగుతున్న ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించి ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని, ఆయా గ్రామసభల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, మంత్రులను భాగస్వాములను చేయాలని సూచించారు. రీ సర్వే పూర్తయ్యే వరకు రెగ్యులర్ సర్వేయర్లలో 25 శాతం మందిని రొటేషన్ పద్ధతిలో విధుల్లో వినియోగించాలని తెలిపారు. లైసెన్స్‌డ్ సర్వేయర్ల పనితీరును శాఖ సర్వేయర్లు నిరంతరం పర్యవేక్షించాలని, డిప్యూటీ తహసీల్దార్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో రీ సర్వే పనులను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని ఆదేశించారు. రీ సర్వేలో పాల్గొనే లైసెన్స్‌డ్ సర్వేయర్లకు ప్రభుత్వం గౌరవ వేతనం అందజేస్తుందని తెలిపారు. భూ భారతి దరఖాస్తుల పరిష్కారంలో అసాధారణ జాప్యం పై ఉన్నత న్యాయస్థానం తీవ్ర వ్యాఖ్యలు చేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ, సాధారణ విధులు నిర్వహించడానికి కోర్టు ఆదేశాలు అవసరమా అని హైకోర్టు ప్రశ్నించిందని



తెలిపారు. ప్రస్తుతం ప్రతి అధికారి వద్ద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై హైకోర్టు వివరణ కోరుతోందని, స్పందించేందుకు నాలుగు వారాల గడువు లభించిందన్నారు. రెవెన్యూ కార్యాలయంలోనూ భూ భారతి దరఖాస్తులు 60 రోజులకు మించి పెండింగ్‌లో ఉండకూడదని, పెండింగ్ దరఖాస్తులను అత్యంత త్వరగా పరిష్కరించాలన్నారు. ఈ వీసీలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, జిల్లా సర్వే ల్యాండ్ రికార్డు అధికారి సుజాత,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## గ్రామాలను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యం

**నారాయణఖేడ్, జూలై 9 (జనం సాక్షి) :** గ్రామాల అభివృద్ధి చేయడం ప్రభుత్వ లక్ష్యమని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. ఎమ్మెల్యే పట్లోళ్ల డాక్టర్ సంజీవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ నగేష్ కుమార్ శెట్కర్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి, పిసిసి సభ్యులు శ్రీనివాస్ , జిల్లా కాంగ్రెస్ నాయకులకు పట్లోళ్ల సుధాకర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తహేర్ అలీ, సర్పంచ్ అనిల్ మంత్రి దామోదర్ రాజనర్సింహ కు గురువారం బాణాపూర్ గ్రామంలో ఘన



స్వాగతం పలికారు. బాణాపూర్ గ్రామంలో జాతీయ ఉపాధి పథకం ద్వారా రూ. 20 లక్షలతో నూతనంగా నిర్మించిన సిసి రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మారుమూల గ్రామాలకు అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఉపాదా మీ నిధులను సద్వినియోగం చేసుకుంటూ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రధాని తన ఇస్తున్నమని తెలిపారు. నారాయణఖేడ్ నియోజకవర్గం అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాల కట్టుబడి ఉందంటూ, రాబోయే రోజుల్లో మరిన్ని నిధులతో ప్రతి గ్రామానికి రోడ్డు వేస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో ప్రతి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడం కోసం కృషి చేస్తున్నారన్నారు. దశలవారీగా గ్రామంలో పనులు జరుగుతాయని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నారాయణఖేడ్ నియోజకవర్గాన్ని మాడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. బాణాపూర్ సిసి రోడ్డు గ్రామస్తులకు సుదీర్ఘకాలపు రవాణా ఇబ్బందులు తొలగిపోతాయని హర్షం వ్యక్తం చేశారు. ప్రతి గ్రామానికి అంతర్గత రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ నిర్మించేందుకు నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

## విధుల్లో ఉన్న పోలీసులపై దాడి

**సికింద్రాబాద్, జూలై 9 (జనం సాక్షి) :** మద్యం మత్తులో ఉన్న యువకులు విధులు నిర్వహిస్తున్న పోలీసులపై దాడి చేసిన ఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈ ఘటనలో పోలీసులు నలుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించారు. ఓయూ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..... ఈ నెల 5వ తేదీ తెల్లవారుజామున సీతాఫల్‌మండి మసీదు సమీపంలో ఏడి డ్రిల్ ముగించుకుని హెడ్ కానిస్టేబుల్ వి. కృష్ణ, ఏఎస్ఐ వెంకట్ కుమార్, ఎస్పీఓ పి. మోహన్‌రెడ్డి ఇఫ్లూ టీ–జంక్షన్ వైపు పెట్రోలింగ్ నిర్వహిస్తూ వెళ్తున్నారు. ఈ క్రమంలో ఓయూ మోడల్ హైస్కూల్ సమీపంలో అనుమానాస్పదంగా నిలిపి ఉన్న కారును గుర్తించారు. కారు వద్ద నలుగురు యువకులు మద్యం సేవిస్తున్నారు. కారులో ఇలా రోడ్డుపై మద్యం సేవించడం ఏంటని వారిని ప్రశ్నించారు. దీంతో వారు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఈ ఘటనను పోలీస్ అధికారిక ట్యాబ్‌లో రికార్డు చేస్తున్న సమయంలో ఓ వ్యక్తి ట్యాబ్‌ను లాక్కొని నేలకేసి కొట్టి ధ్వంసం చేశాడు. అనంతరం హెడ్ కానిస్టేబుల్ కృష్ణపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. అడ్డుకునేందుకు వచ్చిన ఏఎస్ఐ వెంకట్ కుమార్‌పై కూడా కారుతో ఢీకొట్టే ప్రయత్నం చేసి, ముగ్గురు కారులో పరారయ్యారు. మరో వ్యక్తిని ఎస్పీఓ మోహన్‌రెడ్డి అదుపులోకి తీసుకున్నాడు. పట్టుబడిన వ్యక్తిని యు. సాయికిరణ్ (26)గా గుర్తించగా, పరారైన విశాల్, ఓ. సాయికృష్ణ, ఓ. శ్రీకర్ లను గురువారం పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్ కు తరలించారు. గాయపడిన హెడ్ కానిస్టేబుల్‌కు గాంధీ ఆస్పత్రిలో చికిత్స అందించారు. హెడ్ కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నం. 329/2026 కింద విధుల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగిపై దాడి, ప్రభుత్వ ఆస్తి ధ్వంసం, నిర్లక్ష్యంగా వాహనం నడపడం, మద్యం మత్తులో డ్రైవింగ్ తదితర నేరాల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# గ్రామ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టాలి

- కలెక్టర్ బి. చంద్రశేఖర్

**నల్లగొండ ప్రతినిధి, జూలై 9 (జనం సాక్షి) :** గ్రామాభివృద్ధిలో భాగంగా గ్రామాలకు నిజంగా అవసరమైన పనులకే ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.ఉదయాదిత్య భవన్‌లో గ్రామపంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక పై గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న అవగాహన, శిక్షణ కార్యక్రమంలో గురువారం కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికసిత్ భారత్ జీ రామ్ జీ పథకం కింద గ్రామాల్లో కమ్యూనిటీ హాళ్లు, గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు, వెటర్నరీ భవనాలు, లైబ్రరీలు, పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, సైన్స్ ల్యాబ్‌లు, క్రీడా మైదానాలు, సోలార్ లైట్లు, రీసైక్లింగ్ ప్లాంట్లు, గ్రామీణ బస్టాండ్లు వంటి శాశ్వత ఆస్తుల నిర్మాణానికి అవకాశం ఉందన్నారు.ఈ పథకం కింద చేపట్టే పనులను గ్రామస్థులతో చర్చించి, ఐదు నెలల్లో పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతులు, వ్యవసాయ కూలీలు, ఉపాధి లేని వారికి ఈ పథకం ద్వారా పని కల్పించవచ్చన్నారు.చెరువులు, కుంటల్లో పూడికతీత, నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఫీల్డ్ అసిస్టెంట్లు లేని చోట పంచాయతీ కార్యదర్శులే బాధ్యతలు చేపట్టాలని ఆదేశించారు. గత ఏడాది ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ కింద జిల్లాకు రూ.35 కోట్లు మంజూరయ్యాయని, గ్రామాలకు ఉపయోగపడే శాశ్వత ఆస్తుల సృష్టిపై దృష్టి పెట్టాలన్నారు.విద్యుత్ వినియోగాన్ని తగ్గించి సోలార్ విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించాలని, గ్రామ సమృద్ధి ప్రణాళికలు, మహిళా సంఘాల అభివృద్ధి, నీటి సంరక్షణ, పారిశుద్ధ్యం, స్వచ్ఛ భారత్ టాయిలెట్ల నిర్మాణం వంటి కార్యక్రమాలను కూడా చేపట్టాలని కలెక్టర్ సూచించారు. అనంతరం సర్పంచులు అడిగిన పలు సందేహాలకు సమాధానాలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ శేఖర్ రెడ్డి వికసిత్ భారత్ జీ రామ్ జీ పథకం,గ్రామ సమృద్ధి ప్రణాళికలు, మహిళా సంఘాలు, స్వచ్ఛ



భారత్ తదితర అంశాలపై వివరించారు. స్థానిక సంస్థల ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్, జిల్లా పరిషత్ సీఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి, డీపీఓ శంకర్ నాయక్, పంచాయతీరాజ్ ఈఈ గిరిధర్‌తో పాటు పలువురు అధికారులు,ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఉదయం, మధ్యాహ్నం విడతల్లో జిల్లాలోని వివిధ మండలాల సర్పంచులు,ఉపసర్పంచులు,ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు.




# లాభాల్లో మార్కెట్ సూచీలు

**ముంబయి:**
దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. బుధవారం నాటి ట్రేడింగ్ సెషన్‌లో భారీ నష్టాలను మూటగట్టుకున్న సూచీలు.. నేడు కోలుకున్నాయి. ముఖ్యంగా రియాలిటీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్, పీఎస్‌యూ బ్యాంక్ స్టాక్స్ రాణించడం సూచీలకు కలిసొచ్చింది. నిఫ్టీ స్మాల్‌క్యాప్, నిఫ్టీ మిడ్‌క్యాప్ షేర్లు ఒకటిన్నర శాతం మేర రాణించాయి. సెన్సెక్స్ ఉదయం 76,576.14 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,503.60) స్వల్ప లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో దాదాపు 800 పాయింట్ల లాభంతో 77,326.65 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 238.22 పాయింట్ల లాభంతో 76,741.82 వద్ద ముగిసింది. నిఫ్టీ 80.75 పాయింట్ల లాభంతో 23,962.80 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.40గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో సన్‌ఫార్మా, భారతీ ఎయిర్‌టెల్, బజాజ్



ఫిన్‌సర్వ్, ఇండిగో, ఎటర్నల్ షేర్లు రాణించాయి. ఇన్ఫోసిస్, మారుతీ సుజుకీ, ఎన్టీపీసీ, యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 78.10 డాలర్లుగా ఉండగా.. బంగారం 4104 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

## రూ.9,560 కోట్లతో సూపర్ కంప్యూటర్

బ్రిటన్ అతి పెద్ద సూపర్ కంప్యూటర్‌ను నిర్మిస్తోంది. సుమారు రూ.9,560 కోట్లతో (750 మిలియన్ పౌండ్లు) వెచ్చించి దీనిని రూపొందిస్తోంది. ఎడిన్‌బరో శివార్లలో దీని నిర్మాణం ఇప్పటికే ప్రారంభమైంది. ఇది పూర్తయితే బ్రిటన్‌లోనే అత్యంత శక్తిమంతమైన కంప్యూటర్‌గా నిలవనుంది. అంతేకాకుండా మధ్య శ్రేణి సూపర్ మార్కెట్ అంత సైజు ఉండనుంది. డాలీ గొర్రెను క్లోన్ చేసిన సంస్థకు సమీపంలోని మిడ్‌లోథియాన్ ప్రాంతంలో ఈ సూపర్ కంప్యూటర్‌ను నిర్మిస్తున్నారు. ఈ కంప్యూటర్ పూర్తయితే జర్మనీలోని జూలిక్‌లో గత ఏడాది నిర్మించిన జూపిటర్‌లా సేవలందించనుంది. ఈ కంప్యూటర్‌లో వేల ప్రాసెసర్లు ఉంటాయి. సెకనుకు బిలియన్ల లెక్కలను చేయగలదు.

## ఇక వారానికోసారే ఇన్సులిన్

### మధుమేహులకు గుడ్‌న్యూస్..

దిల్లీ: మధుమేహంతో బాధపడుతున్నవారికి ప్రముఖ ఫార్మా దిగ్గజం నోవో నోర్డిస్క్ గుడ్‌న్యూస్ చెప్పింది. రోజూ ఇన్సులిన్ ఇంజెక్షన్ తీసుకొనే బాధను తప్పిస్తూ.. 'అవిక్లీ' పేరిట వారానికోమారు తీసుకునే ఇన్సులిన్ ఇంజెక్షన్‌ను తీసుకొచ్చింది. 700 యూనిట్స్, 2,100 యూనిట్స్ ఇంజెక్షన్ పెన్ ఆప్షన్లతో దేశీయంగా విడుదల చేసింది. ఒక్కో యూనిట్ ఖరీదు రూ.3.73 ఉంటుందని నోర్డిస్క్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ విక్రాంత్ శ్రోత్రియా వెల్లడించారు. సాధారణంగా డయాబెటిస్‌తో బాధపడేవారు ప్రతిరోజూ ఇంజెక్షన్ తీసుకోవాల్సి ఉంటుందని విక్రాంత్ అన్నారు. దీంతో రోజూ, జీవితాంతం తీసుకోవాలన్న కారణంతో చాలా మంది.. పూర్తిగా ఇన్సులిన్‌ను



తీసుకోవడానికే నిరాకరిస్తుంటారని చెప్పారు. అవిక్లీ ఆ ఇబ్బందులను తొలగిస్తుందన్నారు. మధుమేహులకు వారానికోసారి తీసుకునే వెసులుబాటు లభించడంతో పాటు, ప్రస్తుతం అందుబాటులో ఉన్న బేసల్ ఇన్సులిన్ కంటే మెరుగ్గా పనిచేస్తుందని తెలిపారు. దీనివల్ల ఏడాదిలో 365 సార్లు ఇంజెక్షన్ తీసుకోవాల్సిన చోట.. 52 సార్లు తీసుకుంటే సరిపోతుందని చెప్పారు. దేశంలోని 4,500 మంది డిస్ట్రిబ్యూటర్ల ద్వారా ఈ ఇంజెక్షన్‌ను అందుబాటులోకి తెస్తున్నట్లు విక్రాంత్ వెల్లడించారు. టైప్-1, టైప్-2 డయాబెటిస్ పేషెంట్లు దీన్ని తీసుకోవచ్చున్నారు. ఇన్సులిన్ తీసుకోవడాన్ని సులభతరం చేయడం నోవో నోర్డిస్క్ ముఖ్య ఉద్దేశమని చెప్పారు. దేశంలో సుమారు 10 కోట్ల మంది మధుమమేహులు ఉన్నారని, చాలా మందిలో ఉండే సైకలాజికల్‌గా, భౌతికంగా ఉండే ఇబ్బందులను అవిక్లీ తొలగిస్తుందన్నారు. భారత్‌లో విడుదల చేయడం ద్వారా మొత్తం ఏడు దేశాల్లో ఈ ఔషధాన్ని అందుబాటులోకి తెచ్చినట్లయ్యిందని విక్రాంత్ వెల్లడించారు.

## టీసీఎస్ లాభం రూ.13,349 కోట్లు..

### పెరిగిన ఉద్యోగుల సంఖ్య

ముంబయి: ప్రముఖ ఐటీ సేవల సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో 4.61 శాతం వృద్ధితో రూ.13,349 కోట్ల నికర లాభాన్ని నమోదైనట్లు రెగ్యులేటరీ పేర్కొంది. గతేడాది ఇదే సమయంలో కంపెనీ లాభం రూ.12,760 కోట్లుగా నమోదైంది. కంపెనీ ఆదాయం రూ.70,698 కోట్ల నుంచి 14 శాతం వృద్ధితో రూ.72,275 కోట్లకు పెరిగింది. తొలి త్రైమాసికానికి గానూ ఒక్కో షేరుకు




రూ.12 చొప్పున డివిడెండ్ చెల్లించేందుకు కంపెనీ బోర్డు ఆమోదం తెలిపింది. జులై 15ను రికార్డు డేట్‌గా ప్రకటించింది. గడిచిన మూడు నెలల్లో కంపెనీలో ఉద్యోగుల సంఖ్య 9,200 పెరిగింది. టీసీఎస్‌లో మొత్తం ఉద్యోగుల సంఖ్య 5,93,798కి చేరింది. ఫలితాల నేపథ్యంలో టీసీఎస్ షేరు విలువ బీఎస్‌ఈలో 0.52 శాతం క్షీణించి రూ.2047.75కు చేరింది." భౌగోళిక రాజకీయ, స్థూల ఆర్థిక ప్రతికూలతలు ఉన్నా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో మెరుగైన వృద్ధిని సాధించాం. గడిచిన త్రైమాసికంలో ఏఐ ట్రాన్సఫర్మేషన్ కోసం ఎస్‌కేఎఫ్‌తో ప్రతిష్ఠాత్మక ఒప్పందం కుదుర్చుకున్నాం. అదే సమయంలో 9.5 బిలియన్ డాలర్ల (సుమారు రూ.90,711 కోట్లు) విలువైన బలమైన ఆర్డర్ బుక్ నమోదు చేశాం. కీలక ఆదాయ విభాగాల్లో క్లయింట్‌లను చేర్చుకుంటూ ఏఐ వ్యాపారాన్ని 2.6 బిలియన్ డాలర్ల స్థాయికి చేర్చాం. ఏఐ, ఆధునికీకరణ, సైబర్‌సెక్యూరిటీ, సావరిన్ క్లౌడ్, ప్లాట్‌ఫారమ్ సింప్లిఫికేషన్‌లో పెట్టుబడుల వల్ల ఆర్డర్లు వస్తున్నాయి" అని టీసీఎస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, మేనేజింగ్ డైరెక్టర్ కృతి వాసన్ పేర్కొన్నారు.

## నిస్సాన్ నుంచి టెక్టాన్ ఎస్‌యూవీ

### ధర రూ.10.49 లక్షల నుంచి ప్రారంభం

మిడ్ సైజ్ ఎస్‌యూవీ సెగ్మెంట్‌లో పోటీని తీవ్రతరం చేస్తూ నిస్సాన్ ఇండియా టెక్టాన్ ఎస్‌యూవీని దేశీయ మార్కెట్‌లోకి విడుదల చేసింది. దీని ధర రూ.10.49 లక్షల నుంచి (ఎక్స్‌షోరూమ్) ప్రారంభమవుతుంది. బుకింగ్‌లు ప్రారంభమయ్యాయని, జులై 20 నుంచి డెలివరీలు ప్రారంభం కానున్నాయని కంపెనీ తెలిపింది. బాలీవుడ్ నటుడు హృతిక్ రోషన్‌ను తన కొత్త బ్రాండ్ అంబాసిడర్‌గా నియమిస్తున్నట్లు కంపెనీ ఈ సందర్భంగా ప్రకటించింది. నిస్సాన్ టెక్టాన్‌లో 1.0 లీటర్ టర్బో పెట్రోల్ ఇంజిన్ ఇచ్చారు. ఇది 100 హెచ్‌పీ పవర్‌ను, 166 ఎన్ఎం పీక్ టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. 1.3 లీటర్ టర్బో పెట్రోల్ ఇంజిన్ 163 హెచ్‌పీ పవర్‌ను, 280 ఎన్ఎం టార్క్‌ను అందిస్తుంది. 6 స్పీడ్ మాన్యువల్, 7 స్పీడ్ డీసీటీ (1.3 లీటర్ టర్బో పెట్రోల్ ఇంజిన్‌కు)తో వస్తోంది. 1.0 లీటర్ ఇంజిన్ కలిగిన మోడల్ లీటరుకు 19.4 కిలోమీటర్లు, 1.3 లీటర్ ఇంజిన్ లీటరుకు 18.5 కిలోమీటర్లు మైలేజీ ఇస్తుందని కంపెనీ చెబుతోంది. ఇంటీరియర్ పరంగా చూస్తే లోపల 10.1 అంగుళాల ఇన్ఫోటైన్‌మెంట్ స్క్రీన్, 10.25 అంగుళాల డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్ ఇచ్చారు. వైర్‌లెస్ ఛార్జర్, వెంటిలేటెడ్ ఫ్రంట్ సీట్లు, డ్యూయల్ జోన్ ఏసీ కంట్రోల్, పనోరమిక్ సన్‌రూఫ్, ఎలక్ట్రానిక్ పార్కింగ్ బ్రేక్, అడాప్టివ్ క్రూయిజ్ కంట్రోల్ వంటి సదుపాయాలు ఉన్నాయి. నిస్సాన్ టెక్టాన్‌లో ఎల్‌ఈడీ హెడ్‌లైట్స్, సి- ఆకారంలో డీఆర్‌ఎల్స్ ఉన్నాయి. 18 అంగుళాల అల్లాయ్ వీల్స్ ఇచ్చారు. ఆరు మోనోటోన్, ఐదు డ్యూయల్ టోన్ సహా 11 పెయింట్ స్కీమ్ ఆప్షన్లలో లభిస్తుంది. భారత సేఫ్టీ రేటింగ్ ఏజెన్సీ అయిన బీఎన్‌క్యాప్ నుంచి ఫైవ్‌స్టార్ రేటింగ్ పొందిన ఈ కారులో ఆరు ఎయిర్‌బ్యాగులు ఉన్నాయి. ఏబీఎస్, ట్రాక్షన్ కంట్రోల్, టీపీఎంఎస్, 360 డిగ్రీ కెమెరా వంటివి ఉన్నాయి. లేన్ కీప్ అసిస్ట్, బ్లైండ్ స్పాట్ మానిటరింగ్ వంటి అడాస్ ఫీచర్లు ఉన్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న రెనో డస్టర్, టాటా సియారా, మారుతీ సుజుకీ విక్టోరిస్, టయోటా అర్బన్ క్రూయిజర్ హైరైడర్, హ్యుందాయ్ క్రెటా, కియా సెల్టోస్ వంటి మోడళ్లకు గట్టి పోటీ ఇవ్వనుంది.

## అమెరికా ఉద్యోగాలు అమెరికన్లకే దక్కాలి:జేడీ వాన్స్

**వాషింగ్టన్:** హెచ్-1బీ వీసా దుర్వినియోగాలకు పాల్పడే వారిపై అమెరికా చేపట్టిన చర్యలపై అగ్రరాజ్య ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ స్పందించారు. అమెరికా ఉద్యోగాలు అమెరికన్లకే దక్కాలని పునరుద్ఘాటించారు. వీసా మోసాలకు పాల్పడే వారిపై అమెరికా కార్మిక శాఖ ఇప్పటికే దర్యాప్తు ప్రారంభించిందని, విచారణ నిమిత్తం కొంతమందికి నోటీసులు కూడా జారీ చేసినట్లు తెలిపారు. విస్కాన్సిన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో వాన్స్ మాట్లాడుతూ.. "అత్యున్నత ప్రతిభ కలిగిన శాస్త్రవేత్తలు, వైద్యులు, సాంకేతిక నిపుణులు అమెరికాలో పనిచేసేందుకు వీలుగా హెచ్-1బీ వీసాను రూపొందించాం. కానీ, కొన్ని పెద్ద కంపెనీలు, వ్యక్తులు ఈ వీసా విధానాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. తక్కువ వేతనాలతో విదేశీ ఉద్యోగులను నియమించుకుని అమెరికా కార్మికుల ఉపాధిని దెబ్బతీస్తున్నారు. పన్ను చెల్లింపుదారుల సొమ్ము కాపాడటంతో పాటు వీసా దుర్వినియోగాన్ని అరికట్టడమే ట్రంప్ ప్రభుత్వ లక్ష్యం. వీసా దుర్వినియోగం చేసేవారిని ఇకపై ఉపేక్షించబోం. అలాంటి వారికి అమెరికాలోకి ప్రవేశం ఉండదు. వీసా వ్యవస్థలో మోసాలను అరికట్టేందుకు కార్మిక శాఖ విస్తృత స్థాయిలో దర్యాప్తు కొనసాగిస్తోంది" అని స్పష్టం చేశారు. నైపుణ్యం కలిగిన విదేశీయులను అమెరికాలో తాత్కాలికంగా నియమించుకోవడమే హెచ్-1బీ వీసా ప్రధాన ఉద్దేశం. హెచ్-1బీ ఉద్యోగులను నియమించే సంస్థలు అమెరికా కార్మిక శాఖ నుంచి అనుమతి పొందాలి. వారి నియామకం వల్ల అమెరికా ఉద్యోగుల వేతనాలు, ఉద్యోగ పరిస్థితులు దెబ్బతినబోవని ధ్రువీకరించాలి.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 1,34,500 | ₹ 1,46,730 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 2,60,000

## అమెరికా వీసా మోసాల విచారణలో కాగ్నిజెంట్ పేరు!

హెచ్1బీ వీసాలు, పీఈఆర్ఎం వర్క్ వీసాలకు సంబంధించి పలు కంపెనీల మోసాలపై అమెరికా బుధవారం దర్యాప్తు ప్రారంభించింది. భారతీయ ఐటీ సంస్థ "కాగ్నిజెంట్" కూడా విచారణ ఎదుర్కొంటున్న సంస్థల్లో ఒకటని ఫెడరల్ కార్మిక విభాగం అధికారి ఒకరు వెల్లడించారు. అమెరికా కార్మిక శాఖకు చెందిన ఇన్‌స్పెక్టర్ జనరల్ కార్యాలయం పలు సంస్థలు, కార్మిక బ్రోకర్లు మోసపూరిత వీసా దరఖాస్తులు సమర్పించినట్లు గుర్తించింది. ఆయా సంస్థలు విదేశీ కార్మికుల నుంచి బలవంతంగా లంచాలు వసూలు చేసినట్లు వెల్లడించింది.




# ట్రంప్‌తో మాట్లాడాల్సి వస్తే.. బాధపడను

## స్పష్టం చేసిన మెలోనీ

**న్యూఢిల్లీ:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ ఇటీవల బహిరంగంగానే పరస్పర విమర్శలు చేసుకుని వార్తల్లో నిలిచారు. తాజాగా వీరిద్దరూ నాటో సదస్సులో పాల్గొన్నారు. దీంతో వీరు ఎదురుపడటంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. కానీ, ఈ సదస్సులో ట్రంప్‌తో అంటీముట్టనట్లుగానే ఉన్న మెలోనీ.. ఆ తర్వాత దీనిపై స్పందించారు. ఒకవేళ ట్రంప్‌తో మాట్లాడాల్సి వచ్చినా.. అందుకు తానేమీ పశ్చాత్తాపపడబోనని పేర్కొన్నారు. "వ్యక్తిగత రాజకీయాల కంటే ఇటలీ ప్రయోజనాలనే నాకు అత్యంత ముఖ్యం. అందుకోసం పశ్చిమ దేశాల మధ్య ఐక్యతకు నేను మద్దతిస్తాను. ఈ క్రమంలోనే అమెరికాతో సత్సంబంధాలు కొనసాగించాల్సి వచ్చినా నాకు సమ్మతమే. దీనికి నేనేం బాధపడట్లేదు. ఇక, ఈ సదస్సులో అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్ వస్తుండగా.. నన్ను



కావాలనే ఎదురుగా నిలబెట్టారనే ప్రచారం జరుగుతోంది. అలాంటిదేమీ లేదు. మిగతా దేశాధి నేతల మాదిరిగానే నేను అక్కడ నిల్చున్నాను. అందులో ఎలాంటి వ్యూహం లేదు" అని మెలోనీ వివరించా రు. నాటో దేశాధినేతల గ్రూప్ ఫొటో సమయంలో ట్రంప్ ముందు నుంచి వెళ్తున్నా.. మెలోనీ ఆయన పట్టించుకోకుండా ఉన్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఇక, నేతల డిన్నర్ సమయంలోనూ వీరిద్దరూ దూరందూరంగానే ఉన్నట్లు సమాచారం. వాస్తవానికి ఇటలీ ప్రధానితో ట్రంప్ గతం లో మంచి మిత్రబంధం కొనసాగించారు. ఆయన రెం డో దఫా అధికారంలోకి వచ్చిన తర్వాత.. ఆ ప్రమాణ స్వీకారానికి హాజరైన ఏకైన ఐరోపా నేత మెలోనీనే కావడం గమనార్హం. అయితే, గత కొన్ని నెలలుగా వీరి మధ్య విభేదాలు తలెత్తాయి. ఇరాన్‌తో యుద్ధం విషయంలో మెలోనీ వైఖరిని ట్రంప్ బహిరంగంగానే విమర్శించారు. ఆ తర్వాత ఫ్రాన్స్‌లో జరిగిన జీ-7 శిఖరాగ్ర సదస్సులో వీరి మధ్య ఫొటో వివాదం చెలరేగింది. ఆ సదస్సులో తనతో ఫొటో దిగేందుకు మెలోనీ ప్రాధేయపడ్డారని, అందుకే అంగీకరించానని ట్రంప్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఆయన వ్యాఖ్యలను ఇటలీ ప్రధాని తీవ్రంగా ఖండించారు.

## ఉక్రెయిన్‌కు పేట్రియాట్ ఉత్పత్తి లైసెన్సు

అంకారా: రష్యా క్షిపణి దాడులతో ఉక్కిరిబిక్కిరవుతున్న ఉక్రెయిన్‌కు ఊరట కల్పించేలా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. క్షిపణి దాడులను అడ్డుకోగల పేట్రియాట్ గగనతల రక్షణ వ్యవస్థలను ఉత్పత్తి చేసుకునేందుకు ఆ దేశానికి లైసెన్సు ఇస్తామన్నారు. తుర్కియేలో నాటో శిఖరాగ్ర సదస్సు సందర్భంగా ట్రంప్‌తో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ బుధవారం భేటీ అయ్యారు. పేట్రియాట్‌ల తయారీకి లైసెన్సు ఇవ్వడంతో పాటు వాటిని ఎలా తయారు చేసుకోవాలో చూపిస్తామని జెలెన్‌స్కీకి ట్రంప్ చెప్పారు. తమకు పేట్రియాట్‌లను అధిక సంఖ్యలో ఇవ్వాలంటూ అమెరికాను చాన్నాళ్లు కోరిన ఉక్రెయిన్ అధ్యక్షుడు.. వాటి తయారీ లైసెన్సు కోసం ఇటీవల విజ్ఞప్తి చేసిన సంగతి గమనార్హం. జెలెన్‌స్కీతో తనకు మంచి బంధం ఏర్పడిందని ట్రంప్ తాజాగా వ్యాఖ్యానించారు.





## అమెరికా బాంబులేసిన ఖమేనీ కాంపౌండ్ దృశ్యాలు..

### షేర్ చేసిన ఇరాన్

అమెరికా-ఇరాన్ యుద్ధం ప్రారంభమైన రోజునే అప్పటి సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మృతిచెందారు. టెహ్రాన్‌లోని కాంపౌండ్‌లో ఆయనతో పాటు ఇతర కీలక నేతల లక్ష్యంగా ఆ దాడులు జరిగిన సంగతి తెలిసిందే. ఖమేనీని గురువారం సమాధి చేయనున్న నేపథ్యంలో దాడుల్లో దెబ్బతిన్న ఆ భవనం దృశ్యాలను ఇరాన్ ప్రభుత్వ మీడియా షేర్ చేసింది. 35 సెకన్ల నిడివి గల ఆ వీడియోలో.. అత్యంత దారుణంగా భవనం దెబ్బతిన్న దృశ్యాలు కన్పించాయి. వారం రోజులుగా ఖమేనీ అంతిమయాత్ర జరుగుతోంది. ఇరాన్, ఇరాక్‌లలోని వివిధ నగరాల మీదుగా ఈ అంతిమయాత్ర సాగింది. ఈ మార్గాల్లో భారీ సంఖ్యలో తరలివచ్చిన ప్రజలు తమ నేతకు అంతిమ వీడ్కోలు పలికారు. ఖమేనీ పార్థివ దేహాన్ని ఇరాన్‌లోని ఆయన సొంత పట్టణమైన మషహద్‌లో గురువారం ఖననం చేయనున్నారు. ఈ క్రమంలో ఈ పట్టణానికి చేరుకోవడానికి ఉపయోగించే రెండు వంతెనలు అమెరికా దాడుల్లో ధ్వంసమయ్యాయి. మరోవైపు దాడుల నేపథ్యంలో టెహ్రాన్-మషహద్ మధ్య రైళ్ల రాకపోకలను నిలిపివేశారు. అంత్యక్రియల కార్యక్రమానికి ఆటంకం కలిగించేందుకే యూఎస్ ఈ దాడులు చేసిందని ఐఆర్‌జీసీ ఆరోపించింది. ఇవి ఇలాగే కొనసాగితే.. తమ నుంచి వచ్చే స్పందన భీకరంగా ఉంటుందని హెచ్చరించింది.

## నిజ్జర్ హత్య కేసు?

### భారత్‌పై తప్పని తేలిన ఆరోపణలు!



వాషింగ్టన్: చాలా కాలంపాటు భారత- కెనడా దౌత్యసంబంధాల్లో అగాథం ఏర్పడటానికి కారణమైన ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యకేసులో కీలకపరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో భారత అధికారుల ప్రమేయం ఉన్నట్లుగా తెలిపే ఎలాంటి ఆధారాలు లేవని కెనడా పోలీసులు తాజాగా ప్రకటించారు. హత్య వెనుక భారత ప్రమేయం ఉందని నాటి కెనడా ప్రధాని ట్రూడో చేసిన ఆరోపణలు దీంతో తప్పని తేలాయి. మరోవైపు, గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్, అతడి అనుచరుడు గోల్డీబ్రార్‌ల ఆదేశాల మేరకే నిజ్జర్ హత్య జరిగిందని అమెరికాలో కేసు నమోదైంది. కెనడా పౌరుడైన నిజ్జర్ బ్రిటిష్ కొలంబియాలోని ఒక గురుద్వారా వద్ద 2023 జూన్ 18న హత్యకు గురైన సంగతి విదితమే. ఈ కేసులో అమెరికా, కెనడా, యూరప్ దేశాల దర్యాప్తు సంస్థలు 24 మందిని అరెస్టు చేశాయి. వారిలో 11 మంది కాలిఫోర్నియాకు చెందినవారు. వీరికి భారత్‌కు చెందిన మూడు నేర ముఠాలతో సంబంధాలున్నాయి. ఇదే దర్యాప్తు ఆధారంగా లారెన్స్ బిష్ణోయ్, గోల్డీ బ్రార్‌పై అధికారికంగా అభియోగాలు నమోదు చేశారు. బిష్ణోయ్ 2015 నుంచీ భారత జైలులో బందీగా ఉండగా అతని అనుచరుడు గోల్డీ బ్రార్ పరారీలో ఉన్నాడు.

## హరీశ్‌పై కేసీఆర్‌కు నమ్మకం లేకే..

మంత్రి ఉత్తమ్ చిట్‌చాట్ చేశారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లలో వచ్చే వేసవి వరకు రిపేర్లు పూర్తి అవుతాయని తెలిపారు. బ్యారేజీలో డ్యామేజీల మరమ్మతులు చేయడానికి తాము చిత్తశుద్ధితో పని చేస్తున్నామని స్పష్టం చేశారు. హరీశ్‌రావు తనకు మంత్రి పదవి ఇవ్వాలని అంటున్నారని.. కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి చెప్పినట్లుగా హరీశ్‌రావు తమ పార్టీలో చేరుతారా? అని ప్రశ్నించారు. హరీశ్‌రావు వ్యాఖ్యలపై సరైన సమయంలో సవివరంగా తాము సమాధానం చెబుతామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఇకపోతే ఎల్‌నినో ప్రభావంపై రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. సచివాలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన ఉన్నతస్థాయి సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా జిల్లాల వారీగా కార్యాచరణకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. రైతులు ఆందోళన చెందవద్దని అన్నారు. ప్రతి పరిస్థితినీ ప్రభుత్వం పర్యవేక్షిస్తోందన్నారు. గ్రామసభల ద్వారా ఎల్‌నినోపై చైతన్యం కల్పిస్తామన్నారు. శాస్త్రవేత్తల సూచనలతో పంటల ఎంపిక చేసుకోవాలని, ప్రతి రైతుకు సాంకేతిక సలహాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. రిజర్వాయర్ల నీటి లభ్యతపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు మంత్రి తెలిపారు. సాగునీటి వినియోగం శాస్త్రీయంగా నిర్వహిస్తామన్నారు. ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. ప్రతి జిల్లాలో నిరంతరం సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. వదంతులను నమ్మొద్దని.. అధికారుల సూచనలు పాటించాలని రైతులకు సూచించారు. ఎల్‌నినో సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ తొలి ప్రాధాన్యం అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశానికి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వర్చువల్‌గా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరయ్యారు.

## విమానం గాల్లో ఉండగా.. ఫ్లైట్ నుంచి దూకి ఇన్‌స్ట్రక్టర్ ఆత్మహత్య

టొలెడా: విమానం గాల్లో ఉండగా ఫ్లైట్ ఇన్‌స్ట్రక్టర్ అందులో నుంచి దూకి ఆత్మహ త్యకు పాల్పడ్డాడు. అతడి నుంచి ట్రైనింగ్ తీసుకుంటున్న విద్యార్థి అప్పుడు విమానంలో ఉన్నాడు. అర్జెంటీనాలోని టొలెడాలో జరిగిన ఈ అనూహ్య ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఫ్లయింగ్ ప్యారెట్ కార్డోబా ఫ్లయింగ్ స్కూల్‌లో ఫ్లైట్ ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేస్తున్న లియాండ్రో ఆండ్రెస్ (42).. ఓ విద్యార్థికి ట్రైనింగ్ ఇస్తున్న సమయంలో అకస్మాత్తుగా విమానం నుంచి దూకేశారు. గతవారం జరిగిన ఈ ఘటన గురించి పోలీసులు తాజాగా ఓ ప్రకటన విడుదల చేశారు. "ఏం చేయాలో నీకు తెలుసు. ఆ ప్రకారమే నడుచుకో" అంటూ తన హెడ్‌సెట్, సీట్‌బెల్ట్ తీస్తూ ఆ స్టూడెంట్‌కు చెప్పారు. ఇలా జరుగుతుందని ఏమాత్రం ఊహించని ఆ యువకుడు తొలుత కంగుతిన్నా.. తర్వాత విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేసి ప్రాణాలు దక్కించుకున్నాడు. ఈ ఘటనపై ఫ్లయింగ్ స్కూల్ డైరెక్టర్ ఎడ్వర్డో అల్వారెజ్



స్పందించారు. "అతడు ఇలా ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచనతో ఉన్నాడని ఏమాత్రం ఊహించలేకపోయాం. అంతకుముందు అతడు మరో విద్యార్థికి కూడా ట్రైనింగ్ ఇచ్చారు. ఈ ఘటన మమ్మల్ని షాక్‌కు గురిచేసింది. అసలు విమానం గాల్లో ఉన్నప్పుడు డోర్ తీయడం చాలా కష్టం. ఆయన ఎంతో అనుభవజ్ఞుడైన ఇన్‌స్ట్రక్టర్" అని అన్నారు. అతడి మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు.. మరణానికి దారితీసిన కారణాలపై దర్యాప్తు జరుపుతున్నారు.

# అభివృద్ధి నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే కిషన్‌రెడ్డి ఆరోపణలు

- కేటీఆర్ ఒత్తిడితోనే మునగనూరుకు వచ్చి ఆరోపణలు
- 2023లో రిజిస్ట్రేషన్ జరిగితే అప్పుడు అధికారంలో ఉన్నదెవరు?
- మునగనూరు భూముల్లో ప్రభుత్వబోర్డులు పాతించినదెవరు
- కిషన్‌రెడ్డిపై నిప్పులు చెరిగిన రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి



**ఇబ్రహీంపట్నం, జులై 9 (జనం సాక్షి) :** వరసగా తాము చేపడుతున్న అభివృద్ధి నుంచి దృష్టి మరల్చేందుకు బీఆర్ఎస్ అధిష్ఠానం ఎత్తులో భాగంగానే ఆ పార్టీ నేత కిషన్‌రెడ్డి మునగనూరుకు వచ్చి డ్రామాలు చేశారని రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి మండి పడ్డారు. మునగనూరు సర్వేనంబర్ 44లో భూములు కబ్జా చేశారంటున్న కిషన్‌రెడ్డి 2023లో అధికారంలో ఉన్నదెవరని ప్రశ్నించారు. భూముల కబ్జా విషయం తమ దృష్టికి వచ్చిన వెంటనే అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆ భూముల్లో ప్రభుత్వ బోర్డులను సైతం ఏర్పాటు చేయించారని గుర్తు చేశారు. తమ దృష్టి మొత్తం అభివృద్ధిపైనే ఉందని కిషన్‌రెడ్డి మాదిరిగా భూముల దోపిడిపై లేదన్నారు. ఫార్మాసిటీ భూముల పరిహారం, ఇబ్రహీంపట్నం బస్‌డిపో పక్కన కబ్జా, మునగనూరు, అబ్దుల్లా పూర్‌మెట్ ఇలా అనేక చోట్ల వారి భూదోపిడికి అంతేలేదన్నారు. 14ఏళ్లుగా కిషన్‌రెడ్డి నుంచి ఇక్కడి భూములను కాపాడుతూ వచ్చామని అన్నారు. అవసరమైతే పేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వాలని మాత్రమే తాము కోరుతామని చెప్పారు. కిషన్‌రెడ్డి కబ్జాలే అబ్దుల్లాపూర్‌మెట్‌లో తహసీల్దార్‌పై పెట్రోల్ దాడికి దారితీశాయన్నారు. పాలనను పక్కన బెట్టి వ్యసనాలపై దృష్టిపెట్టి వారితో చెప్పించుకునే స్థితిలో తాము లేమన్నారు. వైఎస్ హయాంలో రాష్ట్రంలోనే నంబర్ వన్ నియోజకవర్గంగా మలక్‌పేట్‌ను తీర్చిదిద్దిన ఘనత మల్‌రెడ్డి రంగారెడ్డి కే దక్కుతుందని అన్నారు. ప్రస్తుతం ఎక్కువ నిధులు పొందిన వాటిలో ఇబ్రహీంపట్నం నాల్గో స్థానంలో ఉందని చెప్పారు. కిషన్‌రెడ్డి తీరు మార్చుకోకపోతే ఇకపై తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని రాంరెడ్డి హెచ్చరించారు.

# సర్ ప్రక్రియలో ప్రతి ఓటరు అప్రమత్తంగా ఉండాలి

- తెలంగాణ రాష్ట్ర టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ ఓటు నమోదుపై ధరఖాస్తులను చులకన చూడవద్దు




**మొయినాబాద్, జూలై 9, జనంసాక్షి:** రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక ఓటరు సవరణ జాబితె సర్ ఎన్యూమరేషన్ ప్రక్రియపై అవగాహన 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువకులతో పాటు ఓటర్లు ఎంతో ప్రాధాన్యత కలిగి ఉండాలని ఆధార్ కార్డు లింకుతో రెండు ఓట్లు ఉంటే తొలగించే అవకాశం ఉంటుందని తెలంగాణ రాష్ట్ర టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ పేర్కొన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండల నక్కలపల్లి గ్రామాన్ని తెలంగాణ రాష్ట్ర టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ సందర్శించి సర్ ప్రక్రియ, ఓటరు ఎన్యూమరేషన్ ఫారాలను ఓటర్లకు అంద జేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్ ప్రక్రియను ఎట్టిపరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయవద్దు అని ప్రజలకు సూచించారు. ప్రతి ఓటరు తన ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తి వివరాలను ఎలాంటి తప్పులు, పొరపాట్లు లేకుండా సక్రమంగా పూర్తి చేసి గ్రామ పంచాయతీలోని బీఎల్ ఓలకు గడువులోపు అంద జేయాలని సూచించారు. ఓటు హక్కు భారత ప్రజా స్వామ్యానికి మూల స్థబం అని ప్రతి పౌరుడు ఓటు హక్కును పరిరక్షించు కోవడం ఎంతో అవసరమని బాధ్యతగా గుర్తించి ఈ ఓటరు సవరణలో ఓటు హక్కును నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. సర్ ప్రక్రియలో ప్రజలందరూ స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలన్నారు. నిర్లక్ష్యం వల్ల భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుందని సూచించారు. సర్ ప్రక్రియ ఓటరు సవరణ గ్రామాలలో ఎంతో పకడ్బందీగా కొనసాగుతుందని ప్రతి పౌరుడి రాజ్యాంగ బద్ధ హక్కు ఓటు అని ఆయన తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న ప్రక్రియలో ఓటు నమోదు చేసుకునేందుకు అందరు సహకరించి కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మొయినాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మానయ్య, నక్కలపల్లి సర్పంచ్ మంగళారం యాదయ్య, ఉపసర్పంచ్ నిరంజన్ గౌడ్, బిఎల్వో యాదగిరి, నాయకులు కృష్ణయ్య, ఖాజాపాషా, బానుగౌడ్, అంజయ్య, శ్రీనివాస్, శ్రీశైలం, గ్రామస్తులు పాల్గొన్నారు.

# విధుల్లో ఉన్న పోలీసులపై దాడి

## ప్రభుత్వ ట్యాబ్ ధ్వంసం, నలుగురిపై కేసు

**సికింద్రాబాద్, జులై 9 (జనం సాక్షి) :** మద్యం మత్తులో ఉన్న యువకులు విధులు నిర్వహిస్తున్న పోలీసులపై దాడి చేసిన ఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈ ఘటనలో పోలీసులు నలుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఓయూ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 5వ తేదీ తెల్లవారుజామున సీతాఫల్‌మండి మసీదు సమీపంలో ఏడి డ్రిల్ ముగించుకుని హెడ్ కానిస్టేబుల్ వి. కృష్ణ, ఏఎస్ఐ వెంకట్ కుమార్, ఎస్‌పీఓ పి. మోహన్‌రెడ్డి ఇఫ్లూ టీ-జంక్షన్ వైపు పెట్రోలింగ్ నిర్వహిస్తూ వెళ్తున్నారు. ఈ క్రమంలో ఓయూ మోడల్ హైస్కూల్ సమీపంలో అనుమానాస్పదంగా నిలిపి ఉన్న కారును గుర్తించారు. కారు వద్ద నలుగురు యువకులు మద్యం సేవిస్తున్నారు. కారులో ఇలా రోడ్డుపై మద్యం సేవించడం ఏంటని వారిని ప్రశ్నించారు. దీంతో వారు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఈ ఘటనను పోలీస్ అధికారిక ట్యాబ్‌లో రికార్డు చేస్తున్న సమయంలో ఓ వ్యక్తి ట్యాబ్‌ను లాక్కొని నేలకేసి కొట్టి ధ్వంసం చేశాడు. అనంతరం హెడ్ కానిస్టేబుల్ కృష్ణపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. అడ్డుకునేందుకు వచ్చిన ఏఎస్ఐ వెంకట్ కుమార్‌పై కూడా కారుతో ఢీకొట్టే ప్రయత్నం చేసి, ముగ్గురు కారులో పరారయ్యారు. మరో వ్యక్తిని ఎస్‌పీఓ మోహన్‌రెడ్డి అదుపులోకి తీసుకున్నాడు. పట్టుబడిన వ్యక్తిని యు. సాయికిరణ్ (26)గా గుర్తించగా, పరారైన విశాల్, ఓ. సాయికృష్ణ, ఓ. శ్రీకర్ లను గురువారం పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్ కు తరలించారు. గాయపడిన హెడ్ కానిస్టేబుల్‌కు గాంధీ ఆస్పత్రిలో చికిత్స అందించారు. హెడ్ కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నం. 329/2026 కింద విధుల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగిపై దాడి, ప్రభుత్వ ఆస్తి ధ్వంసం, నిర్లక్ష్యంగా వాహనం నడపడం, మద్యం మత్తులో డ్రైవింగ్ నేరాల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# మొబైల్‌కు దూరంగా.. సహజ మేధస్సుకు దగ్గరగా ఉండాలి

- తెలంగాణ ఉన్నత విద్యా మండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్
- అవంతి డిగ్రీ, పీజీ కళాశాల 'ప్రవిష్ట-2026' ఓరియంటేషన్ కార్యక్రమంలో పిలుపు




**హైదరాబాద్, జూలై 9 (జనం సాక్షి):** యువత మొబైల్ ఫోన్లకు బానిస కాకుండా సహజ మేధస్సు, నైపుణ్యాల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని తెలంగాణ ఉన్నత విద్యా మండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్ అన్నారు. ఈ మేరకు గురువారం బాగ్లింగంపల్లి లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అవంతి డిగ్రీ, పీజీ కళాశాల తొలి సంవత్సరం విద్యార్థులకు 'ప్రవిష్ట-2026' ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని ప్రసంగించారు. కృత్రిమ మేధస్సుపై పూర్తిగా ఆధారపడకుండా విద్యార్థులు తమ సహజ ఆలోచనా శక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు స్వయం ఉపాధి దిశగా స్టార్టప్‌లను ప్రారంభించేలా ముందడుగు వేయాలని పిలుపుని చ్చారు. విద్యా ప్రమాణాలను పెంపొందిస్తూ ఆవిష్కరణలకు ప్రాధాన్యం ఇస్తున్న అవంతి యాజమాన్యాన్ని అభినందించారు. అవంతి విద్యాసంస్థల వ్యవస్థాపక చైర్మన్, మాజీ మంత్రి ఎం. శ్రీనివాసరావు మాట్లాడుతూ సాంకేతి కతను సద్వినియోగం చేసుకుంటూ ఉద్యోగ నైపుణ్యాలను పెంపొందించు కోవాలని విద్యార్థులకు సూచించారు. జనరల్ సెక్రటరీ డా. ఎం. ప్రియాంక క్రమశిక్షణ, సమయ పాలనతో పాటు కళాశాల అందిస్తున్న ప్లేస్మెంట్ సేవలు, క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్‌లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఐసీఏఐ చైర్మన్ డి. వెంకట రాంబాబు, ఎప్సాఫ్ట్ టెక్నాలజీస్ హెచ్‌ఆర్ డైరెక్టర్ గరిమా పాండే, బ్రహ్మకుమారీస్ ఇన్‌చార్జ్ డా. బి.కె. శ్రీలత విద్యార్థులకు కెరీర్, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, ఆధ్యాత్మికత, ధ్యానం ప్రాముఖ్యతపై మార్గనిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాళ్లు విద్యా ప్రగతి నివేదికను సమర్పించగా, హెచ్‌ఆర్ డైరెక్టర్ జయప్రద విద్యార్థు లను ఉద్దేశించి స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు. అనంతరం అతిథులను ఘనంగా సత్కరించి, వందన సమర్పణతో కార్యక్రమాన్ని ముగించారు.

# వర్షాకాల సన్నద్ధతకు శాఖల సమన్వయం కీలకం

**జోనల్ కమిషనర్ కె. చంద్రకళ**

శంషాబాద్, జూలై 9 (జనంసాక్షి) వర్షాకాల సన్నద్ధతపై వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని శంషాబాద్ జోనల్ కమిషనర్ కె. చంద్రకళ సూచించారు. జీహెచ్ఎంసీ శంషాబాద్ జోన్ కార్యాలయంలో గురువారం ఆమె ఆధ్వర్యంలో నిర్వహించిన సమన్వయ సమావేశంలో నీరు నిలిచే ప్రాంతాల నివారణ, రహదారుల గుంతల మరమ్మతులు, నాలాలు, స్టార్మ్ వాటర్ డ్రెయిన్ల డీసిల్టింగ్, తాగునీటి సరఫరా, సీసీ రోడ్ల పనులు, చెరువుల సంరక్షణ తదితర అంశాలపై సమీక్షించారు. శంషాబాద్ బస్ స్టాండ్ రాళ్లగూడ రహదారి అభివృద్ధి పనుల పురోగతిని కూడా పరిశీలించారు. వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు.




# అత్తాపూర్‌లో మాదకద్రవ్యాల ముఠాపై పోలీసుల దాడి ఐదుగురు అరెస్ట్

**రాజేంద్రనగర్, జూలై 9 (జనంసాక్షి) :** నిషేధిత మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలపై అత్తాపూర్ పోలీసులు, రాజేంద్ర నగర్ ఎస్‌వోటీ బృందం ఉక్కుపాదం మోపారు. రాజేంద్రనగర్ జోన్ డీసీపీ ఎస్. శ్రీనివాస్ ఐపీఎస్ పర్యవేక్షణలో అత్తాపూర్ ఇన్స్పెక్టర్ నాగేశ్వరరావు, రాజేంద్రనగర్ ఎస్‌వోటీ బృందం సంయుక్తంగా నిర్వహించారు. అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని న్యూ జలాల్ బాబా నగర్‌లో స్క్రాప్ షాప్ సమీపంలోని ఓ గదిపై పోలీసులు నిర్వహించిన దాడిలో ఎండీఎంఏ, హైటర్-ఎమ్ మెఫెంటర్‌మైన్ సల్ఫేట్ ఇంజెక్షన్లు, ఆల్ప్రాజోలామ్ టాబ్లెట్లు వంటి నిషేధిత మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకుని ఐదుగురి నిందితులను అరెస్టు చేశారు. ఈ కేసులో ఇద్దరు ప్రధాన నిందితులు పరారీలో ఉన్నారు. నిందితుల వద్ద నుంచి 6.65 గ్రాముల ఎండిఎంఏ, 5 మెఫెంటర్‌మైన్ సల్ఫేట్ ఇంజెక్షన్లు, 5 ఆల్ప్రాజోలామ్ టాబ్లెట్ సాచెట్లు, రెండు సిరంజీలు, ఐదు మొబైల్ ఫోన్లు, రూ.16,930 నగదు, ఒక కత్తి తదితర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు బాకర్ నుంచి మాదకద్రవ్యాలు కొనుగోలు చేసి, ఇతర నిందితుల సహాయంతో వినియోగదారులకు విక్రయిస్తున్న ట్లు దర్యాప్తులో వెల్లడైంది. అరెస్టైన వారిలో కొందరిపై గతంలోనూ చోరీ, దోపిడీ, ఎన్డిపిఎస్ తదితర కేసులు నమోదై ఉన్నట్లుపోలీసులు తెలిపారు.

# తాడిచెర్ల బొగ్గు బ్లాక్ -2 సింగరేణికి అప్పగించడం చారిత్రాత్మక నిర్ణయం

- కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డికి ఘన స్వాగతం
- బిజెపి ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సంధ్యరాణి



**గోదావరిఖని, జనంసాక్షి :** తాడిచెర్ల బొగ్గు గనిని సింగరేణి సంస్థకు కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయం నేపథ్యంలో నేడు హైదరాబాద్‌లోని శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి విచ్చేసిన కేంద్ర బొగ్గు అండ్ గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డిని ఓబిసి మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు కందుల సంధ్యారాణి తట్ట చెమ్మస్ బహుకరించి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, తెలంగాణ ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన తాడిచెర్ల బొగ్గు గనిని సింగరేణికి కేటాయించడం ద్వారా కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను గౌరవించిందని అన్నారు. ఈ7 నిర్ణయం వల్ల సింగరేణి సంస్థ మరింత బలోపేతం కావడంతో పాటు వేలాది మంది కార్మికులకు ఉపాధి భద్రత, సంస్థ అభివృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడతాయని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ, కార్మికుల సంక్షేమం, దేశ ఇంధన భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ప్రత్యేక చొరవతోనే తాడిచెర్ల బొగ్గుగని సింగరేణికి కేటాయించడం సాధ్యమైందని కొనియాడారు. సింగరేణి సంస్థ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని, తెలంగాణ పారిశ్రామికాభివృద్ధి, ఆర్థిక ప్రగతిలో సింగరేణి మరింత కీలక పాత్ర పోషించేలా చర్యలు కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెరబెల్లి రఘునాథ్, ఓబిసి మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు ముకేశ్ గౌడ్, మాజీ పెద్దపల్లి బిజెపి జిల్లా అధ్యక్షులు చందుపట్ల సునీల్ రెడ్డి ,దుర్గం అశోక్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందుగుల శ్రీనివాస్, పూనమ్ చంద్ తదితరులు పాల్గొన్నారు.

# వర్షాధార పంటలు వేయండి

**నీటి ఆధారిత పంటలు తగ్గించండి : జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**

**ఎల్‌నినో ప్రభావం వలన వర్షాపాతం తగ్గే అవకాశం**



**వికారాబాద్ జిల్లా బ్యూరో జూలై 9 (జనం సాక్షి):** నీటి ఎద్దడిని తట్టుకునే, వర్షాధార పంటలను సాగు చేసుకునే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధికారులకు సూచించారు. గురువారం ఎల్ నినో ప్రభావం వల్ల వర్షాలు తక్కువ కురిసే అవకాశం ఉన్నందున పంటల సాగుపై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఐటీ శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు లు జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ, నీటిపారుదల శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు సూచనలు సలహాలు ఇచ్చారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ.... నీటి ఆధారిత పంటలు కాకుండా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకునే విధంగా అధికారులు రైతులకు తెలియజేయాలన్నారు. ఎల్ నినో ప్రభావం వల్ల అతి తక్కువ వర్షాలు కురిసే అవకాశం ఉందని, నీటి ఆధారిత పంటలు వేసినట్లయితే రైతులు నష్టపోతారు అనే విషయాన్ని వారికి స్పష్టంగా తెలియజేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. రిజర్వాయర్లలో నీటి సామర్థ్యం తక్కువగా ఉన్నందున ఆయకట్టు కింద ఉన్న పొలాల్లో వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు అంటే కందులు, మొక్కలు, చిరుధాన్యాల పంటలను వేసుకునే విధంగా రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టరేట్ నుండి జిల్లా వ్యవసాయ అధికారి కవిత, ఇరిగేషన్ డిఈ మంజుల సిబ్బంది పాల్గొన్నారు.

# నేడు రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు పిలుపు

- చందానగర్‌లో విద్యార్థి సంఘాల భారీ ర్యాలీ
- విద్యారంగ సమస్యల పరిష్కారమే లక్ష్యమని వెల్లడి
- స్కాలర్‌షిప్‌లు, ఖాళీల భర్తీ సహా పలు డిమాండ్లు
- బంద్‌కు విద్యార్థులు, ఉపాధ్యాయులు సహకరించాలని విజ్ఞప్తి




శేరిలింగంపల్లి, జూలై 9 జనంసాక్షి: రాష్ట్రంలోని విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం కెజీ నుంచి పీజీ వరకు విద్యాసంస్థల రాష్ట్రవ్యాప్త బంద్ నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఏఐఎఫ్‌డీఎస్ విద్యార్థి సంఘాలు ప్రకటించాయి. బంద్‌ను విజయవంతం చేయాలని కోరుతూ గురువారం చందానగర్‌లోని దీప్తి శ్రీనగర్ నుంచి మియాపూర్ ఆల్విన్ ఎక్స్‌రోడ్ వరకు విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకుల కొరత, మౌలిక వసతుల లేమి, హాస్టళ్లలో దయనీయ పరిస్థితులు, స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీ, మహిళా విద్యార్థుల భద్రత వంటి సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడం, ఖాళీ పోస్టుల భర్తీ, ఫీజు నియంత్రణ చట్టం అమలు, విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించడం, కాంట్రాక్ట్ అధ్యాపకుల సమస్యలు పరిష్కరించడం తదితర డిమాండ్లతో చేపడుతున్న బంద్‌కు విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ప్రజాస్వామ్యవాదులు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు.

# ఓటే ప్రజాస్వామ్యానికి పునాది

**సర్ కార్యక్రమం విజయవంతం చేయండి**

**తాండూరు ఆర్డీఓ అనిత**

**తాండూరు జులై 9(జనంసాక్షి) :** తాండూరు నియోజకవర్గం 056 ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, తాండూర్ ఆర్డీఓ ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక సమగ్ర సవరణ సర్ కార్యక్రమం నిర్వహించారు. ఓటర్ల జాబితాలో కొత్త పేర్ల నమోదు, చిరునామా మార్పులు, మరణించిన వారి పేర్ల తొలగింపు మరియు తప్పుల సవరణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ కార్యక్రమంలో భాగంగా బూత్ లెవెల్ అధికారులు ఇంటింటికి వెళ్లి వివరాలను సేకరిస్తున్నారు. అర్హులైన 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు తప్పనిసరిగా తమ పేర్లను ఓటర్ల జాబితాలో నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటే ప్రజాస్వామ్యానికి పునాది అని, ఎవరూ ఈ అవకాశాన్ని వదులుకోవద్దని పేర్కొన్నారు. సర్ కార్యక్రమానికి సంబంధించి సందేహాలు ఉంటే సంబంధిత బీఎల్ఓ లేదా ఈఆర్వో కార్యాలయాన్ని సంప్రదించాలని ఆర్డీఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు అధికారులు తదితరులు ఉన్నారు.

## విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**రుద్రంగి జూలై 9 (జనం సాక్షి)** రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలోని దసరా నాయక్ తండాలో శ్రీ జగదాంబ మేరమ్మ యాడి శ్రీ సంతు సేవలల్ మహారాజ్ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విగ్రహ ప్రతిష్ఠాపన అనంతరం ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు. తండా ప్రజలు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. అనంతరం గ్రామ పెద్దలు, నిర్వాహకులు రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ... గిరిజనుల ఆధ్యాత్మిక సంప్రదాయాలు, సంస్కృతి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. తండాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చేలుకల తిరుపతి, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, తండా ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పోలీస్ శాఖ ప్రతిష్ట పెంచే విధంగా విధులు నిర్వహించాలి

- సాంకేతిక పరిజ్ఞానాన్ని పంచుకొని రికార్డులను భద్రపరుచుకోవాలి
- చార్మినార్ జోన్ డిఐజి చౌహాన్




**వికారాబాద్ జిల్లా బ్యూరో జూలై 9 (జనం సాక్షి) :** పోలీస్ శాఖ ప్రతిష్ట పెంచే విధంగా అందరూ విధులు నిర్వహించాలని చార్మినార్ జోన్ డి ఐ జి చౌహాన్ అన్నారు. చార్మినార్ జోన్ డీఐజీ ఎల్.ఎస్. చౌహన్ వార్షిక తనిఖీలలో భాగంగా గురువారం వికారాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయాన్ని డిపిఓ సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయానికి చేరుకున్న డీఐజీ కి వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం డీఐజీ పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటిన అనంతరం ఇటీవల పునరుద్ధరించిన (రీనోవేషన్) ఎస్పీ ఛాంబర్‌ను డీఐజీ ప్రారంభించి పరిశీలించారు. తదనంతరం జిల్లా పోలీస్ కార్యాలయంలోని వివిధ విభాగాలైన డీపీఓ సెక్షన్లు, డీసీఆర్‌బీ, డీఎస్‌బీ, డీఏఆర్, పరిపాలనా శాఖలు, రికార్డు విభాగాలు, ఆయుధాగారం, సిబ్బంది నిర్వహణకు సంబంధించిన విభాగాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఆయా శాఖల్లో నిర్వహిస్తున్న రికార్డులు, కేసుల నిర్వహణ, పరిపాలనా విధానాలు, ఫైళ్ల నిర్వహణ, సేవా రికార్డులు, కార్యాలయ నిర్వహణ విధానాలను పరిశీలించి అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ, జిల్లా పోలీస్ కార్యాలయంలో అన్ని విభాగాల పనితీరును పరిశీలించడం జరిగింది. కార్యాలయంలో రికార్డుల నిర్వహణ, ఫైళ్ల భద్రపరచడం, పరిపాలనా విధానాలు సక్రమంగా ఉండటం ప్రతి పోలీసు అధికారికి ఎంతో ముఖ్యం. ప్రతి శాఖలో రిజిస్టర్లు, రికార్డులు, కేసు సంబంధిత ఫైళ్లను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగానిర్వహించాలి. కార్యాలయ నిర్వహణలో క్రమశిక్షణ, పరిశుభ్రత, సమయపాలనకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రజలకు సంబంధించిన వినతులు, ఫిర్యాదులను జాప్యం లేకుండా సంబంధిత శాఖలకు పంపించి, వాటి పరిష్కారంపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి. ప్రతి శాఖ పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, కార్యాలయ పనితీరును మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దాలి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ రికార్డుల నిర్వహణను మెరుగుపరచాలి. ప్రభుత్వ మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేస్తూ, పోలీస్ శాఖ ప్రతిష్ఠను పెంపొందించే విధంగా ప్రతి అధికారి తన బాధ్యతలను నిర్వర్తించాలి అని డిఐజి తెలియజేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రాజేశ్ మీనా, జిల్లా డిసిఆర్‌బి డిఎస్‌పి జానయ్య, వికారాబాద్ డిఎస్‌పి అంజయ్య, డిటిసి డిఎస్‌పి డిఆర్ డిఎస్‌పి వీరేశ్ అధికారులు, ఇన్స్పెక్టర్‌లు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహిళా న్యాయవాదిపై దాడి..నిందితులు ఇంకా బయటే!

- న్యాయం కోసం న్యాయవాది పోరాటం
- హైకోర్టు ఆదేశాలు ఉన్నా కదలని పోలీసులు ?



**బోడుప్పల్-జనంసాక్షి :** మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధి నారపల్లిలోని ఓ మహిళా న్యాయవాది కార్యాలయంపై జరిగిన దాడి ఘటనలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, న్యాయస్థానాలు జారీ చేసిన ఉత్తర్వులను సైతం అమలు చేయడం లేదని బాధిత న్యాయవాది మల్లుల శిరీష తీవ్ర ఆరోపణలు చేశారు. పోలీసుల సమక్షంలోనే తనపై దాడి జరిగినప్పటికీ నిందితులపై ఇప్పటి వరకు కఠిన చర్యలు తీసుకోకపోవడంతో వారు స్వేచ్ఛగా తిరుగుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. బాధితురాలి కథనం ప్రకారం స్థానిక రౌడీలతో పాటు అలేటి మోహన్ రెడ్డి,వెంకటేష్ నా రోజి, ప్రవీణ్ నారోజి, ప్రవీణ్ భార్య, తల్లి, మేఘనాథ్ తదితరులు తనపై దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. ఈ వ్యక్తులపై సీనియర్ సివిల్ జడ్జి తనకు అనుకూలంగా మధ్యంతర నిషేధాజ్ఞ (ఇంటరిమ్ ఇంజంక్షన్) జారీ చేసినప్పటికీ, పోలీసులు దానిని పట్టించుకోలేదని పేర్కొన్నారు. దాడి సమయంలో తన క్లయింట్లకు సంబంధించిన కీలకమైన కేసు ఫైళ్లు,పత్రాలు ఇతర ముఖ్యమైన మెటీరియల్‌ను నిందితులు బలవంతంగా తీసుకెళ్లారని ఆమె ఆరోపించారు. ప్రస్తుతంఆమెటీరియల్ నిందితులవద్దే ఉన్నప్పటికీ, వాటిని స్వాధీనం చేసుకునేందుకు పోలీసులు ఎలాంటి చర్యలు చేపట్టలేదని తెలిపారు. ఈ వ్యవహారంపై హైకోర్టుకూడా నిందితుల వద్ద ఉన్న మెటీరియల్‌ను తిరిగి స్వాధీనం చేసుకొని బాధితురాలికి రక్షణ కల్పించాలని సూచించినప్పటికీ స్థానిక పోలీసులు ఆ ఉత్తర్వులను సమర్థవంతంగా అమలు చేయడం లేదని ఆరోపించారు. అంతేకాక దొంగతనం అక్రమ ప్రవేశానికి సంబంధించిన తీవ్ర ఆరోపణలున్న ఘటనను పోలీసులు కేవలంసాధారణ క్రిమినల్ ఫిర్యాదుగా నమోదు చేసి కంటితుడుపు చర్యలకే పరిమితమయ్యారని విమర్శించారు. ఈ కేసులో దర్యాప్తు పక్షపాతంగా సాగుతోందని ప్రభావశీల వ్యక్తులను కాపాడే ప్రయత్నాలు జరుగుతున్నాయనేఅనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. ఒక మహిళా న్యాయవాదిపైనే కోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ న్యాయం జరగకపోతే సాధారణ ప్రజల పరిస్థితి ఏమిటని బాధితురాలుప్రశ్నించారు. న్యాయస్థానాల ఆదేశాలను వెంటనే అమలు చేసి నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తనకు తన కుటుంబానికి భద్రత కల్పించాలని ఆమె ప్రభుత్వాన్ని ఉన్నతాధికారులనుకోరారు. కొందరు సహచర న్యాయవాదులు ఆమెకు మద్దతుగా నిలిచారు.

# యుద్ధోన్మాదం ప్రపంచ మానవాళికి పెనుముప్పు

- ప్రధాని మోడీ పెద్దన్నగా వ్యవహరించాలి.
- యుద్ధం వల్ల నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతాయి
- సిపిఐ రాష్ట్ర అధ్యక్షులు చాడ వెంకటరెడ్డి




**సిరిసిల్ల టౌన్ జూలై 9 (జనం సాక్షి) :** యుద్ధం వల్ల మానవ మనుగడకే ముప్పని మాజీ ఎమ్మెల్యే, సిపిఐ రాష్ట్ర నాయకులు చాడ వెంకటరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. సిరిసిల్లలోని సిపిఐ భవన్‌లో సిపిఐ పట్టణ కార్యదర్శి పంతం రవి ఆధ్వర్యంలోఏర్పాటు చేసిన సమావేశంలో చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా అయ్యాక ప్రపంచంలో యుద్ధోన్మాదం రోజురోజుకు పెరిగిపోతుందని, అది మానవాళికి పెనుముప్పని అన్నారు. ప్రపంచ మానవాళి శాంతిని కోరుకుంటే ట్రంప్ మాత్రం యుద్ధాన్ని కోరుకుంటున్నారని,ఇరాన్ అమెరికా చేసుకున్న ఒప్పందాల్ని ట్రంప్ తుంగలో తొక్కి అక్కసుతో యుద్ధాన్ని మళ్లీ మొదలుపెట్టారని, గత రాజకీయ వ్యవస్థను ముందుకు తీసుకువచ్చి పెత్తనం చెలాయించాలన్నదే అగ్రరాజ్యం విధానమన్నారు. అమెరికాలో కమ్యూనిజం ప్రశ్నించే తత్వంతో సామాజిక పక్షపాతంగా వ్యవహరిస్తూ, తెరపైకి వస్తున్నందున ట్రంప్ కమ్యూనిజం ప్రాణాంతకమని అంటున్నారన్నారు. భారతదేశ ప్రధాని మోడీ మౌనంగా ఉండడం అనేది దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. భారతదేశం కీలకమైన దేశంగా ప్రపంచంలో ఆలీన విదేశాంగ విధానాన్ని అమలుపరిచి పెద్దన్నగా భారత్ వ్యవహరించిందని గుర్తు చేశారు. మోడీ ట్రంప్ కు భయపడిపోతున్నాడని, వాళ్ళిద్దరి మధ్య ఏం ఒప్పందం ఉందో తెలియదన్నారు. ప్రపంచ దేశాలకు భారతదేశ ప్రధాని మోడీ స్పందించి పెద్దన్నగా వ్యవహరించాలన్నారు. యుద్ధం వల్ల మానవ మనుగడకే ముప్పు ఉందని, నిత్యావసర సరుకులతో పాటు పెట్రోల్, డీజిల్, సిలిండర్ ధరలు పెరిగే అవకాశాలు ఉన్నాయని అనుమానం వ్యక్తం చేశారు. కమ్యూనిస్టు పార్టీ మొదటి నుంచి యుద్ధానికి వ్యతిరేకమన్నారు. ఆదానికి మోడీకి లోపాయికారి ఒప్పందం ఉన్నందున కేసు విత్ డ్రా చేసుకున్నారన్నారు. హిందుత్వమే ఏజెండాగా అమలుపరుస్తూ మోడీ పరిపాలన కొనసాగుతుందన్నారు. 29 కార్మిక చట్టాలను రద్దుచేసి కార్మికుల జీవితాలతో ఆడుకుంటుందని, మరోవైపు రైతులకు సంబంధించి మూడు చట్టాలను ఉపసంహరించుకున్నా రైతుల మెడపై కత్తిలా వేలాడుతుందని, ఇంకోవైపు ఎస్సీ, ఎస్టీ, బీసీ, బడుగు, బలహీన వర్గాలకు సామాజిక న్యాయం కొరవడిందన్నారు. అంబేద్కర్ రాజ్యాంగ విధానాలు అమలు కావడం లేదని పేర్కొన్నారు. సర్ పేరుతో ఇష్టారాజ్యంగా మోడీ గందరగోళం సృష్టిస్తున్నారని, ప్రజాస్వామ్య విధానాల్ని ఖూనీ చేస్తున్నారని అన్నారు. ఆర్.ఎస్.ఎస్ విధానం కూడా రాజ్యాంగ విరుద్ధంగా ఉందన్నారు. మోడీ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆగస్టు 6 నుండి 14 వరకు దేశవ్యాప్తంగా భారత కమ్యూనిస్టు పార్టీ పాదయాత్ర చేపడుతుందన్నారు. అన్ని జిల్లాల్లో ఈ పాదయాత్ర కొనసాగుతుందన్నారు. సెప్టెంబర్ 1 నాడు చలో ఢిల్లీ, రాంలీల మైదానంలో లక్షలాది మందితో భారీ బహిరంగ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. రాష్ట్రం రైతు భరోసా తో పాటు పేదలకు ఇండ్ల స్థలాలు, పక్కా ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సి.పి.ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు కడవేరి శంకర్, జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్, జిల్లా కమిటీ సభ్యులు గుంటి వేణు, మీసం లక్ష్మణ్, కదారి రాములు, సోమ నాగరాజు, మంద అనిల్, సూర రాకేష్ పాల్గొన్నారు .

# విపత్తుల సమయంలో ఎస్డీఆర్ఎఫ్ కీలకం

- ఎప్పుడైనా సేవలు అందించేందుకు సిద్ధంగా ఉండాలి
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- సర్దాపూర్ లోని 17 వ బెటాలియన్ లో ఎస్డీఆర్ఎఫ్ యంత్రాలు, పరికరాల ప్రదర్శన
- హాజరైన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్,ఎస్పీ మహేష్ బి గితే



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, జూలై 09 (జనం సాక్షి);** విపత్తుల సమయంలో స్టేట్ డిసాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎస్‌డీఆర్ఎఫ్) అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు.సిరిసిల్ల మున్సిపల్ పరిధి సర్దాపూర్ లోని 17 వ బెటాలియన్ లో స్టేట్ డిసాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎస్ డీ ఆర్ ఎఫ్) ఆధ్వర్యంలో విపత్తులు, వరదలు వచ్చే సమయంలో ఉపయోగించే యంత్రాలు, పరికరాల ప్రదర్శన గురువారం నిర్వహించగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాధితులను గుర్తించే కెమెరా, రిమోట్ కంట్రోల్ లైఫ్ బోయ్ (ప్రాణరక్షక తేలియాడే పరికరం), తనిఖీ రంధ్రం చేసే పరికరం, ఎత్తైన వెలుతురు స్తంభం (లైట్‌మాస్ట్),రక్షణ కార్యక్రమాల కోసం ఉపయోగించే రోటరీ కట్టింగ్ యంత్రం,గాలి ద్వారా బరువులను ఎత్తే లిఫ్టింగ్ బ్యాగ్, పీవీసీ రక్షణ దుస్తులు, హైడ్రాలిక్ స్ప్రెడర్ కట్టర్ (లోహాన్ని విప్పే, కత్తిరించే పరికరం) ప్రదర్శన లో పెట్టగా, జిల్లా కలెక్టర్, ఎస్పీ, అధికారులతో కలిసి పరిశీలించారు.ఒక్కో యంత్రం పనితీరు, వాటిని ఉపయోగించే విధానాన్ని వివరించారు. గత ఏడాది వరదలు వచ్చినప్పుడు కామారెడ్డి, వరంగల్ ఇతర ప్రాంతాల్లో ఎస్‌డీఆర్ఎఫ్ టీమ్ అందించిన సేవల వీడియోలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో నాలుగు రిజర్వాయర్లు ఎగువ మానేరు,మధ్య మానేరు, అన్నపూర్ణ, మల్కపేట ఉన్నాయని తెలిపారు. వర్షాకాలంతో పాటు సెప్టెంబర్,అక్టోబర్ నెలలో భారీ వరదలు వచ్చే ప్రమాదం ఉంటుందని పేర్కొన్నారు. ఎస్‌డీఆర్ఎఫ్ బృందం శిక్షణలో నేర్చుకున్న అంశాలు విపత్తులు సంభవించినప్పుడు తక్షణమే వినియోగించాల్సి వస్తుందని తెలిపారు. అప్పుడు ప్రతి నిమిషం విలువైందని స్పష్టం చేశారు. రెవెన్యూ,పోలీస్,ఫైర్, ఎస్డీఆర్ఎఫ్ అధికారులు ఒక టీమ్ గా సమాచారం చేరవేస్తూ,వరదలు వచ్చినప్పుడు సమన్వయంతో సేవలు అందించాలని ఆదేశించారు. గత ఏడాది వరదలు వచ్చినప్పుడు వివిధ జిల్లాల్లో ఉత్తమ సేవలు అందించిన ఎస్డీఆర్ఎఫ్ బృందం,ఇతర అధికారులను అభినందించారు. ఎప్పుడైనా సేవలు అందించేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపు నిచ్చారు. అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ..వర్షాలు వస్తే సేవలు అందించేందుకు ఎప్పుడైనా సిద్ధంగా ఉండాలని సూచించారు. గత ఏడాది వరదలు సంభవించి ఇబ్బంది పడిన చోట్ల అధికారులు పరిశీలించి,ఇంకా కావలసిన ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. విపత్తులు సంభవించినప్పుడు వాడే పరికరాలు,యంత్రాలతో మాక్ డ్రిల్ నిర్వహించాలని ఆదేశించారు. ఇంకా ఏమైనా యంత్రాలు,పరికరాలు కావాల్సి ఉంటే ముందస్తుగా తెప్పించాలని సూచించారు. ఉత్తమ సేవలు అందిస్తున్న అధికారులు,సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, కమాండెంట్ పీ జె.పి.సి. ఛటర్జీ, అడిషనల్ కమాండెంట్ ఎంఐ సురేష్, అసిస్టెంట్ కమాండెంట్ సురేష్,స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ వెంకటేశ్వర్లు,ఎస్డీఆర్ఎఫ్ ఆర్ఐ బండి శ్రీనివాస్, తహసీల్దార్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు రద్దుకు నిరసనగా

# జూలై 9 నుంచి 14 వరకు బంద్

### కార్మికుల సమస్యలు పరిష్కరించాలని జేఏసీ డిమాండ్

**కరీంనగర్ టౌన్, జూలై 09, ( జనం సాక్షి) :** తెలంగాణలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును రద్దు చేయడాన్ని వ్యతిరేకిస్తూ భవన నిర్మాణ వికాస్ సంక్షేమ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జూలై 9 నుంచి 14 వరకు భవన నిర్మాణ కార్మికుల బంద్ చేపట్టనున్నట్లు జేఏసీ నాయకులు ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణ పనులను నిలిపివేసి నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి సంబంధించిన పథకాలను నిలిపివేయడం వల్ల వేలాది మంది కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. గతంలో లేబర్ కార్డు ద్వారా అందించిన ప్రసూతి, వివాహ, విద్య, మరణ సహాయం వంటి సంక్షేమ పథకాలు నిలిచిపోయాయని పేర్కొన్నారు. అలాగే ప్రమాద మరణాలకు ఇచ్చే పరిహారం, సహజ మరణాలకు ఎక్స్‌గ్రేషియా, వైద్య సహాయం వంటి ప్రయోజనాలు కూడా అందడం లేదన్నారు.

లేబర్ కార్డుల నమోదు, పునరుద్ధరణ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని, గతంలో అమలులో ఉన్న సంక్షేమ పథకాలను యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. సిమెంట్, ఇనుము తదితర నిర్మాణ సామగ్రిపై విధించే సెస్సు ద్వారా కోట్ల రూపాయలు వసూలు చేస్తున్నప్పటికీ వాటిని కార్మికుల సంక్షేమానికి వినియోగించడం లేదని విమర్శించారు. కార్మికులకు ప్రమాద మరణానికి రూ.10 లక్షలు, సహజ మరణానికి రూ.5 లక్షలు, వివాహ సహాయం, ప్రసూతి సహాయం, పిల్లల విద్యకు ఆర్థిక సాయం, పెన్షన్ తదితర సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. లేబర్ కార్డు లేని ప్రతి అర్హ కార్మికుడికి వెంటనే కార్డులు జారీ చేయాలని కోరారు. జేఏసీ ఆధ్వర్యంలో జూలై 13న ఉదయం 10.30 గంటలకు కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ నిరసన కార్యక్రమాల్లో రాష్ట్రవ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జేఏసీ అధ్యక్షుడు ఏ. నారాయణ పిలుపునిచ్చారు.

# సింగరేణిలో 'మజ్దూర్' పదానికి స్వస్తి

- ఉద్యోగ హోదాల్లో 'మజ్దూర్' స్థానంలో 'అసిస్టెంట్'
- ఉత్తర్వులు జారీచేసిన సింగరేణి యాజమాన్యం

**గోదావరిఖని, జనంసాక్షి :** సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్) లో ఇకపై పలు ఉద్యోగ హోదాల్లో "మజ్దూర్" అనే పదం వినిపించదు. సింగరేణి గుర్తింపు కార్మిక సంఘమైన ఏఐటీయూసీ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ చేసిన విజ్ఞప్తిని సానుకూలంగా పరిశీలించిన సింగరేణి యాజమాన్యం, తొమ్మిది ఉద్యోగ హోదాల్లో "మజ్దూర్" స్థానంలో "అసిస్టెంట్" అనే పదాన్ని ప్రతిష్ఠిస్తూ గురువారం అధికారిక సర్క్యులర్‌ను జారీ చేసింది. కార్పొరేట్ పర్సనల్ విభాగం ఇండస్ట్రియల్ రిలేషన్స్ వింగ్ విడుదల చేసిన సర్క్యులర్ (రిఫరెన్స్ నెం. సీఆర్పీ/పిఇఆర్/ఐఆర్/సి/081/679, తేదీ: 09-07-2026) ప్రకారం, సీఎండీ స్థాయిలో గుర్తింపు పొందిన కార్మిక సంఘం ఎస్‌సీడబ్ల్యూయూతో నిర్వహించిన 38వ, 39వ పీరియాడికల్ స్ట్రక్చర్డ్ సమావేశాల్లో చేసిన ప్రతిపాదనకు సమర్థ అధికారి ఆమోదం తెలిపినట్లు పేర్కొన్నారు. దీని ప్రకారం బంకర్ చైన్ మజ్దూర్, క్లే పిల్ మజ్దూర్, ల్యాంప్ మజ్దూర్, శాంప్లింగ్ మజ్దూర్, స్టోర్స్ ఇష్యూ మజ్దూర్, సర్వే మజ్దూర్, టబ్ రిపేర్/మేకింగ్ మజ్దూర్, టబ్ రిపేరింగ్ మజ్దూర్, వ్యాగన్ లోడ్ అండ్ షంటింగ్ మజ్దూర్ హోదాలను వరుసగా బంకర్ చైన్ అసిస్టెంట్, క్లే పిల్ అసిస్టెంట్, ల్యాంప్ అసిస్టెంట్, శాంప్లింగ్ అసిస్టెంట్, స్టోర్స్ ఇష్యూ అసిస్టెంట్, సర్వే అసిస్టెంట్, టబ్ రిపేర్/మేకింగ్ అసిస్టెంట్, టబ్ రిపేరింగ్ అసిస్టెంట్, వ్యాగన్ లోడ్ అండ్ షంటింగ్ అసిస్టెంట్‌గా మార్చారు. అయితే ఈ మార్పు కేవలం ఉద్యోగ హోదా పేరుకు మాత్రమే పరిమితమని, ఉద్యోగుల విధులు, సేవా నిబంధనలు లేదా ఇతర హక్కుల్లో ఎలాంటి మార్పు ఉండదని సర్క్యులర్‌లో స్పష్టం చేశారు. ఈ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని, సంబంధిత అన్ని గనులు, విభాగాలు అవసరమైన చర్యలు చేపట్టాలని యాజమాన్యం ఆదేశించింది. ఇప్పటికే సంస్థలో అధిక సంఖ్యలో ఉన్న జనరల్ మజ్దూర్ల హోదాను "జనరల్ అసిస్టెంట్"గా మార్చిన నిర్ణయాన్ని అమలు చేసిన సింగరేణి యాజమాన్యం, ఇప్పుడు మరో తొమ్మిది డిజిగ్నేషన్లలోనూ అదే విధానాన్ని అమలు చేసింది. ఉద్యోగుల ఆత్మగౌరవాన్ని పెంపొందించేందుకు, వారి హోదాలకు మరింత గౌరవప్రదమైన గుర్తింపు కల్పించేందుకు తీసుకున్న ఈ నిర్ణయం ఉద్యోగుల సంక్షేమం, గౌరవానికి యాజమాన్యం ఇస్తున్న ప్రాధాన్యతకు నిదర్శనంగా అధికార వర్గాలు పేర్కొన్నాయి.

## బిఎల్ఓలను సహకరించాలి

### మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్

**మోమిన్ పేట జూలై 9 (జనం సాక్షి) :** ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఇంటింటికి వెళ్లి విధులు నిర్వహిస్తున్న బిఎల్ఓ, బిఎల్ఏలను ప్రజలు సహకారం అందించాలని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ పేర్కొన్నారు గురువారం మోమిన్‌పేట మండలం ఎన్కతల మొరంగపల్లి, వెల్చాల్ గ్రామాలలో ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ఫారాలు నింపే విధానాన్ని పరిశీలించారు 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు వికారాబాద్ నియోజకవర్గంలో ఏ ఒక్క ఓటు ప్రవహించకుండా రాజకీయాల కతీతంగా అందరూ సహకారం అందించి ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని ఆయన సూచించారు.

# గ్రామసభలతో రీ-సర్వేకు వేగం

### భూ వివాదాలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం

- ఉప్పుమడుగులో అవగాహన గ్రామసభలో పాల్గొన్న అదనపు కలెక్టర్ బి.ఎస్. లత
- భూ రీ-సర్వే ప్రక్రియపై రైతులు, గ్రామస్థులకు వివరాలు
- అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ.. పిల్లల హాజరు, పోషకాహారంపై ఆదేశాలు

**రాయికల్, జూలై 9 జనంసాక్షి :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూ రీ-సర్వే కార్యక్రమాన్ని గ్రామసభల ద్వారా మరింత వేగవంతం చేసి, భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేలా అధికారులు కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్. లత సూచించారు. గురువారం రాయికల్ మండలంలోని ఉప్పుమడుగు గ్రామంలో కొనసాగుతున్న భూ రీ-సర్వే పనులను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన గ్రామసభలో పాల్గొని రీ-సర్వే ప్రక్రియపై రైతులు, గ్రామస్థులకు అవగాహన కల్పించారు. భూ రీ-సర్వే చట్టబద్ధమైన విధానాల ప్రకారం పారదర్శకంగా నిర్వహిస్తున్నామని, సర్వే నిర్వహణ విధానం, భూముల సరిహద్దుల నిర్ధారణ, రికార్డుల నవీకరణ తదితర అంశాలను గ్రామస్థులకు అధికారులు వివరించారు.

అనంతరం ఉప్పుమడుగు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. పిల్లల హాజరు నమోదు, పోషకాహార పంపిణీ, కేంద్రంలోని పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించి, చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించడంతో పాటు హాజరు శాతం పెరిగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి ఆదేశించారు. కేంద్రంలో అందిస్తున్న సేవలు ప్రభుత్వ ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, భూమి కొలతల సహాయ సంచాలకుడు (ఏడీ) కిషన్ ప్రసాద్, తహసీల్దార్ నాగార్జున, ఎంపీడీవో చిరంజీవి, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

# ఆర్టీసీ బస్సు.. టాటా ఏసీ ఆటో ఢీ

### అక్కడికక్కడే ఒకరు మృతి.. ఇద్దరు పరిస్థితి విషమం

- 20 మందికి స్వల్ప గాయాలు
- క్షతగాత్రులను పరామర్శించిన ప్రభుత్వ విప్ ఆది, జిల్లా ఎస్పీ





**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) :** మహారాష్ట్రకు చెందిన వ్యవసాయ కూలీలు వ్యవసాయ పనులు ముగించుకొని టాటా ఏసీ ఆటో వాహనంలో 23 మంది కూలీలతో వెళ్తున్న ఆటోను ఆర్టీసీ బస్సు వెనక నుండి ఢీకొట్టడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందారు. మరో 22 మంది గాయపడిన సంఘటన వేములవాడ అర్బన్ మండలంలో సంఘటన జరిగింది.సిరిసిల్ల మండలం లక్ష్మీపూర్ వద్ద వరి నాట్లు వేసి, బోయినపల్లి మండలం వరదవెల్లికి వెళ్తున్న కూలీల ఆటోను వేములవాడ అర్బన్ మండలం అనుపురం వద్ద వెనుక నుండి సిరిసిల్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఒకరు మృతిచెందారు. గాయపడిన వారిలో 11 మందిని వేములవాడ ఏరియా ఆసు పత్రికి, మరో 11 మందిని సిరిసిల్ల హాస్పిటల్ కి తరలించారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్ ఎంజీఎం కు తరలించారు. ఆటోలో మొత్తం 23 మంది కూలీలు ఉన్నట్లు సమాచారం. క్షతగాత్రులను ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్,జిల్లా ఎస్పీ మహేష్ బీ గీతె పరామర్శించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ పని ముగించుకుని వెళ్తున్న కూలీలకు ప్రమాదం జరగడం విచారకరమన్నారు. వీటిలో ఇద్దరు పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్ కు తరలించినట్లు, రాష్ట్ర ప్రభుత్వం తరఫున అందరికీ మెరుగైన వైద్యం అందిస్తామన్నారు. ప్రమాదం సంఘటన విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ వేములవాడ ఏరియా ఆసుపత్రికి వెళ్లి క్షతగాత్రులతో మాట్లాడారు. ఈ సంఘటనపై వేములవాడ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన

# పంచాయతీరాజ్ ఏఈ

- ఎం-బుక్ నమోదు కోసం డిమాండ్
- బైక్ సీటు కింద నుంచి నగదు స్వాధీనం



**కరీంనగర్ బ్యూరో, జూలై 9 (జనంసాక్షి) :** ప్రభుత్వ పనుల నిర్వహణలో లంచం డిమాండ్ చేసిన పంచాయతీరాజ్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్హ్యాండెడ్గా చిక్కాడు. కరీంనగర్ జిల్లా చొప్పదండి మండల పంచాయతీరాజ్ ఏఈ పైడి సతీష్ గురువారం రోజు రూ.10 వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకుని అరెస్టు చేశారు. ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం ఫిర్యాదుదారుడు చేపట్టిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించిన కొలతలను ఎం-బుక్లో నమోదు చేసి, నివేదికను డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్కు పంపించేందుకు ఏఈ పైడి సతీష్ రూ.10 వేల లంచం డిమాండ్ చేశాడు. బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో వారు పక్కా ప్రణాళికతో వల పన్ని గురువారం సాయంత్రం లంచం స్వీకరిస్తున్న సమయంలో రెడ్హ్యాండెడ్గా పట్టుకున్నారు. లంచంగా తీసుకున్న రూ.10 వేల నగదును నిందితుడు తన టీవీఎస్ జూపిటర్ ద్విచక్ర వాహనం సీటు కింద దాచగా, ఏసీబీ అధికారులు ఆ మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నారు. విధులను దుర్వినియోగం చేస్తూ, అక్రమంగా లంచం తీసుకున్నందుకు ఏఈపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. అనంతరం ఆయనను కరీంనగర్ ప్రత్యేక ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. భద్రతా కారణాల దృష్ట్యా ఫిర్యాదుదారుడి వివరాలను అధికారులు వెల్లడించలేదన్నారు. ఈ సందర్భంగా ఏసీబీ అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరైనా అధికారి లేదా ఉద్యోగి లంచం డిమాండ్ చేస్తే వెంటనే టోల్ఫ్రీ నంబర్ 1064కు సమాచారం ఇవ్వాలని కోరారు. అలాగే వాట్సాప్ 9440446106, ఫేస్బుక్లో తెలంగాణ ఏసీబీ, ఎక్స్ (ట్విట్టర్)లో ఏతెలంగాణ ఏసీబీ ద్వారా కూడా ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. ఫిర్యాదుదారుల వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.

# ఆర్ఎఫ్‌సిఎల్‌లో మరో రెండు రోజుల్లో ఉత్పత్తి ప్రారంభం..?

**గోదావరిఖని, జనంసాక్షి :** పెద్దపెల్లి జిల్లా రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్ లిమిటెడ్ (ఆర్ ఎఫ్ సి ఎల్)లో మరో రెండు రోజుల్లో యూరియా, అమోనియా ఉత్పత్తి ప్రారంభించనున్నట్టు అనధికార వర్గాల ద్వారా తెలిసింది. ఆర్ఎఫ్ ప్లాంట్లో సాంకేతిక లోపాలతో ఉత్పత్తి నిలిచిపోయింది. స్టాక్ ఉన్న యూరియా అమోనియాను ఇతర రాష్ట్రాలకు సప్లై చేస్తున్నట్లు తెలిసింది. ఉత్పత్తికి ఎలాంటి నష్టం వాటిల్ల లేదని తెలిసింది. సాంకేతిక లోపంతో తలెత్తిన ఈ సమస్యను టెక్నీషియన్స్ 24 గంటలు పనిచేస్తున్నారు. ఒకటి రెండు రోజుల్లో షట్ డౌన్ నుంచి బయటికి వచ్చి పూర్తిస్థాయి ఉత్పత్తి తీయనున్నారు. సాంకేతిక లోపాలతో తలెత్తిన ఈ సమస్యకు పరిష్కారాన్ని మరో రెండు రోజుల్లో చూపనున్నారు.

# వరికి ప్రత్యామ్నాయ పంటలపై రైతులను ప్రోత్సహించాలి

- లోటు వర్షపాతంలో కరీంనగర్ జిల్లా
- వ్యవసాయ ఆధికారులు నిత్యం క్షేత్రస్థాయిలో ఉండాలి
- జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్ బ్యూరో, జులై 9 (జనంసాక్షి) :** జిల్లాలో లోటు వర్షపాతం నమోదవుతున్నందున, ఎల్ నినో ప్రభావం చూపే అవకాశం ఉన్నందున వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగు దిశగా రైతులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఎల్ నినో ప్రభావం, వానాకాలం సాగు, తదుపరి కార్యాచరణ అంశం పై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న అనంతరం జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా వ్యవసాయ, నీటిపారుదల తదితర శాఖల అధికారులతో మాట్లాడారు. కరీంనగర్ జిల్లాలో ఇప్పటివరకు లోటు వర్షపాతం ఉందని, ఎల్ నినో ప్రభావం కనిపిస్తున్నందున రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించాలని అన్నారు. రైతు వేదికల్లో వ్యవసాయ అధికారులు సమావేశాలు నిర్వహించి రైతులకు సూచనలు అందించాలన్నారు. ఆరుతడి పంటలు, పప్పు ధాన్యాలు, తృణ ధాన్యాలు, నూనె గింజలు, కూరగాయలు వంటి పంటల సాగు ఆవశ్యకత తెలియజేయాలని ఆదేశించారు. దీనివల్ల ఎల్ నినో ప్రభావాన్ని కొంతమేర అధికమించవచ్చని, రైతులకు నష్టం జరగకుండా ఉంటుందని సూచించారు. జిల్లాలో బావులు, బోరుబావుల ద్వారా ఎక్కువ మొత్తంలో పంటలు సాగు అవుతున్నందున, ఆరుతడి పంటలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని, తక్కువ నీటితో పంట చేతికి వస్తుందని అన్నారు. ఆన్లైన్ ద్వారా యూరియా అమ్మకాల ప్రక్రియ కొనసాగుతున్నందున జిల్లాలో ఎరువుల పంపిణీకి ఎలాంటి ఇబ్బందులూ ఉండబోవని అన్నారు. యూరియా అమ్మకాల ప్రక్రియను వ్యవసాయ అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశించారు. ప్రభుత్వం సూచించిన ఏడు రకాల సన్న వడ్లను మాత్రమే సాగు చేయాలని, తద్వారా బోనస్ పొందవచ్చని కలెక్టర్ తెలిపారు. ప్రతి రైతు వేదికను ఉపయోగించుకొని స్థానిక ప్రజా ప్రతినిధుల సహకారంతో రైతులకు వానాకాలం వ్యవసాయానికి సంబంధించిన ప్రతి సూచన తెలియజేయాలని, నీటిపారుదల శాఖ అధికారులు నీటి లభ్యత, విడుదల తదితర అంశాలపై పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని, వ్యవసాయ, నీటిపారుదల శాఖలు సమన్వయంతో రైతు శ్రేయస్సు కోసం పనిచేయాలని తెలిపారు. వ్యవసాయ శాఖ ద్వారా ప్రతి రైతుకు సాంకేతిక సలహాలు, వాతావరణ సూచన, పంటల ఎంపికపై మార్గదర్శకాలు ఇవ్వాలన్నారు. జిల్లాలో పరిస్థితిని ఎప్పటికప్పుడు మండలాల వారీగా సమీక్షిస్తానని తెలిపారు. అధికారుల సూచనలు రైతులు పాటించాలని, ఎలాంటి వదంతులను నమ్మవద్దని కోరారు. ఎల్ నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని వివరించారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు నిత్యం అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. వీబిజిరామ్ జి పథకం అమలుకు సరైన ప్రణాళిక రూపొందించి కూలీలకు వీలైనన్ని ఎక్కువ పని దినాలు కల్పించాలని తెలిపారు.

# సివిల్ సర్వీసెస్ ఉచిత కోచింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

### ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు హైదరాబాద్‌లో రెసిడెన్షియల్ శిక్షణ




**కరీంనగర్ టౌన్, జూలై 09, (జనం సాక్షి) :** హైదరాబాద్‌లోని తెలంగాణ స్టడీ సర్కిల్ ద్వారా సివిల్ సర్వీసెస్-2027 పరీక్షలకు ఉచిత రెసిడెన్షియల్ కోచింగ్ అందించేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తు న్నారు. తెలంగాణకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థులు ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.3 లక్షల లోపు ఉండాలి. ఎంపికైన వారికి సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ-2027 పరీక్ష పూర్తయ్యే వరకు రెసిడెన్షియల్ విధానంలో ఉచిత శిక్షణ అందించనున్నారు. దరఖాస్తుల స్వీకరణకు జూలై 19, 2026 చివరి తేదీ కాగా, ప్రవేశ పరీక్ష జూలై 29, 2026న నిర్వహించనున్నారు. పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో జరుగుతుంది. పార్ట్-ఏ (జనరల్ స్టడీస్)కు 200 మార్కులు, పార్ట్-బీ (సీఎస్‌ఏటీ)కు 100 మార్కులు కేటాయించారు. ఆన్‌లైన్ దరఖాస్తు లను సమర్పించవచ్చు. మరిన్ని వివరాలకు 040-23546552, 8121626423 నంబర్లను సంప్రదించవచ్చు. 1980లో స్థాపించబడిన తెలంగాణ స్టడీ సర్కిల్ ద్వారా ఇప్పటివరకు 437 మంది సివిల్ సర్వీసెస్‌లో ఎంపికయ్యారు. వీరిలో 52 మంది ఐఏఎస్, 56 మంది ఐపీఎస్, 2 మంది ఐఎఫ్ఓఎస్, 327 మంది ఇతర కేంద్ర సర్వీసుల్లో ఎంపికయ్యారు. 2026 సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్‌లో 24 మంది సివిల్ సర్వీసెస్ మెయిన్స్‌కు, 4 మంది ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్‌కు అర్హత సాధించారు.

# భూముల రీసర్వేను ఆధునిక సాంకేతికతతో పారదర్శకంగా చేపట్టాలి

- ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో మొదటి దశ సర్వే
- డీజీపీఎస్, జీఐఎస్, రోవర్స్‌తో స్పష్టమైన యాజమాన్య హక్కులు
- 60 రోజుల్లోగా భూభారతి దరఖాస్తులు పరిష్కరించాలి
- గ్రామసభలతో ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలి



**కామారెడ్డి, జులై 9 (జనం సాక్షి):** భూముల రీసర్వేను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అత్యంత పారదర్శకంగా నిర్వహించి ప్రతి భూమికి స్పష్టమైన యాజమాన్య హక్కులు కల్పించాలని రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం భూముల రీసర్వేను దశలవారీగా చేపడుతోందని, తొలి దశలో ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సర్వేతో ప్రతి సర్వే నంబర్‌కు స్పష్టమైన యాజమాన్య హక్కులు నిర్ధారించడంతో పాటు ప్రతి భూమికి ప్రత్యేక భూధార్ యూనిక్ నంబర్ కేటాయించనున్నారు. డీజీపీఎస్, రోవర్స్, జీఐఎస్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి రీసర్వే చేపట్టాలని సూచించారు. రీసర్వే జరుగుతున్న ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించి ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని, ఆ గ్రామసభల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, మంత్రులను భాగస్వామ్యం చేయాలని ఆదేశించారు. రెగ్యులర్ సర్వేయర్లతో పాటు లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలను కూడా వినియోగించుకోవాలని తెలిపారు. సోమవారం నుంచి సర్వేయర్లు, జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, ఇతర సిబ్బందికి బ్యాచ్‌ల వారీగా సమగ్ర శిక్షణ ఇచ్చి అనంతరం అన్ని గ్రామాల్లో రీసర్వే కార్యక్రమాలు ప్రారంభించాలని లోకేష్ కుమార్ స్పష్టం చేశారు. జిల్లాలో రీసర్వే పనులను వేగవంతం చేసేందుకు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ కీలక సూచనలు చేశారు. డైలీ ప్రోగ్రెస్ రిపోర్టును స్ప్రెడ్ షీట్ రూపంలో ప్రతిరోజూ సమర్పించాలని, లైసెన్స్ సర్వేయర్లతో సమావేశం నిర్వహించి వారి పాత్ర, బాధ్యతలపై స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని అడిషనల్ కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు. నిర్ణీత గడువులోగా నాణ్యతతో రీసర్వే ప్రక్రియను పూర్తి చేయాలని, ఎలాంటి జాప్యానికి తావు ఇవ్వొద్దని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

# మన్ననూర్ రెసిడెన్షియల్ విద్యార్థులకు ఫుడ్ పాయిజన్

- 27 మంది విద్యార్థులకు అస్వస్థత.. తక్షణ వైద్య పరీక్షలు
- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం: జిల్లా అడిషనల్ కలెక్టర్ దేవ సహాయం



**అమ్రాబాద్, జూలై 09 (జనం సాక్షి):** రెసిడెన్షియల్ స్కూల్ లో మార్నింగ్ టిఫిన్ చేసిన విద్యార్థులు పలువురు అస్వస్థతకు గురై ఇబ్బంది పడిన సంఘటన నాగర్కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మన్ననూరులోని రెసిడెన్షియల్ (పీటిజి) స్కూల్లో జరిగింది. మన్ననూరులోని పి వి టి జి బాలుర గురుకుల పాఠశాలలో గురువారం ఉదయం అల్పాహారం తీసుకున్న కొద్దిసేపటికి కొంతమంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వారిని పాఠశాల ప్రిన్సిపాల్ పద్మావతి, సిబ్బంది హుటాహుటిన స్థానిక ప్రభుత్వ వైద్య కేంద్రానికి తరలించగా డాక్టర్ సుధాకర్ ప్రథమ చికిత్స అందజేశారు. అందులో 27 మందికి ఫుడ్ పాయిజన్ కాగా అందరి పరిస్థితి బాగానే ఉందని డాక్టర్ తెలిపారు. కొందరు విద్యార్థులకు కాస్త నొప్పితో బాధపడుతున్న తరుణంలో మెరుగైన వైద్యం కోసం అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఫుడ్ పాయిజన్ కావడానికి నీటి కాలుష్యం అయి ఉండొచ్చునని డాక్టర్ ప్రాథమికంగా తెలిపారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. గత రెండు రోజుల నుండి మిషన్ భగీరథ వాటర్ నిలిచిపోయిందని, వంట చేయడానికి బోరు వాటర్ ఉపయోగించడం వలన వాటర్ ద్వారానే ఫుడ్ పాయిజన్ అయినట్టుగా ప్రాథమికంగా తెలుస్తుందన్నారు. విద్యార్థులందరూ బాగానే ఉన్నారని ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రిన్సిపాల్ తెలిపారు.

### ఘటన చర్యలు తీసుకుంటాం

విద్యార్థులను జిల్లా అడిషనల్ కలెక్టర్ దేవసహాయం, ఆర్డిఓ యాదగిరి, డీఎస్పీ శ్రీనివాసులు, డీఎంహెచ్వో కృష్ణా వెళ్లి పరిశీలించారు. వారికి అందుతున్న వైద్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ.. విధుల్లో అలసత్వం వహించి విద్యార్థులు ఇబ్బందులు గురికావడానికి కారణమైన ప్రిన్సిపల్ వార్డెన్ పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాఠశాలలోని డార్మెంటరీ ఇతర పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయని చెప్పారు. రికార్డులు సైతం సరిగ్గా నిర్వహించడం లేదన్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# బయ్యారం ఉక్కు తెలంగాణ ఆదివాసీల హక్కు

- పరిశ్రమ ఏర్పాటు చేస్తే ఆదివాసీల జీతాలు బాగుపడతాయి
- సింగరేణి ఆధ్వర్యంలో పరిశ్రమ ఏర్పాటు చేయాలి
- ఈ నెల 20 నుంచి నిరసన
- తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత



**బయ్యారం, జూలై 08(జనం సాక్షి) :** తెలంగాణ మలి ఉద్యమాన్ని ఉగ్రూతలూగించిన బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కార్యరూపం దాల్చడానికి ఏ రాజకీయ పార్టీ చిత్తశుద్ధితో పని చేయలేదని తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవిత ఆరోపించారు. బుదవారం ఆమె బయ్యారం ఇనుప గుట్టను సందర్శించారు. ఈ సంధర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ పునర్విభజన చట్టంలో బయ్యారం లో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని స్పష్టంగా పేర్కొన్నారని కానీ వివిధ కారణాలు చూపుతూ ఏర్పాటు చేయలేదని ఏ పార్టీ ఆదిశగా కృషి చేయలేదని తెలంగాణ రక్షణ సేన పరిశ్రమ ఏర్పాటు కోసం పోరాడుతుందని అన్నారు. బయ్యారం తోపాటు గూడూరు, గార్ల మండలాలతో పాటు పక్కనే ఉన్న ఛత్తీస్ గడ్ లో కూడా ముడి ఇనుము పుష్కలంగా ఉందని సింగరేణి ఆధ్వర్యంలో పరిశ్రమ ఏర్పాటు చేస్తే ఈ ప్రాంత అభివృద్ధితో పాటు వేలాది మంది కి నిరుద్యోగులకు ఉద్యోగ,ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. అధికారమే లక్ష్యంగా కాంగ్రెస్ నేతలు ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి అధికారం చేజిక్కిన తర్వాత ఏ ఒక్కటి పూర్తిగా అమలు చేయలేదని విమర్శించారు. మహిళలకు 25 వందలు, భూమిలేని పేదలకు 12 వేలు,విద్యార్థులకు ఫీజు రాయితీ, రైతు రుణమాఫీ ఇలా ఏది అమలు చేయలేదని ఆరోపించారు. కేవలం తెలంగాణ అభివృద్ధి కోసమే తాను పార్టీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాం గ్రెస్,బిజెపి లు దేశవ్యాప్త పార్టీలని, తెలంగాణకోసం ఏర్పడ్డ బి ఆర్ ఎస్ కుడా దేశం కోసం పని చేస్తానని చెబుతున్నదని విమర్శించారు. మన తెలంగాణ కోసం కొట్లాడే పార్టీ ఉండాలనే లక్ష్యంతో తెలంగాణ రక్షణ సేన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తెలంగాణ వనరులు, ఉద్యోగాలు, నీళ్ళు కాపాడుకోవడం కోసం టి ఆర్ ఎస్ పోరాడుతుందని స్పష్టం చేశారు. సింగరేణి ని ప్రవేట్ పరం చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నదని దాని రక్షించుకోవడం కోసం పోరాడుతామని తెలిపారు. సింగరేణిలో 38 వేల మంది పనిచేస్తున్నారని,అదేవిధంగా సంస్థలో డిపెండెంట్ లకు ఉద్యోగాలు ఇవ్వక పోతే ఈ నెల 20 నుంచి అన్నం,నీళ్లు మాని నిరాహార దీక్ష చేస్తానని ప్రభుత్వాన్ని హెచ్చరించినట్లు ఆమె తెలిపారు. బయ్యారం పెద్దగుట్ట సమీపంలోని చర్లపల్లి గ్రామంలో జరిగిన సమావేశంలో బి ఆర్ ఎస్ నాయకులు కె టి ఆర్,హరీష్ రావు పై తీవ్రవిమర్శలు చేసారు.తనను రాజకీయ పార్టీ పెట్టకుండా బి ఆర్ ఎస్ నాయకులు,కాంగ్రెస్,బిజెపి తో కలిసి అనేక కుట్రలు చేశారని ఆరోపించారు. ఎవరెన్ని కుట్రలు,కుతంత్రాలు పన్నినా తెలంగాణ రాష్ట్ర అభివృద్దే లక్ష్యంగా పని చేస్తానని తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో వాసం రామకృష్ణ,కిషన్ నాయక్,పొడుగు శ్రీనాథ్, వట్టం సారయ్య పాల్గొన్నారు.

# 5వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ క్రీడల్లో తెలంగాణ పోలీస్ అకాడమీ

- 26 పతకాలతో అకాడమీ క్రీడాకారుల అద్భుత ప్రతిభ



**హైదరాబాద్, జూలై 9 (జనంసాక్షి) :** జూలై 7 నుంచి 9 వరకు హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన 5వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ మీట్ – క్లస్టర్ (ఏ) పోటీలలో తెలంగాణ పోలీస్ అకాడమీ (టీజీపీఏ) క్రీడాకారులు విశేష ప్రతిభ కనబరిచి మొత్తం 26 పతకాలు సాధించి అకాడమీకి మరోసారి గర్వకారణంగా నిలిచారు. అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ నాయకత్వంలో, అసిస్టెంట్ డైరెక్టర్ టి.ఎ. భరత్ పర్యవేక్షణలో పోటీలకు సిద్ధమైన అకాడమీ జట్టు వివిధ క్రీడాంశాల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచింది. వెయిట్ లిఫ్టింగ్, యోగా, పెంచక్ సిలాట్, , తైక్వాండో, ఆర్మ్ రెజ్లింగ్, బాడీ బిల్డింగ్, రెజ్లింగ్ వంటి విభాగాల్లో క్రీడాకారులు ప్రతిభ చాటుతూ మొత్తం 3 స్వర్ణ, 9 రజత, 14 కాంస్య పతకాలను కైవసం చేసుకున్నారు. మహిళా, పురుష క్రీడాకారులు సమాన ఉత్సాహంతో పోటీల్లో పాల్గొని వ్యక్తిగత, జట్టు విభాగాల్లో విజయాలు సాధించడం విశేషం. ఈ విజయాలు అకాడమీలో అందిస్తున్న నాణ్యమైన శిక్షణ, క్రమశిక్షణ, శారీరక దృఢత్వానికి నిదర్శనంగా నిలిచాయి. పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను అకాడమీ డైరెక్టర్ అభినందిస్తూ, రాష్ట్ర పోలీసు శాఖకు మరిన్ని విజయాలు అందించాలని ఆకాంక్షించారు. క్రీడాస్ఫూర్తి, శారీరక సామర్థ్యం, మానసిక దృఢత్వం ప్రతి పోలీసు ఉద్యోగికి అత్యంత అవసరమని పేర్కొన్నారు. తెలంగాణ పోలీస్ అకాడమీ నుండి పాల్గొన్న 26 మందిలో పోలీస్ కానిస్టేబుల్ వై శ్రీను 7 , పి సి పరశు రామ్ 4 ,ఏ ఆర్ ఎస్ ఐ ఆంజనేయులు 3, హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ 2, ఏ ఆర్ ఎస్ ఐ వవజరెడ్డి 2, పి సి లు మాధురి,పద్మావతి, లు 2 చొప్పున, డి ఎస్ పి జగదీశ్వర్ , హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్, ఏ ఆర్ ఎస్ ఐ సురేష్ లు ఒక్కోటి చొప్పున 26 వివిధ క్రీడల్లో సాధించారు.వారు సాధించిన పతకాల వివరాలు స్వర్ణ పతకాలు 3, రజత పతకాలు 9, కాంస్య పతకాలు 14, మొత్తం పతకాలు 26 సాధించారు. రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడల్లో తెలంగాణ పోలీస్ అకాడమీ క్రీడాకారులు సాధించిన ఈ విజయాలు అకాడమీ క్రీడా సంస్కృతికి, శిక్షణా నాణ్యతకు, సిబ్బంది అంకితభావానికి మరో మైలురాయిగా నిలిచాయి. అకాడమీ టీం మేనేజర్‌గా డిఎస్‌పి తిరుపతి వ్యవహరించారు.

# మూలుగుతున్న నక్కపై తాటికాయ

- రామగుండం ఎరువల కర్మాగారం రిపేరు
- రైతు గుండె బేజారు




**పెద్దపల్లి, రామగుండం, (జనం సాక్షి ప్రతినిధి) :** పెద్దపల్లి జిల్లాలోని రామగుండం ఎరువుల కర్మాగారం (ఆర్‌ఎఫ్‌సీఎల్)లో గురువారం ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోయింది. ప్లాంటులోని అమ్మోనియా పైప్‌లైన్‌లో లీకేజీ తలెత్తడంతో యాజమాన్యం అన్ని యూనిట్లను మూసివేసింది. సాంకేతిక లోపం కారణంగానే ఈ లీకేజీ ఏర్పడినట్టు అధికార వర్గాలు తెలిపాయి. సమస్యను సరిచేసి తిరిగి ఉత్పత్తిని ప్రారంభించేందుకు కనీసం వారం రోజుల సమయం పట్టవచ్చని కంపెనీ వర్గాలు పేర్కొన్నాయి. తెలంగాణకు యూరియా అందించే ఏకైక దేశీయ కర్మాగారం ఇదే కావడంతో, ఖరీఫ్ సీజన్ కీలక దశలో ఈ పరిణామం రైతుల్లో ఆందోళన కలిగిస్తోంది. ఆర్‌ఎఫ్‌సీఎల్ నుంచి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా మరో ఐదు రాష్ట్రాలకు యూరియా సరఫరా జరుగుతుండటంతో, ప్లాంటు మూతపడటం ఖరీఫ్ సీజన్‌లో ఎరువుల సరఫరాపై ప్రభావం చూపే అవకాశం ఉందని వ్యవసాయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

ఆర్‌ఎఫ్‌సీఎల్ యూరియా ప్లాంటు పూర్తి సామర్థ్యం రోజుకు 3,850 మెట్రిక్ టన్నులు (ఎంటీపీడీ) ప్లాంటు నిలిచిన ప్రతి రోజూ అంతే మొత్తంలో ఉత్పత్తి నష్టం వాటిల్లుతుంది. అధికారులు అంచనా వేస్తున్నట్టు పునఃప్రారంభానికి ఒక వారం సమయం పడితే, మొత్తం నష్టం సుమారు 27,000 టన్నుల (3,850 ఐ 7 రోజులు) వరకు చేరే అవకాశం ఉంది. మరమ్మతులు అంతకంటే ఎక్కువ సమయం తీసుకుంటే నష్టం ఆ మేరకు పెరుగుతుంది. రామగుండం ప్లాంటు మూతపడకముందే తెలంగాణలో యూరియా కేటాయింపులపై ఇప్పటికే ఒత్తిడి నెలకొంది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు 11.50 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరగా, కేంద్రం 10 లక్షల టన్నులకే పరిమితం చేసింది. ఏప్రిల్, మే, జూన్ నెలల్లో నెలకు 2 లక్షల టన్నుల చొప్పున, జూలై–ఆగస్టు నెలల్లో 1.5 లక్షల టన్నుల చొప్పున సరఫరా చేయాల్సి ఉన్నప్పటికీ, తొలి రెండు నెలల్లోనే కేటాయింపుల్లో గణనీయమైన కోతలు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో వరి నాట్ల సీజన్‌కు ముందు బఫర్ స్టాక్‌ను సిద్ధం చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించింది. ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో ఉత్పత్తయ్యే యూరియాలో కనీసం 90 శాతం తెలంగాణకే కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని ఇప్పటికే కోరింది. ఈ పరిస్థితుల్లో ప్లాంటు మూతపడటం రాష్ట్ర సరఫరా లెక్కలను మరింత దెబ్బతీసే అవకాశం ఉందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

ప్రపంచంలోనే అతిపెద్ద యూరియా దిగుమతిదారుగా ఉన్న భారత్, దేశీయ ఉత్పత్తికి అవసరమైన సహజవాయువులో అధిక భాగాన్ని గల్ఫ్ దేశాల నుంచి, ముఖ్యంగా ఒమన్, ఖతార్, సౌదీ అరేబియా నుంచి హోర్ముజ్ జలసంధి మీదుగా దిగుమతి చేసుకుంటోంది. పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధ పరిస్థితులు, హోర్ముజ్ జలసంధిలో రవాణాకు ఎదురైన అవాంతరాలు దేశానికి ఎల్‌ఎన్‌జీ సరఫరాపై ప్రభావం చూపాయి. దీంతో దేశంలోని పలు ఎరువుల కర్మాగారాలు ఇప్పటికే ఉత్పత్తిని తగ్గించడమో, వార్షిక మరమ్మతులను ముందుకు జరపడమో చేశాయి. ఫలితంగా అంతర్జాతీయ మార్కెట్‌లో యూరియా ధరలు ఒక దశలో దాదాపు 21 శాతం మేర పెరిగి, గత మూడేళ్లలో అత్యధిక స్థాయికి చేరాయి. భారత్ వార్షిక యూరియా అవసరం సుమారు 28–30 మిలియన్ టన్నులు ఉంటుందని అంచనా (కొన్ని గణాంకాల ప్రకారం మొత్తం వినియోగం 37–39 మిలియన్ టన్నుల వరకు ఉంటుందని కూడా పేర్కొంటున్నారు). ఇందులో 20–30 శాతం వరకు దిగుమతులపైనే ఆధారపడాల్సి వస్తోంది.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే సుమారు 9.8 మిలియన్ టన్నుల యూరియాను దిగుమతి చేసుకోగా, మరో 1.7 మిలియన్ టన్నులు రావాల్సి ఉంది. సంక్షోభ సమయంలో అత్యవసర టెండర్ల ద్వారా టన్నుకు 700 డాలర్ల వరకు చెల్లించి యూరియాను దిగుమతి చేసుకున్న సందర్భాలు కూడా నమోదయ్యాయి. యుద్ధానికి ముందు అంతర్జాతీయ ధర టన్నుకు 265–300 డాలర్ల మధ్య ఉండేది. ప్రపంచంలోనే అతిపెద్ద యూరియా ఉత్పత్తిదారుగా ఉన్న చైనా, తన ఎగుమతులపై కోటా విధానాన్ని అమలు చేస్తోంది. చైనా యూరియా ఉత్పత్తిలో అధిక భాగం బొగ్గు ఆధారితం కావడంతో, గల్ఫ్ ప్రాంతంలో గ్యాస్ సరఫరా అస్థిరతకు అది పెద్దగా ప్రభావితం కాదు. ఈ కారణంగా హోర్ముజ్ సంక్షోభ సమయంలో చైనా ఎగుమతులు ప్రత్యామ్నాయ వనరుగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. తమ ఎగుమతి ఆంక్షలను సడలించాలని భారత్ అధికారికంగా చైనాను కోరింది. అయితే ఈ అభ్యర్థనపై చైనా ఇంకా తుది నిర్ణయం ప్రకటించాల్సి ఉంది. గల్ఫ్ ప్రాంత సరఫరాలపై ఆధారపడటాన్ని తగ్గించుకునేందుకు భారత్ రష్యా, ఇండోనేషియా, మలేషియా, ఈజిప్టు దేశాల నుంచి యూరియా దిగుమతులను పెంచుకునే ప్రయత్నాల్లో ఉంది. అదే సమయంలో ఫాస్ఫేట్ కోసం మొరాకోతో దీర్ఘకాలిక ఒప్పందాలు, పొటాష్ కోసం రష్యాతో సంబంధాలను కూడా విస్తరించుకుంటోంది.

### క్షేత్రస్థాయిలో పరిణామాలు

ఖరీఫ్ సీజన్ కీలక దశలో, వరి నాట్లు జోరందుకున్న సమయంలో ప్లాంటు మూతపడటం రైతులకు ఇబ్బందికరంగా మారే అవకాశం ఉంది. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్ సహా మరో ఐదు రాష్ట్రాలకూ సరఫరాలో అంతరాయం తలెత్తవచ్చు. ఇప్పటికే కేంద్రం కేటాయింపుల్లో కోతలు విధించగా, తాజాగా ప్లాంటు మూతపడటంతో రాష్ట్ర బఫర్ స్టాక్‌పై మరింత ఒత్తిడి పెరగనుంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మీసేవ కేంద్రాల ద్వారా యూరియా బుకింగ్ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చింది. పట్టాదారు పాస్‌బుక్ నంబరుతో రైతులు మీసేవ ద్వారా యూరియాను బుక్ చేసుకోవచ్చు. ఓటీపీ ధ్రువీకరణ అనంతరం జారీ అయ్యే బుకింగ్ ఐడీ 48 గంటల పాటు చెల్లుబాటు అవుతుంది. రామగుండం ప్లాంటు ఎంత త్వరగా పునఃప్రారంభమవుతుందన్నది తెలంగాణ యూరియా సరఫరాపై ప్రత్యక్ష ప్రభావం చూపనుంది. అదే సమయంలో చైనా ఎగుమతి కోటాలపై తీసుకునే నిర్ణయం, హోర్ముజ్ జలసంధిలో పరిస్థితులు సాధారణ స్థితికి చేరడం వంటి అంశాలు దేశీయ యూరియా లభ్యతను నిర్దేశించనున్నాయి. ఈలోగా బఫర్ నిల్వలను జాగ్రత్తగా వినియోగించుకోవడం, నానో యూరియా వంటి ప్రత్యామ్నాయాలపై రైతులకు అవగాహన కల్పించడంపైనే రాష్ట్ర ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారించాల్సి ఉంటుంది.

# మందల సామేలుకు వ్యతిరేకం కాదు

- ఇద్దరం కూడా కాంగ్రెస్ కార్యకర్తల సపోర్ట్‌తో గెలిచాం
- పార్టీ నియామకాల అంశాన్ని పిసిసి దృష్టికి తీసుకెళ్లా
- భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి వెల్లడి

**హైదరాబాద్, జూలై9 (జనంసాక్షి) :** మందల సామేలుకు నేను వ్యతిరేకం కాదు..ఆయన తీసుకున్న నిర్ణయాలను కూడా వ్యతిరేకించడం లేదు..ఇద్దరం కూడా కాంగ్రెస్ కార్యకర్తల సపోర్ట్‌తో గెలిచాం. పార్టీ నియామకాల అంశాన్ని పిసిసి దృష్టికి తీసుకెళ్లానని, భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. తుంగతుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ పరిణామాలపై చామల కిరణ్ రెడ్డి స్పందించారు. తుంగతుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సంయమనం పాటించాలని సూచించారు. గురువారం ఎంపీ చామల మీడియాతో మాట్లాడుతూ.. తుంగతుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల మధ్య మనస్పర్థలు వచ్చినట్లు ప్రచారం జరుగుతోందన్నారు. ఎమ్మెల్యే మందుల సామేల్‌కు, ఎంపీగా తనకు ఎలాంటి పొలిటికల్ బ్యాక్ గ్రౌండ్ లేదని, అయినా కాంగ్రెస్ కార్యకర్తలు అక్కున చేర్చుకుని గెలిపించారన్నారు. 'నేను ఎమ్మెల్యే మందుల సామేల్‌కు వ్యతిరేకం కాదు. నేను తుంగతుర్తి నియోజకవర్గంలో మండల అధ్యక్ష పదవికి, పీఏసీఎస్ ఛైర్మన్ పదవికి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ పదవికి ప్రమోట్ చేయలేదు. కార్యకర్తల అభిప్రాయం మేరకు ఎవరిని కోరుకుంటే వారికే పదవులు ఇద్దామని మందుల సామేల్‌తో చెప్పాను. మందుల సామేల్ తీసుకునే నిర్ణయానికి నేను వ్యతిరేకం కాదు. నేను విదేశాల్లో ఉన్నప్పుడు మండల అధ్యక్షులను ప్రకటించారు. దీనిపై నాకు కాంగ్రెస్ కార్యకర్తలు ఫోన్ చేశారు. ఇదే అంశాన్ని నేను పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ దృష్టికి తీసుకువెళ్లాను. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సొంత మండలం తిరుమలగిరి, నా సొంత మండలం శాలి గౌరారం తుంగతుర్తి లోనే ఉన్నాయి. సూర్యాపేట, యాదాద్రి, భువనగిరి డీసీసీ అధ్యక్షులు, పార్లమెంట్ అబ్జర్వర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కారం చేస్తామని చెప్పాను. మండల స్థాయిలో కార్యకర్తలు.. ఎవరికి ఎక్కువగా మద్దతు ఇస్తే వారికే అవకాశం ఇద్దాం. పదవుల కోసం రో÷–డడెక్కి కొట్టుకుంటే ప్రజల్లో చులకన అవుతాము. తుంగతుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ కేడర్ సమన్వయం పాటించాలి. మనకు పదవులు వచ్చాయి. మన గెలుపు కోసం పని చేసిన కేడర్‌ను పట్టించుకోవాలి. ప్రజలు నమ్మకంతో మమ్మల్ని గెలిపించారు. అభివృద్ధి చేయాల్సిన బాధ్యత మాపైన ఉంది' అని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సూచించారు.

# ఘనంగా ముగిసిన క్లస్టర్-ఎ 5వ తెలంగాణ పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్

- రాష్ట్రవ్యాప్తంగా 21 పోలీస్ యూనిట్ల నుంచి పాల్గొన్న 831 మంది పోలీస్ క్రీడాకారులు
- హైదరాబాద్ కమిషనరేట్‌కు ఓవరాల్ ఛాంపియన్‌షిప్
- ద్వితీయ స్థానం సాధించిన టీజీఎస్పీ-2, తృతీయ స్థానంలో నిలిచిన మల్కాజిగిరి కమిషనరేట్



**హైదరాబాద్, జూలై 09 (జనంసాక్షి) :** మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో నిర్వహించిన 5వ తెలంగాణ పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్–2026 (క్లస్టర్–ఎ) రెండు రోజుల పాటు అత్యంత ఉత్సాహభరితంగా, క్రీడా స్ఫూర్తిని ప్రతిబింబిస్తూ విజయవంతంగా ముగిసింది. జూలై 8, 9 తేదీల్లో సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఈ ప్రతిష్ఠాత్మక క్రీడా పోటీల్లో తెలంగాణ రాష్ట్రంలోని వివిధ పోలీస్ యూనిట్లకు చెందిన అధికారులు, సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ క్రీడలను జూలై 8న తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) సి.వి. ఆనంద్ స్పోర్ట్స్ టార్చ్‌ను అందించి ఈ పోలీసు క్రీడలను ఘనంగా ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్, పోలీస్ (పి అండ్ ఎల్, స్పోర్ట్స్) ఇన్‌స్పెక్టర్ జనరల్ డా. గజారావు భూపాల్, ప్రముఖ సినీ నటుడు నవీన్ పోలిశెట్టి, పలువురు ఉన్నతాధికారులు, క్రీడాకారులు, విద్యార్థులు, మీడియా ప్రతినిధులు, విశిష్ట అతిథులు పాల్గొన్నారు. మల్కాజ్గిరి సిపి సుమతి మాట్లాడుతూ, తెలంగాణ పోలీస్ సిబ్బందిలో శారీరక దృఢత్వం, మానసిక స్థైర్యం, క్రమశిక్షణ మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ ఆధ్వర్యంలో తెలంగాణ పోలీస్ క్రీడలకు నూతన దిశను చూపే సంస్కరణలు అమలులోకి వచ్చాయన్నారు. ఈ ఏడాది తొలిసారిగా రాష్ట్ర పోలీస్ గేమ్స్‌ను ఐదు క్లస్టర్లలో నిర్వహించే విధానాన్ని ప్రవేశపెట్టడం ద్వారా సీవీ ఆనంద్ పోలీస్ క్రీడల చరిత్రలో ఒక కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టారన్నారు. ఈ విధానం వల్ల మరింత మంది అధికారులు, సిబ్బంది తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించే అవకాశం పొందుతారని, ప్రతిభావంతులను గుర్తించి అఖిల భారత పోలీస్ గేమ్స్‌తో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలకు సిద్ధం చేయడం మరింత సులభమవుతుందని పేర్కొన్నారు. క్లస్టర్–ఏ లో భాగంగా మొత్తం 14 ఇండోర్ క్రీడా విభాగాల్లో పోటీలు నిర్వహించారు. వీటిలో రెజ్లింగ్, బాక్సింగ్, బాడీ బిల్డింగ్, ఆర్మ్ రెజ్లింగ్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, యోగా, జూడో, వుషు (టావోలుతో సహా), తైక్వాండో, కరాటే, పెన్చాక్ సిలాట్, ఫెన్సింగ్, జిమ్నాస్టిక్స్ విభాగాల్లో వివిధ కేటగిరీల్లో పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 21 పోలీస్ యూనిట్లకు చెందిన మొత్తం 831 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో 683 మంది పురుషులు, 148 మంది మహిళా పోలీస్ సిబ్బంది ఉన్నారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ, మల్కాజిగిరి వంటి కమిషనరేట్లు, జిల్లా పోలీస్ యూనిట్లు, తెలంగాణ స్పెషల్ పోలీస్ (టీజీఎస్పీ), ఆర్‌బీవీఆర్‌ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీ, పోలీస్ ట్రైనింగ్ కాలేజీలు, గ్రేహౌండ్స్, ఆక్టోపస్, కమ్యూనికేషన్స్, పోలీస్ కంప్యూటర్ సర్వీసెస్ అండ్ స్టాండర్డ్స్ , పోలీస్ ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్ , ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ బ్యూరో, తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో, సీఐడీ, రైల్వే పోలీస్ తదితర యూనిట్లు పాల్గొన్నాయి. పోటీలు అత్యంత క్రమశిక్షణతో, ఉన్నత ప్రమాణాలతో నిర్వహించగా, క్రీడాకారులు విశేష ప్రతిభను కనబరిచారు. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ అత్యుత్తమ ప్రదర్శనతో మొత్తం 140 పతకాలు సాధించి ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచింది. ఇందులో 64 స్వర్ణ, 44 రజత, 32 కాంస్య పతకాలు ఉన్నాయి. తెలంగాణ స్పెషల్ పోలీస్–2లో 58 పతకాలతో ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఇందులో 19 స్వర్ణ, 16 రజత, 23 కాంస్య పతకాలు ఉన్నాయి. మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ కూడా 58 పతకాలు సాధించి తృతీయ స్థానంలో నిలిచింది. ఇందులో 12 స్వర్ణ, 20 రజత, 26 కాంస్య పతకాలు ఉన్నాయి.

### క్లస్టర్ విధానంలో తొలిసారిగా క్రీడల నిర్వహణ

ఈ ఏడాది నుంచి తెలంగాణ పోలీస్ గేమ్స్‌ను ఆల్ ఇండియా పోలీస్ గేమ్స్ క్యాలెండర్‌కు అనుగుణంగా క్లస్టర్ విధానంలో నిర్వహిస్తున్నారు. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా మరింత మంది పోలీస్ సిబ్బందికి పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పించడంతో పాటు, క్రీడలను మరింత శాస్త్రీయంగా, సమర్థవంతంగా నిర్వహించే వీలుకలిగింది. క్లస్టర్–ఏ విజయవంతంగా ముగిసిన అనంతరం సెప్టెంబర్––2026లో క్లస్టర్–సీ పోటీలు ఆర్‌బీవీఆర్‌ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీలో, అనంతరం నవంబర్‌లో క్లస్టర్–బీ పోటీలు ఫ్యూచర్ సిటీ కమిషనరేట్‌లో, క్లస్టర్–డీ పోటీలు వరంగల్ కమిషనరేట్‌లో, అలాగే క్లస్టర్–ఈ పోటీలు మరియు ముగింపు వేడుకలు నిజామాబాద్ కమిషనరేట్‌లో నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. తెలంగాణ పోలీస్ గేమ్స్ ద్వారా పోలీస్ సిబ్బందిలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడంతో పాటు శారీరక దృఢత్వం, మానసిక స్థైర్యం, జట్టు స్ఫూర్తి, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించడం ప్రధాన లక్ష్యమని అధికారులు తెలిపారు. జాతీయ స్థాయి పోలీస్ క్రీడల్లో తెలంగాణకు ప్రాతినిధ్యం వహించే క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు ఈ పోటీలు కీలక వేదికగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగింది. వసతి, భద్రత, రవాణా, వైద్య సేవలు, సాంకేతిక నిర్వహణ, పోటీల నిర్వహణ తదితర అంశాల కోసం ఏర్పాటు చేసిన ఐదు ప్రత్యేక కమిటీలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేశాయి. విజేతలకు ఉప్పల్ జోన్ డీసీపీ కె. సురేష్ కుమార్, ఐపీఎస్, సీఏఆర్ మల్కాజిగిరి డీసీపీ కె. శ్యామ్ సుందర్ తదితర సీనియర్ పోలీస్ అధికారులు పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా పోటీల నిర్వహణలో అహర్నిశలు శ్రమించిన డిప్యూటీ కమిషనర్లు, అదనపు డిప్యూటీ కమిషనర్లు, అసిస్టెంట్ కమిషనర్లు, ఇన్‌స్పెక్టర్లు, సబ్‌ఇన్‌స్పెక్టర్లు, మినిస్టీరియల్ సిబ్బంది, టెక్నికల్ అధికారులు, వాలంటీర్లుకు మల్కాజిగిరి సిపి సుమతి అభినందనలు తెలిపారు. ఈ విజయవంతమైన క్లస్టర్ – ఏ ముగింపు తెలంగాణ పోలీస్ సిబ్బందిలో ఫిట్‌నెస్, క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తి, పరస్పర సహకారం, వృత్తి నైపుణ్యాలను మరింత పెంపొందించేందుకు మరో మైలురాయిగా నిలిచిందని, ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించే ఆరోగ్యవంతమైన పోలీస్ వ్యవస్థ నిర్మాణానికి ఈ క్రీడలు విశేషంగా దోహదపడతాయని ఉన్నతాధికారులు పేర్కొన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370